ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16
కడప
శనివారం 12 ఆగస్టు 2017




వణికిస్తున్న విషజ్వరాలు

- విజృంభిస్తున్న డెంగ్యూ.. మలేరియా
- డెంగ్యూ లక్షణాలతో ఇద్దరు విద్యార్థులు మృతి
- పడమటికోన దళితవాడ విలవిల


జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు

ప్రాణాలు పోయాక స్పందిస్తున్నారు



- ధర్మయ్య, దళితవాడ

గ్రామంలో మురికి నీటి కాల్వలు శుభ్రం చేయడం లేదు. మురికి నీరులో దోమలు పెరిగి కుడుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరాలతో ప్రాణాలు పోతున్నాయి. మనుషులు చనిపోయాక అధికారులు స్పందిస్తున్నారు. మురికి కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. డీడీటీ. పైరత్రం పిచికారీ చేస్తున్నారు.. ముందే ఇలాంటి చర్యలు తీసుకొని వుంటే జ్వరాలు వచ్చేవి కాదు, ప్రాణాలు పోయేవి కాదు.

రాయచోటి ప్రాంతంలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే చిన్నమండెం మండలంలో ఇద్దరు మృత్యువాత పడగా.. పదుల సంఖ్యలో బాధితులు బెంగుళూరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఓ వైపు వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిసున్నా.. ఈ జ్వరాలు అదుపు కావడం లేదు. ఫలితంగా బాధితులు వేలాది రూపాయలు ఖర్చు చేసుకుని బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళుతున్నారు. 6 లో

అసహనంతో ఒనగూరే ప్రయోజం ఏమీ లేదు. ఓర్పు వహించండి. విజయం మిమ్మల్ని తప్పక వరిస్తుంది. - స్వామి వివేకానంద

నేటి యువతే రేపటి భవిత అంటారు. యువ శక్తి అపారమైనది. దేశ ఉన్నతికి, ఔన్నత్యానికి ఈ శక్తి పణంగా పెడితే అన్నీ తిరుగులేని విజయాలే. వారి విజయాలు వ్యక్తిత్వం మాత్రమే కాదు. సామాజికమైనవి. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రగతి కి బాటలు వేస్తాయి. ఈ శక్తి ఎపుడూ అనుకూల పథంలో సాగాల్సి ఉంటుంది. యువశక్తి దేశానికి ఎంత మేలు చేస్తుందో.. గతి తప్పితే అంతకు రెట్టింపు కీడు చేస్తుంది.

యువతా... మేలుకో

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ఫీచర్ మధ్యపేజీలలో

గనుల శాఖపై ఏసీబీ దాడి

రూ.2.35 లక్షల స్వాధీనం... ఏడీ సహా సిబ్బందిపై కేసు

కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని గనులు, భూగర్భశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంపై శుక్రవారం సాయంత్రం కడప అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఎటువంటి ఆధారాలు లేని రూ.2,35,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడీ సహా సిబ్బందిపై కేసు నమోదు చేశారు.


3 లో
స్వాధీనం చేసుకున్న నగదుతో ఏసీబీ డీఎస్పీ నాగరాజు


6 లో

రూ. 2 కోట్ల భూమి స్వాహాయత్నం

- రంగంలోకి రాజకీయ పెద్దలు
- అట్లూరు మండలంలో ఆగని భూమాయాజాలం

అది... కడప వెళ్లే రహదారికి సమీపంలో రూ.2 కోట్లు విలువచేసే ప్రభుత్వస్థలం. ఖాళీగా ఉన్న ఈ స్థలంపై పలువురి కళ్లుపడ్డాయి. కొన్ని పెద్ద తలలు నిబంధనల ముసుగులో ఈ స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నాయి. అట్లూరు మండలం ఎస్. వెంకటాపురం వద్ద ఉన్న ఈ ప్రభుత్వ ఖాళీ స్థలానికి ఎసరు ముంచుకొస్తోంది.



పేకాడుకుందాం..రా!

అదేంటీ.. డైరెక్టుగానే పేకాడుకుందాం రా.. అంటున్నారు..? ప్రభుత్వం బహిరంగ జూదానికి అర్ధరాత్రి ఏమైనా అనుమతిచ్చిందని భావిస్తున్నారా ? అదేం లేదు, చాటుమాటున పేకాటాడే బదులు కొన్ని క్లబ్బుల్లో సభ్యత్వం వుంటే చాలు. ఎంచక్కా పేకాడుకోవచ్చు. ఇదీ జిల్లాలోని కొన్ని క్లబ్బుల్లో జరుగుతున్న తీరు. పేరుకు రిక్రియేషన్ క్లబ్బులు. జరిగేది మాత్రం పేకాట అనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో పోలీసులు క్లబ్బులపై దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకుంటున్న సంఘటనలు జరిగాయి.

- రిక్రియేషన్ పేరిట క్లబ్బుల్లో జూదం
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు ?
- ప్రొద్దుటూరులో ఖరీదైన జూదం
- ఇదీ... జిల్లాలో కొన్ని క్లబ్బుల తీరు

ఆంధ్రజ్యోతి, కడప సిటీ ప్రతినిధి కథనం 6లో

పైసలున్నాయ్.. పరికరాలే రానంటున్నాయ్

● నిర్ణయం కాని యంత్రాల ధరలు ● యాంత్రీకరణ ఉపప్రణాళిక అమలుకు రూ.34.36 కోట్లు

"ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. వ్యవసాయ యాంత్రీకరణ ఉపప్రణాళిక అమలుకు కేంద్రం నుంచి మంజూరయ్యే నిధులు సైతం మంజూరయ్యాయి. కానీ పరికరాల ధరల నిర్ణయంపై ఇంకా పీఠముడి వీడలేదు. దీనికి తోడు యంత్రాల కొనుగోళ్ల మార్గదర్శకాలు సన్నకారు రైతులకు ఇబ్బందికరంగా మారాయి. ఈ విషయంపై పున:పరీశీలన చేయాలనే డిమాండ్‌పై వ్యవసాయశాఖ నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదు. యంత్రాల ధరల నిర్ణయంలో జాప్యంపై ఉన్నతాధికారులు సైతం నోరువిప్పడం లేదు. జీఎస్టీ ప్రభావం అని చెబుతున్నారు. ఏదేమైనా ధరల నిర్ణయం జరిగితే కానీ పథకం అమలులో ముందడుగు పడేలా లేదు."

జిల్లాకు నిధుల కేటాయింపు ఇలా..

- ట్రాక్టర్లు - 320 నిధులు రూ.6.78 కోట్లు
- ట్రాక్టర్‌తో లాగే పరికరాలైన - 9, 10, 11 వరుసల నాగళ్లు 2310, నిధులు రూ.14.35 కోట్లు.
- రోజో వేటర్లు - 850, నిధులు రూ.4.40 కోట్లు
- తైవాన్ స్ప్రేయర్లు - 1000, నిధులు రూ.కోటి.
- పవర్ టిల్లర్లు - 30, నిధులు రూ.30 లక్షలు
- అద్దెకు ఇచ్చే పరికరాలు -275, నిధులు రూ.13.75 కోట్లు.

కడప, ఐటిఐసర్కిల్: కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యాంత్రీకరణ ఉప ప్రణాళికలను అమలు పరుస్తున్నారు. ఇందుకు ఏటా నిధులను కేటాయించి పరికరాల కొనుగోళ్ల సందర్భంలో రైతులకు రాయితీ వాటా మొత్తాలను చెల్లిస్తుంటారు. ఇప్పటికే జిల్లాకు రూ. 34.26 కోట్లు నిధులు ఇందుకోసం కేటాయించారు. పథకం అమలులో కీలకమైన పరికరాల ధరల నిర్ణయం జరగనిదే.. రైతు వాటా.. రాయితీ మొత్తాల విషయం తేలదు. లబ్ధిదారులు డీడీ ఎంతకు తీయాలో కూడా అర్థం కాని పరిస్థితి. ప్రజా ప్రతినిధులైనా చొరవ చూపి ధరలు నిర్ణయించి రైతులకు త్వరితగతిన పరికరాలు అందేలా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా రైతాంగం అభిప్రాయపడుతోంది.

దరఖాస్తుల విషయంలో ఊరట

పరికరాలు కావాల్సిన రైతులు మండల వ్యవసాయశాఖ అధికారులకు పంపితే వారు రైతులను సంప్రదించి దరఖాస్తులు అందించాలి. వీటిని జిల్లా ఉన్నత అధికారులకు పంపితే వారు రైతులకు ప్రొసీడింగ్ సెంటర్లను కేటాయిస్తారు. ఈ సెంటర్‌ను తీసుకుని ఏ పరికరం కావాలో అవి లభించే వ్యాపారి వద్దకు వెళ్లి కొనుగోళ్లు చేయాలి. నగదును బ్యాంకు నెఫ్ట్ ద్వారా చెల్లించాలి. రైతు ఏ ఖాతా నుంచి నగదు చెల్లిస్తారో అందులోనే రాయితీ మొత్తాన్ని జమ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు ఠాగూర్ నాయక్ వెల్లడించారు.

రాయితీ వర్తింపు ఇలా...

చిన్న సన్నకారు, మహిళల రైతులకు 50 శాతం, పెద్ద రైతులకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 70 శాతం రాయితీ వర్తింపచేస్తూ మార్గదర్శకాల్లో పొందుపర్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఏ రైతు అయినా సరే పరికరం మొత్తం ఖరీదు చెల్లించాల్సి వుంటుంది.

నిధులను సక్రమంగా వినియోగిస్తాం..



యాంత్రీకరణకు జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగిస్తాం. ప్రభుత్వం ధరలు నిర్ణయించగానే పరిస్థితి చక్కబడుతుంది. ప్రభుత్వం జిల్లాకు కేటాయించే ప్రతి పైసా రైతుల శ్రేయస్సు కోసం ఖర్చు చేస్తాం. రైతు రథాల పేరుతో వచ్చిన ట్రాక్టర్ల కోసం రైతులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. రైతు రథాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల అర్హతలను పరిశీలించి పారదర్శకంగా ట్రాక్టర్లను మంజూరు చేయనున్నాం. ఆధునిక వ్యవసాయ రంగంలో కూలీల ఖర్చు తగ్గించి రైతులకు లాభాలు ఆర్జించి పెట్టడానికి ప్రభుత్వం పెద్దఎత్తున వ్యవసాయ రంగంలో యంత్రాలకు ప్రాధాన్యతనిస్తుంది. ఇందుకోసం జిల్లాకు రూ.34.36 కోట్లు నిధులు కేటాయించింది. ధరల నిర్ణయం రాగానే యాంత్రీకరణకు కేటాయించిన మొత్తాన్ని సక్రమంగా వినియోగిస్తూ ప్రభుత్వ నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకుంటాము.

- ఠాగూర్‌నాయక్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ

ఏపీఎల్ యువ క్రికెటర్లకు అద్భుత అవకాశం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శివారెడ్డి

కడప, స్పోర్ట్స్: ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్న ఆంధ్ర ప్రీమియమ్ లీగ్ యువ క్రికెటర్లకు అద్భుత అవకాశమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంవీ శివారెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రీడా మైదానంలో అండర్-16 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆంధ్ర క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి గోకరాజు గంగరాజు నేతృత్వంలో ఆంధ్ర క్రికెట్ సంఘం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్-ఏసీఏ స్టేడియం, కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం ఇంజనీరింగ్ క్రికెట్ క్రీడా మైదానాలు అభివృద్ధి చెందాయన్నారు. అంతేకాక క్రికెటర్లకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సౌత్‌జోన్ కార్యదర్శి నాగేశ్వరరాజు మాట్లాడుతూ ఏసీఏ అండర్-16 అంతర జిల్లా క్రికెట్ పోటీలను ఈ నెల 11 నుంచి 29 వరకు కడపలో నిర్వహిస్తున్నామని ఈ టోర్నమెంట్‌లో విశాఖపట్నం, తూ.గో. ప.గో, క్రిష్ణ, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు పాల్గొంటాయన్నారు.

మ్యాచ్ వివరాలు

వైఎస్ఆర్ ఏసీఏలో : విశాఖ, వెస్టుగోదావరి మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన విశాఖ బౌలింగ్ ఎంచుకొని 94.4 ఓవర్లలో వెస్టు గోదావరిని 168 పరుగులకు ఆలౌట్ చేసింది.

కేఎస్ఆర్ఎంలో

క్రిష్ణా-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లో క్రిష్ణా జట్టు నెల్లూరు జట్టును 15.1 ఓవర్లలో 34 పరుగులకు 3 వికెట్లు తీసింది.

కేవోఆర్ఎంలో

చిత్తూరు-తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 82 ఓవర్లలో 119 పరుగులు చేసి 4 వికెట్లు కోల్పోయింది.

కొత్తపల్లెలో మళ్లీ ఏనుగుల దాడులు

● ధ్వంసమైన మాగాని, అరటి బొప్పాయి తోటలు

రైల్వేకోడూరు రూరల్: మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామంలో ఏనుగులు తరచూ విరుచుకుపడి దాడులు చేయడం ఇటీవల పరిపాటిగా సాగుతోంది. గత వారం క్రితమే మూడు సార్లు ఎస్.కొత్తపల్లె గ్రామ సమీపంలోని పంట పొలాలపై దాడులు చేసి తీవ్రనష్టం కలిగిన సంఘటన మరిచిపోకముందే శుక్రవారం తెల్లవారుజామున గుర్రం పరమేశ్వర నాయుడు, గుర్రం నీలకంఠయ్య, గుర్రం యానాది, మరో ఇద్దరు రైతులకు చెందిన వరిపంట, అరటి, బొప్పాయి చెట్లను ఏనుగుల మందలు ధ్వంసం చేశాయి. పైపులను విరిచేసి తీవ్రనష్టం కలిగించినట్లు రైతులు వాపోయారు. ఏనుగుల దాడులను తెలుసుకొని బాలపల్లె అటవీ శాఖాధికారులు పంట పొలాలను పరిశీలించారు. పరిహారం కోసం పై అధికారులకు నివేదిస్తామన్నారు. శేషాచలం అటవీ సమీపంలో ఉన్న ఎస్.కొత్తపల్లె గ్రామ పొలాలపై తరచూ ఏనుగులు దాడులు చేస్తూ లక్షలాది రూపాయలు పెట్టి సాగు చేసిన పంటలను ధ్వంసం చేయడం పట్ల ఇక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏనుగుల మందలను పొలాలపై రానివ్వకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పనులను పరిశీలించిన ఎస్ఈ

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో చేపట్టిన వివిధ రకాల పనులను దేవాదాయశాఖ ఎస్ఈ రఘురామయ్య, డీఈ గంగయ్య పరిశీలించారు. దేవస్థాన సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ రాజారావు దేవస్థానంలో చేపట్టిన పనులను చూపించారు. షెడ్లు, షాపింగ్ కాంప్లెక్స్, రెయిలింగ్ తదితర పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం షెడ్లు వేస్తున్నామని, షాపింగ్ పనులు కూడా పూర్తయ్యాయని, రెయిలింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని షెడ్లు వేసి భక్తులకు సౌకర్యం కల్పించాలని ఎస్ఈ వారికి సూచించారు. అనంతరం పూజారులు కేసరి, రాజా రమేష్ వారికి స్వాగతం పలికి సత్కరించారు.



గండిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ రఘురామయ్య

అందరూ సమానం.. అంబేద్కర్ భావన



పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆచార్యులు

కడప, స్పోర్ట్స్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమాజంలో అందరూ సమానంగా వుండాలని కోరుకునేవారని వైవీయూ కులసచివులు ఆచార్య కె.చంద్రయ్య తెలిపారు. శుక్రవారం వైవీయూలోని సర్‌సీవీ రామన్ సైన్స్‌భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సైంటిఫిక్ అంబేద్కరిజంపై జాతీయ వర్క్‌షాపులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానంగా వుండాలనే భావన ఆయనదన్నారు. అనంతరం అంబేద్కర్ స్టడీ సర్కిల్ రీసెర్చ్ సెంటర్ సమన్వయ కర్త సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి జాతీయ వర్క్‌షాపులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో మరింత అవగాహన ఏర్పడుతుందన్నారు. వైవీయూ ప్రధానాచార్యులు ఆచార్య కె.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ చాలా దూర దృష్టి గల వారన్నారు. టూరిజం సమన్వయకర్త గోపాల్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం అనే అంశాలపై అంబేద్కర్‌కు ఖచ్చితమైన అభిప్రాయాలు కలవన్నారు. విశ్రాంత ఆచార్యులు నవీన్‌కుమార్, వరుణ్‌కుమార్‌లు తమ విలువైన సూచనలు విద్యార్థులకు అందించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య ఏజీ దాము, ఆచార్య సాంబశివారెడ్డి, ఆచార్య గంగయ్య, ఆచార్య డాక్టర్ ఎంవీ వినోదిని, ఎస్సీ, ఎస్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గనుల శాఖ ఏడీ కార్యాలయంపై ఏసీబీ దాడులు

● ఆధారాలు లేని రూ. 2.35 లక్షలు స్వాధీనం ● ఏడీ సహా మరో పదిమందిపై కేసు నమోదు



వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ, నగదు దొరికిన మైనింగ్ ఉద్యోగులు, మైనింగ్ ఏడీ ఉమామహేశ్వరరావు

కడప, వినాయకనగర్: కడప నగరంలోని గనులు భూగర్భశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంపై శుక్రవారం సాయంత్రం కడప ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఎటువంటి ఆధారాలు లేని రూ.2,35,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. గనులు, భూగర్భశాఖలో పనుల నిమిత్తం వచ్చే క్వారీ యజమానుల నుంచి ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి కార్యాలయం సిబ్బంది అధికారులు లంచాలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని ఏడీ ఉమామహేశ్వర్‌రెడ్డి మరో పదిమంది సిబ్బంది వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.2,35,300 నగదు వుండడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే క్వారీ యజమానులతో క్యాష్‌లెస్ లావాదేవీలు జరపాల్సి వుండగా అధికారులు, సిబ్బంది లంచాలకు అలవాటు పడి డిమాండ్ చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు ఫిర్యాదులు అందాయి.

ముఖ్యంగా లీజు దరఖాస్తులకు, క్వారీ సర్వేకు పర్మిట్లకు అధికారులు డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏడీ ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బందిపై కేసు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ నాగరాజు చెప్పారు.

దొంగ అరెస్టు - బంగారు స్వాధీనం

కమలాపురం రూరల్: పందిళ్లపల్లెలోని ఓ ఇంట్లో దొంగతనం చేసి విలువైన ఆభరణాలను దొంగిలించిన దొంగను అరెస్టు చేసి అతని నుంచి వాటిని కమలాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎర్రగుంట్ల సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిళ్లపల్లె వాసి షేక్‌గులాబ్‌జామ్ గురువారం చావిటికాడ దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిందన్నారు. ఆ విషయం గమనించి ఆ ప్రాంతంలో సంచరిస్తున్న రాయచోటి వాసి పటాన్ మహబూబ్‌ఖాన్ ఇంటి తలుపులు తెరిచి లోనికి ప్రవేశించి బీరువాను తెరిచి అందులో వున్న 55 గ్రాముల బంగారు ఆభరణాలు, 90గ్రాముల వెండి అపహరించాడన్నారు. వాటి విలువ రూ.1.45లక్షల వరకు వుంటుందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధ్యులతో మాట్లాడి పరిసర ప్రాంతాలు గాలించగా ఊరిబయట చెట్టుకింద నిందితుడు వున్నట్లు తెలుసుకున్నామన్నారు. అతని కదలికపైనిఘా పెంచి శుక్రవారం కమలాపురం రైల్వేస్టేషన్‌లో వుండగా నిందితున్ని అరెస్టు చేసి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐను అభినందించారు.

కాంబల్లెను సందర్శించిన గృహనిర్మాణ శాఖ పీడీ



హౌసింగ్ కాలనీ స్థలాన్ని పరిశీలిస్తున్న పీడీ ప్రసాద్, టీడీపీ నేత రామగోపాల్‌రెడ్డి

సింహాద్రిపురం: కాంబల్లెను శుక్రవారం సాయంత్రం గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్ సందర్శించారు. గ్రామంలో నిర్మించనున్న చంద్రబాబునాయుడు కాలనీకి సంబంధించి స్థలాన్ని పీడీ ప్రసాద్ టీడీపీ నేత రామగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కాలనీకి సంబంధించి ఇతర మౌలిక సదుపాయాల్లో ఏమి కావాలో టీడీపీ నేత రామగోపాల్‌రెడ్డి, సర్పంచు ఉమాదేవిల ద్వారా పీడీ అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ముందే విద్యుత్, నీటి సరఫరాకు అంచనాలు రూపొందించాలని ఇంజనీర్లను పీడీ ఆదేశించారు. లబ్ధిదారులతో ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడారు. కాలనీని వీలైనంత త్వరగా నిర్మిస్తామని, కలెక్టర్ చొరవతో త్వరలోనే ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని పీడీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈలు సుబ్బరాయుడు, శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్, ఏఈ రమణారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

70 కుటుంబాలతో కదలిన దళితవాడ

పుట్టా సమక్షంలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు: 15 ఏళ్ల కిందట వెంకటాపురం దళితవాడ మట్టి రోడ్లతో ఉండేది. వీధిలైట్లు, డ్రైనేజీకి దూరం. ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక పోవడంతో అక్కడున్న వైఎస్సార్సీపీ నేత చిట్టిబాబు ఇటీవల కాలనీవాసులతో సమావేశమై పుట్టా సుధాకర్‌యాదవ్ ఓడిపోయినా ఆయన చేస్తున్న అభివృద్ధిని వివరించడంతో మొత్తం 70 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకుని పార్టీ నియోజకవర్గఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ దళితవాడ మొత్తం తెలుగుదేశం పార్టీలో చేరడం గర్వంగా ఉందన్నారు. వీధుల్లో డ్రైనేజీతో కూడి సిమెంట్ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. మూడు రోజుల్లో స్తంభాలకు వీధిలైట్లు వేయాలని మున్సిపల్ ఛైర్మెన్ రంగసింహను కోరారు. నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ కింద రుణాలు ఇప్పిస్తామని సభాముఖంగా పేర్కొన్నారు. ఓట్లేసి గెలిపించిన మీ ఎమ్మెల్యే ఏ నాడు కూడా ఈ దళితవాడ గురించి మున్సిపల్ సమావేశంలో ప్రస్తావించలేదని ఇది మీరంతా గమనించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ బీపీ సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు ఆర్.శ్రీనివాసులు, గుండంరాజు సుబ్బయ్య, కటారు కృష్ణ, ఏపీ రవీంద్ర, కొండపల్లి ఉమాకాంత్,డీలర్ రామచంద్ర, ధనపాల యుగంధర్, శాంతినగర్ ప్రసాద్ నాయబ్, షరీఫ్, గౌస్‌పీర్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని ఒకరి మృతి



మృతి చెందిన పాశం గురవరాజు

కలసపాడు: సింగరాయపల్లె వద్ద శుక్రవారం బద్వేలు నుంచి కర్నూలు వెళ్లే ఏపీ29జెడ్3815 నెంబరు బస్సు ఢీకొనడంతో పాశం గురవరాజు(60) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు వివరాల్లోకెళితే.... బ్రాహ్మణపల్లె వాసి పాశం గురవరాజు గిద్దలూరుకు వెళ్లేందుకు సింగరాయపల్లె వద్ద బ్రాహ్మణపల్లె అడ్డరోడ్డులో బస్సు ఎక్కేందుకు వచ్చాడు. అయితే బస్సు వచ్చే విషయం గమనించకుండా రోడ్డుదాటుతుండగా బస్సు ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయా లయ్యాయి. చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకువెళుతుండగా మార్గమద్యలోనే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని కలసపాడు ఎస్‌ఐ వెంకటరమణ పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంస్కృతి రక్షణ బాధ్యత యువతదే : స్టెప్ సీఈఓ



సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత

కమలాపురం రూరల్: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత యువతపైనే వుందని స్టెప్ సీఈఓ మమత పేర్కొన్నారు. శుక్రవారం సీఎస్ఎస్ ఆర్‌అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో కళాశాల కరస్పాండెంట్ సీవీ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో భారత సంస్కృతి గొప్పదనాన్ని ప్రపంచదేశాలకు యువత చాటిచెప్పాల్సిన బాధ్యత వుందన్నారు. మన కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలతో ప్రపంచదేశాల్లోనే మన స్త్రీకి ప్రత్యేక స్థానం వుందన్నారు. యువత చాలా వరకు చదువుపై ఆసక్తి పెంచుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో డివిజనల్‌స్థాయి యువజనోత్సవాలు నిర్వహించడం ఆనందంగా వుందన్నారు. అనంతరం యువత పలు కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు.

వివాహవేడుకలో వైఎస్ జగన్

పులివెందుల టౌన్: ప్రతిపక్షనేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ వివాహ వేడుకలో పాల్గొన్నారు. నంద్యాలలో చేపట్టిన రోడ్‌షో నుంచి నేరుగా శుక్రవారం రాత్రి 9:30గంటలకు పులివెందులకు వచ్చారు. అనంతరం డీసీఎంఎస్ మాజీ వైస్‌ఛైర్మన్ దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు యశ్వంత్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

అనంతరం తిరిగి నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసీపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాఠాలు బోధిస్తూ ప్రాణాలు విడిచిన లెక్చరర్

- మృతుడు ప్రసాదరావు పొద్దుటూరు వాసి



ఎన్ఏడీ జంక్షన్ (విశాఖపట్నం) ఆగస్టు 11 : స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు బి.ప్రసాదరావు (58) మరణించారు. వివరాలిలా ఉన్నాయి. పొద్దుటూరు వాసి బి.ప్రసాదరావు (58) విశాఖపట్నం కృష్ణరాయపురంలో నివసిస్తూ ఎన్ఏడీ జంక్షన్ లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు కెమిస్ట్రీ బోధిస్తుంటారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన ప్రసాదరావు తరగతి గదిలో పాఠాలు బోధిస్తూ కుప్పకూలిపోయాడు. కళాశాల సిబ్బంది చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించే యత్నంలో ఉండగానే ప్రాణాలు విడిచారు. లెక్చరర్ మృతితో కళాశాలలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ప్రసాదరావు మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రసాదరావుకు భార్య, ఇంటర్ చదువుతున్న కుమారుడు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలకు 160 మంది హాజరు



లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : మండలంలో బీసీ, మైనారిటీ, కాపు, వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 160మంది లబ్ధిదారులు హాజరయ్యారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఇది వరకే ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న లబ్ధిదారులకు ఆయా బ్యాంకర్లు కార్పొరేషన్‌ల అధికారులు ఎంపీడీవో బాలమునిస్వామి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారి జాబితాను సిద్దం చేసినట్లు ఆయన తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న విద్యార్థిని పరిశీలిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

రాజంపేట టౌన్ : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ పోలా వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. రాజంపేట పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ పోలా వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులు పాల్గొని రక్తదానాన్ని చేశారు. అనంతరం పోలా రమణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారికి ఈ రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం సేవా సమితి సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో కాకర్ల రాముడు, రాధాకృష్ణ, వెంకటసుబ్బయ్య, ఆర్.వి.శరత్ బాబు, రామచంద్రయ్య, శ్రీనివాసనాయుడు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో దివ్యదర్శనం భక్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం విజయవాడకు చెందిన 200మంది దివ్యదర్శనం భక్తులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఏకశిలా రామున్ని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యుల ద్వారా ఆలయ చరిత్రను తెలుసుకొని ఆలయం తరపున ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలోని సమస్యలు తెలుపాలన్నా, ఇతరత్రా సమాచార ఇవ్వాలన్నా ఆంధ్రజ్యోతిని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి

రాజంపేట : 9985411195
రాజంపేట రూరల్: 9441872651
రాజంపేట టౌన్: 9948429442
నందలూరు : 9966879088
ఒంటిమిట్ట : 9491102155
సిద్దవటం : 9441402587
సుండుపల్లె : 9059485350

తొలి పూజల అధిపతి.. విఘ్నాల గణపతి...

రైల్వేకోడూరులో విస్తరిస్తున్న వినాయక బొమ్మల తయారీ కేంద్రాలు

రైల్వేకోడూరు రూరల్ : వినాయక చవితి వస్తుందంటే ఊరూరా బొజ్జ గణపయ్యల సందడే. గతంలో కొన్ని ప్రధాన కూడలిలో మాత్రమే వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి చేసి పూజలు నిర్వహించేవారు. నేడు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం ప్రతి వీధిలోనూ ఒకటి నుంచి రెండు వరకు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి మూడు రోజులు, ఐదు రోజులు, తొమ్మిది రోజుల పాటు నిర్వాహకుల శక్తి సామర్థ్యాలను బట్టి పూజలు చేస్తున్నారు. ముఖ్యంగా యువత ఉత్సాహం పది, పదిహేను రోజుల ముందు నుంచే వినాయక చవితి ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు.

ఈ కోవలోనే రైల్వేకోడూరు రైల్వేకోడూరు ప్రాంతంలో రాఘవరాజుపురం, కొత్తకోడూరు, మార్కెట్‌యార్డ్, శాంతినగర్ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను తయారు చేయడానికి నెల్లూరు విజయవాడ, గుంటూరు, తిరుపతి ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఒక్కో కేంద్రంలో 100నుంచి 180విగ్రహాల వరకు తయారు చేస్తున్నారు.



విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు

నెల్లూరు నుంచి ఇక్కడికి వచ్చాం

నెల్లూరు నుంచి 30మంది విగ్రహాలు తయారు చేసే కార్మికులతో ఇక్కడ ప్లాస్టర్ ఆఫ్‌ప్యారిస్‌ను ఉపయోగించి కొబ్బరిపీచు, చెక్క కొయ్యలను ఉపయోగించి నాలుగు అడుగుల నుంచి 13అడుగులు ఉండే విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఇటీవల కొబ్బరిపీచు, ప్లాస్టర్‌ఆఫ్‌ప్యారిస్ ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెరిగాయి. 5 నుంచి 20వేల వరకు బొమ్మలను తయారు చేస్తున్నాం..



-ఎం.శ్రీనివాసులు, విగ్రహాలతయారీదారు, నెల్లూరు.





ఆవు, దూడ వాహనం, వెంకటేశ్వరస్వామి భుజంపై ఉన్న వినాయక విగ్రహం

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత రవికుమార్, హాజరైన విద్యుత్ కార్మికులు

రాజంపేట టౌన్ : విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రాజంపేట ఎన్జీవో హోంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20సంవత్సరాలకు పైగా విద్యుత్ సంస్థలో చాలీచాలని జీతాలతో బాధపడుతున్నా ప్రభుత్వాలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న చలో విజయ వాడ బయలుదేరి ట్రాన్స్‌కో సీఎండీకి సమ్మె నోటీసు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో డి.సుధాకర్, యూఈఈయూ ఇ.శ్రీహరి, యూఈసీడబ్ల్యూయూ డివిజన్ కార్యదర్శి పి.బాలకృష్ణ, కార్మికులు ఆర్.సురేంద్ర, చంద్రారెడ్డి, ఎస్ఎండీ రఫీ, పుల్లయ్య, కిరణ్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు కర్నూలు మహాసభకు తరలిరండి

రాజంపేట రూరల్ : కర్నూలులో ఆదివారం జరిగే రెవెన్యూ ఉద్యోగుల మహాసభలకు తరలిరావాలని రాజంపేట డివిజనల్ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు బుజంగరావు పిలుపునిచ్చారు. ముఖ్యంగా వీఆర్యేల నుంచి వీఆర్వోలుగా పదోన్నతి పొందిన ఉద్యోగస్తులకు పెన్షన్ లభించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ మహాసభలో చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి

-ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయమ్మ.,
సెల్ : 9701971615



ఇంటర్వ్యూ

రాజంపేట టౌన్ :పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పక ఇప్పించాలని దీంతో అమృతంలా వ్యాధినిరోధక శక్తిని అందిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.విజయమ్మ పేర్కొన్నారు. బిడ్డకు వరం.. మొదటి టీకా... తప్పనిసరిగా 6నెలల వరకు తల్లిపాలు ఇప్పించాలన్నారు. శుక్రవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న : ఎన్ని నెలల వరకు ముర్రుపాలు తాపించాలి.?

జవాబు : పుట్టిన బిడ్డ నుంచి 6నెలల వరకు ముర్రుపాలు తాపిస్తే రోగాలు రావు. మెదడు చురుగ్గా పనిచేసి వారి ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రశ్న : మీ పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి.? ఎక్కడెక్కడ ఖాళీలున్నాయి?

జవాబు : మా పరిధిలో 40అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అందులో 9మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. హెల్పర్లకు 5ఖాళీలు ఉన్నాయి. గర్భవతులకు, బాలింతలకు, పాలు, గుడ్డు, మధ్యాహ్న భోజనం సక్రమంగా అందిస్తున్నాం.. 3 నుంచి 6సంవత్సరాల పిల్లలకు మధ్యాహ్న భోజనంతో పాటు గుడ్డును అందిస్తున్నాం. చిన్నపిల్లలకు రైస్‌ను ఇంటికి తీసుకెళ్ళే సౌకర్యం కల్పిస్తున్నాం.

ప్రశ్న : బాల్యవివాహాలను నిరోధిస్తున్నారా.?

జవాబు :బాల్య వివాహాలపై ఎక్కడైనా సమాచారమొస్తే వెంటనే వాటిని అడ్డుకుని కౌన్సెలింగ్ ఇప్పించడంతో పాటు బాలికను కడప సీడబ్ల్యూసీకి అప్పగిస్తున్నాం.

ప్రశ్న : అన్న అమృతహస్తం ఏ విధంగా ఉపయోగిస్తున్నారు.?

జవాబు : గర్భవతులు, మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చి అన్న అమృత హస్తాన్ని ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : అంగన్‌వాడీ సెంటర్లలో సీమంతాలు జరుగుతున్నాయా.?

జవాబు : ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు చేస్తున్నాం. అలాగే 6నెలలు పూర్తి చేసుకున్న చిన్నారులకు అన్నప్రాసనం కుటుంబ సభ్యుల సమక్షంలో చేస్తున్నాం.

నేటి నుంచి ముత్తుమారెమ్మ జాతర

నందలూరు : మండలంలోని భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న అరవపల్లెలోని శ్రీశ్రీ ముత్తుమారెమ్మ జాతర శనివారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ మొదలియార్, సేలం చంద్రశేఖర్ మొదలియార్‌లు తెలిపారు. శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం, గ్రామోత్సవంలో కాళికానృత్యము, పొడుగాటి మనిషి విచిత్రవేషధారణ ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 8గంటలకు కుంకుమార్చన, జాతర మహోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జానపద గేయాలు, భక్తిగీతాలాపన, బుర్రకథ, 14న పొలపూజ, రాత్రి గీతాలాపన, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

సమాచారం లేకుండానే
రెవెన్యూ ఖాతాలో భూ పరిహారం

- అధికారుల నిర్వాహకంతో ఖంగుతిన్న రైతులు
- దరఖాస్తులిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్న అధికారులు

ఓబులవారిపల్లె : ప్రజాప్రయోజనం కోసం భూముల అవసరమైతే డ్రాఫ్టునోటిఫికేషన్‌తో పాటు డిక్లరేషన్ పబ్లికేషన్ ద్వారా ప్రభుత్వం మార్కెట్ విలువకు సంబంధిత రైతులకు పరిహారం ఇవ్వాలి. భూమి కోల్పోతున్న రైతు గిట్టుబాటు కాలేదనో మరోకారణంతో విముఖత చూపితే భూ సేకరణ అవసరాన్ని బట్టి పరిహారం రెవెన్యూ ఖాతాలోనో.. న్యాయస్థానం వద్దనో డిపాజిట్ చేసి రైతుకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖది.. అయితే ఇందుకు విరుద్ధంగా ఓబులవారిపల్లె మండలం మంగంపేటలో భూ సేకరణ పనులు రైతులకు తెలియకుండానే చేపట్టి పరిహారం రెవెన్యూ శాఖలో డిపాజిట్ చేసిన వైనం శుక్రవారం వెలుగు చూడడం బాధిత రైతులను ఖంగుతినిపించింది. మంగంపేటలో సర్వే నెంబర్ 34/1 నుంచి 34/7 వరకు గల ఏడు ఎకరాల రైతుల పట్టా భూములు రెవెన్యూ శాఖా వారు భూసేకరణ నిర్వహించి పరిహారం రెవెన్యూ ఖాతాలో జమఅయినట్లు సంబంధిత రైతులకు రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామ సభద్వారా తెలిసింది. భూ సేకరణ పనులు కూడా 2003లో పూర్తి చేసి ఆర్‌డీ అకౌంట్లో పరిహారం జమ అయినట్లు రెవెన్యూ అధికారులు గ్రామసభలో స్పష్టం చేయడంతో రైతులు నివ్వెరపోయారు. విచిత్రం ఏమిటంటే రెవెన్యూ శాఖ వారు ఏపీఎండీసీ గనుల విస్తరణ కోసం భూసేకరణ జరిపి ఏపీఎండీసీ వారు పరిహారం ఇచ్చిన భూములు ఇప్పటికీ


రెవెన్యూ సభలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామపెద్దలు

ఏపీఎండీసీ స్వాధీనం చేసుకోలేదు. ఆ భూముల్లో కొంత భాగం గనుల తవ్వకాల కాంట్రాక్టర్ క్యాంపు కార్యాలయాన్ని నిర్మించుకొని ఉండగా మరికొంత భూమి రైతులు నేటికీ సాగు చేసుకుంటున్నారు. మంగంపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో తమ భూములు ఆన్‌లైన్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ తంతు వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గల్లా శ్రీనివాసులు, గల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, మండల ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, గునిపాటి కిరణ్‌కుమార్, ఉపసర్పంచ్ గల్లా శ్రీధర్, సర్పంచ్ చంద్రగిరి పెంచలయ్యలు అధికారులను నిలదీశారు. 2003లో రెవెన్యూ అధికారులు సమాచారం లేని భూసేకరణ పనులు ద్వారా రైతులకు చెందిన పరిహారం రెవెన్యూ వద్ద చేసుకున్న డిపాజిట్ వ్యవహారంపై భూ బాధితుడు తెలుగుదేశం పార్టీ రైల్వేకోడూరు సమన్వయ కమిటీ సభ్యులు కల్లా చలపతి గ్రామసభల్లో సదరు అధికారికి ఫోన్ ద్వారా సమాచారం అడగ్గా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. 2003లో జరిగిన వ్యవహారమని అర్జీ ఇస్తే పై అధికారులకు తెలియజేస్తామని అధికారులు సూచించారు. రెవెన్యూ గ్రామ సభలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను డిప్యూటీ తహశీల్దార్ పూల సిద్దేశ్వర్ వివరించారు. స్మార్ట్ సర్వేలో 180 పక్కా గృహాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు రాగా 18మంది అనర్హులుగా తేలిందని హౌసింగ్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ బాషా, వీఆర్వో సుబ్బారెడ్డి, గల్లా నారాయణ, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పదేళ్లుగా ఏపీఎండీసీలో పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలు

మంగం పేట రెవెన్యూ సంబంధిత పనుల కోసం సుమారు దశాబ్దకాలక్రితం రాజంపేట ఆర్డీవో కార్యాలయం నందు రెవెన్యూ పనులు బాగా తెలిసిన ఓ విరామ అధికారిని నియమించి నేటికీ ప్రభుత్వ ఉద్యోగితో పాటు జీతం చెల్లిస్తున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడ్డంలేదు. ఏపీఎండీసీ అప్పటి యాజమాన్యం నియమించిన ఉద్యోగి సకాలంలో ఒక్క పని పూర్తిచేయక నెల జీతం క్రమం తప్పకుండా ఏపీఎండీసీ ద్వారా తీసుకుంటారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాసిత బాధితులకు రెవెన్యూ ద్వారా ఏపీఎండీసీ పరిహారం పంపిణీ సమయాల్లో కమీషన్‌ల కోసం ఈయన హడావుడి చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి

15 మంది జూదరుల అరెస్ట్
రూ. 51 వేల నగదు స్వాధీనం

టి.సుండుపల్లె: మండలంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి శుక్రవారం మెరుపుదాడులు చేశారు. ఈ దాడుల్లో 15 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.51 వేల 450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె, ఏటిగడ్డరాచపల్లె, నడిమి తురకపల్లెలో పేకాట నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. శుక్రవారం చీకటిపడేవేళ పక్కా సమాచారం రావడంతో ఒకేసారి మూడు గ్రామాలలో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై దాడు చేశామన్నారు. ఈదాడులలో 15 మంది పేకాట రాయుళ్ళ పట్టుబడ్డారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.15,450 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కేసున మోదు చేశామని తెలిపారు.

8మందిపై బైండోవర్ కేసు

సిద్ధవటం : మండలంలోని మాచుపల్లె వెంకటాయపల్లె, మూలపల్లె, నేకనాపురంలకు చెందిన 8మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. వారిని సిద్ధవటం డిప్యూటీ తహశీల్దార్ వద్ద హాజరు పరచగా వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.

సినిమా గైడ్
రాజంపేట

సమద్	:లై
సుదర్శన్	:నేనే రాజు నేనే మంత్రి
పీవై	: ఫిదా
బీఎస్:	నక్షత్రం
ఎన్ఎస్ఆర్:	జయజానకి నాయక

నగిరిపాడులో వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

- ఒకే రోజు 10 చోట్ల ఘటనలు
- ఆందోళనలో అన్నదాతలు

చిట్వేలి : చిట్వేలి మండలం నగిరిపాడు గ్రామంలో గురువారం రాత్రి 10మంది రైతు లకు సంబంధించిన వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీకి గురయ్యాయి. ఒకే రోజు ఈ ఘటన చోటు చేసుకోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇందులో ముదాం నరసింహులు మోటారుకు సంబం ధించిన స్టాటర్లు, కేబుల్ వైర్లు తీసుకెళ్ళారు. అదే గ్రామానికి చెందిన షేక్ రసూల్ సాహెబ్, షేక్ మస్తాన్‌సాహెబ్, నాగేశ్వర్ రావు, వెలగచెర్ల శ్రీధర్‌రెడ్డి, పెద్దూరు నరసింహులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు, ఫీజులు, స్టాటర్ వైర్లు, కేబుల్ వైర్లు తీసుకెళ్ళారు. ప్రతి రైతుకు సంబం ధించిన 5వేల రూపాయల మోటార్‌వైర్లను దొంగిలించారు. గతంలో ఇదే ప్రాంతంలో అనేక చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్లను తీసుకొని వెళ్ళారు. పెద్దూరు, గొల్లపల్లె, నగిరిపాడు, జెట్టివారిపల్లె, మల్లెం పల్లె చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతి రోజూ వ్యవ సాయ మోటార్ల వద్ద చోరీలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. పోలీసులు జోక్యం చేసుకొని మోటార్ల వైర్ల చోరీలు జరగకుం డా చూడాలని రైతులు కోరుతున్నారు.


ముదాం నరసింహులు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చోరీకి గురైన వైర్లు

విజృంభిస్తున్న విష జ్వరాలు




జ్వరంతో ఉన్న చిన్నారులు, జ్వరంతో బాధపడుతున్న గంగులమ్మ

రాయచోటి/చిన్నమండెం: చిన్నమండెం మండలం పడమటికోన దళితవాడ డెంగ్యూ కోరల్లో చిక్కుకుంది. ఈ పల్లెలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ దీని బారిన పడ్డారు. మంగళ, బుధవారాల్లో డెంగ్యూ బారిన పడి చిన్నాగోళ్ల రెడ్డిశేఖర్, భానుప్రకాష్‌లు మృతి చెందారు. నిశాంత్, రెడ్డెన్నలు తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. వీరేకాక మరో 20 మంది దాకా జ్వరాలతో బాధపడుతున్నారు. తాగునీటి సమస్యే జ్వరాలకు కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ దళితవాడలో 80 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో సిమెంటు రోడ్లు, మురికి కాల్వలు ఉన్నాయి. అయితే మురికి కాల్వలు శుభ్రపరచలేదు. దీని వల్ల దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఇదే సమయంలో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీరు లేకపోవడంతో.. నీరు వచ్చినపుడు పట్టి ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. దీని వల్ల అందులో దోమలు పెరిగి డెంగ్యూ, ఇతర ప్రాణాంతకమైన జ్వరాలు ఇతర వ్యాధులు సోకుతున్నాయని చెబుతున్నారు.

తాగునీరు లేదు



పల్లెలో తాగునీరు లేదు. ట్యాంకరు ద్వారా నీరు తోలుతున్నారు. నీరు వచ్చినపుడు పట్టి నిల్వ చేసుకుంటున్నాం. ఇందులో దోమలు పెరిగి కుట్టే అవకాశం ఉంది. తాగునీటి సమస్య తీర్చాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తాగునీటి సమస్య తీర్చడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి. సమస్యను పరిష్కరించాలి.

- శివయ్య దళితవాడ

ఎక్కడ చూసినా జ్వరాలే

రాయచోటి మునిసిపాలిటీలో కూడా మలేరియా ఎక్కువగా ఉంది. బోస్‌నగర్‌లో సుమారు వారం క్రితం తొమ్మిదేళ్ల బాలుడు మలేరియా జ్వరంతో మృతి చెందినట్లు తెలిసింది. అదే విధంగా రాయచోటి మండలంలో ఎక్కువగా మాధవరం గ్రామంలో మలేరియా, డెంగ్యూ బాధితులు ఉన్నారు. గ్రామంలోని మద్దెలకుంట, మద్దెలవాండ్లపల్లె, కాల్వపల్లె, కురవపల్లె, యండపల్లె గ్రామం బోయపల్లె, గొర్లముదివీడు గ్రామం బాలిరెడ్డిపల్లెలో మలేరియా ఎక్కువగా ఉంది. లక్కిరెడ్డిపల్లె మండలంలో చింతకుంటపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, చంచర్లపల్లెల్లో మలేరియా జ్వరాలు అధికంగా ఉన్నాయి. సుండుపల్లె మండలంలో గుండ్లపల్లె, పెద్దమాదిగపల్లె, సుండుపల్లె పట్టణంలో మలేరియా ఎక్కువగా ఉంది. అక్కడక్కడా డెంగ్యూ కూడా ఉంది. వీరబల్లి మండలం షికారుపాలెంలో ఇంటికొక్కరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. సుమారు 50 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇక్కడ వైద్య, ఆరోగ్య సిబ్బంది నివారణ చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేదని స్థానికులు తెలిపారు. ఇదే మండలం శీతంపేట, బెజవాడ హరిజనవాడలో కూడా జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. గాలివీడు మండలం వెలిగల్లులో ప్రజానీకం జ్వరాలతో అవస్థలు పడుతున్నారు. సంబేపల్లె మండలంలో శెట్టిపల్లె గ్రామం దొడ్డిచేనువడ్డెపల్లెలో కూడా మలేరియా జ్వరాలు ఉన్నాయి.

నిర్ధారించవద్దని అధికారులే ఒత్తిడి

జ్వరం వచ్చిన వాళ్లు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తే.. సాధారణ జ్వరం అని చెపుతున్నారు. మందులు వాడుతున్నా.. తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే మలేరియా లేదా డెంగ్యూ అని నిర్ధారిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో మలేరియా నిర్ధారణ అయినపుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎందుకు కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొందరు అధికారులు మలేరియా ఉన్నట్లు నిర్ధారణ చేయవద్దని తమ కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

వైవీయూలో విద్యార్థుల ఆందోళన



వైవీయూ ప్రధానగేటు వద్ద ఆందోళన చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ విద్యార్థులు

కడప, వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా వున్న కొన్ని డిగ్రీ కళాశాలలు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి యూనివర్శిటీ ద్వారా అఫిలియేషన్ పొందారంటూ రాయలసీమ విద్యార్థి వేదిక నాయకులు శుక్రవారం వైవీయూ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మల్లెల భాస్కర్, జిల్లా కన్వీనర్ నాగార్జునలు మాట్లాడుతూ వైవీయూ అనుబంధంగా వున్న కొన్ని కళాశాలలు యూనివర్శిటీ రూల్స్‌ను, హైయర్ ఎడ్యుకేషన్ నిబంధనలు పాటించడం లేదన్నారు. డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు, తరగతి గదులు, ల్యాబ్స్, రెండెకరాల భూమి లేకుండానే వైవీయూ అధికారులు అఫిలియేషన్ ఎలా ఇచ్చారని సీడీసీ అధికారులను ప్రశ్నించారు.

వెంటనే ఆ కళాశాలలపై గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని కళాశాలలో అధ్యాపకులు సక్రమంగా లేరని విద్యార్థులకు పాఠాలు సరిగా చెప్పడం లేదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ఆర్‌ఎస్‌ఎఫ్ కన్వీనర్ భరత్, గంగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.



రూ.2 కోట్ల ప్రభుత్వ భూమి స్వాహాయత్నం

● రంగంలోకి రాజకీయ పెద్దలు

బద్వేలు: అది... కడప వెళ్లే రహదారికి సమీపంలో రూ.2 కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలం. ఖాళీగా ఉన్న ఈ స్థలంపై పలువురి కళ్లుపడ్డాయి. కొన్ని పెద్ద తలలు నిబంధనల ముసుగులో ఈ స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అట్లూరు మండలంలో ఎందరో స్థానికేతరులు అక్రమంగా పట్టాలు పొంది ఉన్నారు. వాగులు, చెరువు భూములకు పట్టాలు పుట్టించారు. ప్రభుత్వభూమిని ఆన్‌లైన్‌కు ఎక్కించారు. ఇలా అట్లూరు మండలంలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. తాజాగా అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం వద్ద ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలానికి ఎసరు ముంచుకొస్తోంది. దాదాపు 30 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంపై పలువురి కళ్లుపడ్డాయి. వివిధ కోణాల్లో ఈ స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో కూడా ఈ స్థలాన్ని ఖాజేసేందుకు కొంత మంది కబ్జాదారులు ప్రయత్నాలు చేశారు. కారణాలేవైనా అప్పట్లో వారి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. తిరిగి అధికారపార్టీకి చెందిన నాయకులు ఈ స్థలాన్ని నిబంధనల ముసుగులోనే స్వాధీనం చేసుకునేందుకు గత కొన్ని రోజుల నుంచి తహసీల్దార్‌పై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. కాలేజీని నిర్మిస్తామని, స్థలాన్ని అప్పజెప్పాలని ఒకవర్గం ప్రయత్నం చేస్తుండగా, మరో వర్గంవారు తమకే ఈ స్థలం ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ స్థలంపై కొందరు పెద్దనేతల అనుచర గణం వివిధ కోణాల్లో ప్రయత్నిస్తున్నారు. పెద్ద తలలే ఈ స్థలాన్ని స్వాహా చేసేందుకు అన్ని విధాలా పావులు కదుపుతున్నట్లు సమాచారం. కడప రహదారి సమీపంలో ఇంతటి విలువైన స్థలాన్ని ఏ రకంగానైనా వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో దీన్ని కబ్జా చేసేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అట్లూరు మండలంలో రెవిన్యూ అధికారుల ప్రోత్సాహంతో వాగులు, చెరువులు ప్రభుత్వ భూములకు పట్టాలు పొందినట్లు సమాచారం. 399 సర్వేనెంబర్‌లో ఓ మహి ళకు 1.5 ఎకరాలు ఉన్న భూమి ఉంది. అయి తే ఆమెను నిరుపేద కింద లెక్కకట్టి ఎకరం ప్రభుత్వ భూమిని అప్పజెప్పారు. దీనిని కూడా 1బిలో అధికారులు పొందుపరిచారు. వాస్తవంగా సొంతభూమి ఉన్నవారికి ప్రభుత్వభూమి ఇవ్వకూడదు, కానీ ఇక్కడ నిబంధనలు అమలు కాలేదు, ఇలా అనేక సర్వేనెంబర్లలో ప్రభుత్వభూమిని అక్రమంగా ఆన్‌లైన్ ఎక్కించి దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అట్లూరు మండలంలో జరుగుతున్న భూమాయాజాలంపై దృష్టిసారించి ప్రభుత్వ భూములను కబ్జాకు గురికాకుండా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండలవాసులు కోరుతున్నారు.

పేకాడుకుందాం రా !

ఆంధ్రజ్యోతి, కడప సిటీ : జిల్లాలో రిక్రియేషన్ క్లబ్బుల పేరిట కొన్నిచోట్ల పేకాట ఆడుతున్నారనే అనుమానం పోలీసుల్లో వుంది. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో క్లబ్బులు వున్నాయి. కడపలో నాలుగు క్లబ్బులు వున్నాయి. వీటన్నింటికీ రిక్రియేషన్ పేరిట అనుమతి పొంది వున్నారు. వీటిలో అధికారులకు క్లబ్ వుంటే న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సభ్యులుగా వున్నారు. ఇక్కడ 13 కార్డులు, కాయిన్స్‌తో మాత్రమే ఆటాడాల్సి వుంది. అలాగే ఆటలాడేందుకు ఆహ్లాదకరమైన వాతా వరణం వుండాలి. చెస్, క్యారమ్‌బోర్డు తదితర కాలక్షేపం కోసం ఆటాడుకోవచ్చు. అయితే కొన్ని క్లబ్బుల్లో 13 ముక్కల ఆట బదులు లోపల బయట ఇతర జూదం జరుగుతున్నట్టు సమాచారం. బయటకు కాలక్షేపం కోసమైనప్పటికీ వేలాది రూపాయలను ఆ ముక్కలపై పెట్టుబడి పెట్టి ఆటాడుతున్నట్లు ప్రచారం వుంది. ఇలా చాన్నాళ్ల నుంచి కొన్ని క్లబ్బులు సాగుతున్నట్లు సమాచారం. కొంతమంది ప్రముఖులు కూడా 13 ముక్కల పేరిట వేరొక జూదం ఆడుతున్నట్లు చెప్పుకొస్తున్నారు. ఎక్కడన్నా బయట ఆడాలంటే పోలీసుల బెడద వుంటుంది. అయితే కొన్ని క్లబ్బుల్లో అయితే ఎలాంటి బెడద వుండదు. అనుమతి వున్న ఆట ఆడుతున్నట్లు బయట కలరింగ్ ఇచ్చి ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. ఇక ప్రొద్దుటూరు అంటే అక్కడ లేని గ్యాంబ్లింగ్ లేదు. ముంబై తరహా మాఫియా వున్నట్లు చెప్పుకొస్తారు. కిడ్నాప్‌లు, బెదిరింపులు, మర్డర్లు, బెట్టింగ్, జూదం ఇలా ఏదైనా సరే ఇక్కడ సర్వసాధారణంగా సాగుతోంది. పోలీసులు ఎంత కట్టుదిట్టమైన నిఘాను, చర్యలు చేపట్టినా అక్కడ అంతగా పనిచేయవు. ఎందుకంటే పోలీసు, ఖద్దర్, అసాంఘిక శక్తులు అక్కడ భాయ్‌భాయ్‌గా వుంటారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అక్కడ ఓ క్లబ్‌లో జూదం పెద్దఎత్తున సాగుతున్నట్లు అభియోగాలు వున్నాయి. ఓ పార్టీకి చెందిన నేతలు ఆ క్లబ్ నడిపిస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. కాయిన్స్ ఆట ఆడుతున్నట్లు చెప్పుకొస్తున్నా ఒక్కో కాయిన్‌ను రూ.2500గా లెక్కించి ఆడుతున్నట్లు సమాచారం. చాలా రోజుల నుంచి ఈ తతంగం సాగుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే జిల్లాలోని కొన్ని రిక్రియేషన్ క్లబ్బులు పేకాటకు కేరాఫ్‌గా మారాయనే విమర్శలు వున్నాయి.

జిల్లా పోలీస్‌బాస్ ఇటీవల తన వ్యక్తిగత నిఘా సిబ్బందితో రాబట్టిన వివరాల మేరకు క్లబ్బులపై కన్నేసినట్టు తెలుస్తోంది.

పసిడిపురిని వణికిస్తున్న జ్వరాలు

● ఆస్పత్రులకు పరుగో... పరుగు ● ముందు జాగ్రత్తలతో జ్వరాలు దూరం



ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం బారులు తీరిన రోగులు

ప్రొద్దుటూరు క్రైం: వర్షాలు మొదలయ్యాయో లేదో అప్పుడే జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ జ్వరాలు ప్రొద్దుటూరు ప్రజలను వణికిస్తున్నాయి. ఒక వైపు విషజ్వరాలు, మరో వైపు మలేరియా జ్వరాలతో వణికిపోతున్నారు. వీటి వల్ల ఎలాంటి ఉపద్రవం వస్తుందోనన్న భయాందోళనలు వారిలో నెలకొని వున్నాయి. జిల్లా ప్రభుత్వాసుపత్రి సహా ఎన్టీఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. జ్వర పీడితుల సంఖ్య పెరగడం ఆందోళన కల్గిస్తోంది. పట్టణంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఒక్క ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోనే రోజుకు వెయ్యికి పైగా ఓపీ నమోదు అవుతుంటే, వారిలో 70 శాతం జ్వరాలతో వచ్చే వారే ఉన్నారు. అంతే ఇక్కడ జ్వర తీవ్రత ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. వర్షాలు కురవని సమయంలోనే అంటే జూన్, జులై నెలలోనే టైఫాయిడ్, మలేరియా జ్వరాలు ఎక్కువగానే నమోదయ్యాయి. జూన్‌లో టైఫాయిడ్ కేసులు 244, మలేరియా కేసులు 333, జులైలో 383 టైఫాయిడ్, 298 మలేరియా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురవడంతో ఈ నెల ఈ సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఆస్పత్రులు కిటకిట ...

పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని మురికివాడల్లో నివసించే ప్రజల్లో దాదాపు 30 శాతం మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాసుపత్రుల కంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులే జ్వరాల బారిన పడుతూ మంచాన పడుతున్నారు. దీనికి కారణాలేమైనా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అప్పుడే జ్వరాలను దూరం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటిలోనూ, పరిసరాల్లోనూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు పాటించాలి. లార్వా దశలోనే దోమల నివారణకు మందులు వాడాలి. ఈ దశలోనే నీటిలో వంద గ్రాములు కిరోసిన్ పోయాలి, దీంతో దోమలు వెంటనే చనిపోతాయి. ప్రత్యేకించి గ్రామాల్లో, పట్టణంలోని మురికివాడల్లో పారిశుధ్యం లేకుండా చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు పొగ మందును వినియోగించాలి. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలి. ఇళ్లల్లో మస్కిటో కాయిల్‌ను వినియోగించాలి. చిన్నపాటి జ్వరం వచ్చినపుడే వైద్యులను సంప్రదించాలి.

అప్రమత్తంగా ఉంటున్నాం



వర్షాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. దీంతో జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. ఈ క్రమంలో జ్వరాలతో వచ్చిన వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నాం. జ్వరాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉంటున్నాం. జ్వరాలకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరాలతో వచ్చిన వారికి రక్తపరీక్షలు నిర్వహించి, నిర్ధారించుకుని సరైన వైద్యం అందిస్తున్నాం. జ్వరాల గురించి ప్రజలకు అవగాహన కల్గిస్తున్నాం. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ లక్ష్మిప్రసాద్,
మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన ఏడీఆర్ఎం

ఎర్రగుంట్ల: గుంతకల్ ఏడీఆర్ఎం సుబ్బరాయుడు శుక్రవారం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా రైల్వేస్టేషన్ ముఖద్వార ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించాలన్నారు. రైల్వేస్టేషన్ వసతులపై ఆయన స్థానిక అధికారులను ప్రశ్నించారు. ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముద్దనూరులో పనిచేసే ఆర్వో ప్లాంటు ఇక్కడెందుకు పనిచేయదన్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరుపై ఏఎస్ఎంలను అడిగి తెలుకున్నారు. వికలాంగులకు ఏర్పాటు చేసిన వీల్ చైర్లను పరిశీలించారు. తాగునీటి కుళాయిలకు డమ్మీలు వేయడంపై ప్రశ్నించారు. అలాగే కూలింగ్ ప్లాంటుకు కనెక్షన్ బయటనే వేలాడుతుండటంపై ప్రశ్నించారు. ఒకటవ ప్లాట్‌ఫామ్‌పై ప్రహరీని వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షం వస్తే ప్రయాణికులు జారి కింద పడటాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా రైల్వే ప్రయాణికులు వెళ్లేందుకు వేసిన పాత్‌వే నుంచి బయటికి వెళ్లే దారిని బాగా తయారు చేయాలన్నారు. రెండు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులకు టాయిలెట్స్ లేకపోవడం, రిజర్వేషన్, వికలాంగుల కోసం ఉన్న వెయిటింగ్ హాల్‌కు తాళం వేయడంపై ఆయన దృష్టికి తీసుకెళ్లగా కిందిస్థాయి అధికారులను ప్రశ్నించారు. ఒకటవ ప్లాట్‌ఫారంపై నిర్మిస్తున్న వెయింగ్ హాల్‌ను త్వరగా పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే రెండవ ప్లాట్‌ఫారంపై నిర్మిస్తున్న టాయిలెట్స్‌ను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్లాట్‌ఫారాలపై వరండాలు ఏర్పాటు చేయాలని అడుగుగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. మొదటి ప్లాట్‌ఫారంపై వచ్చే రైళ్లు ఎన్ని ఉన్నాయో రెండవ ప్లాట్‌ఫారంపై కూడా అన్నే రైళ్లు వస్తున్న దృష్ట్యా అక్కడ రెండవ క్యాంటీన్‌ను వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై లైటింగ్‌ను ఆరా తీశారు. ప్రయాణికులు, బయటి ప్రజలు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై వెళ్లేందుకు పాత్‌వేను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎర్రగుంట్ల- నంద్యాల రైల్వేలైన్‌లో రైళ్ల వేగం కేవలం 30 కి.మీ ఉండటంతో డెమో ప్యాసింజర్ రోజూ ఐదారు గంటల పాటు ఆలస్యంగా నడుస్తుండటం, ప్రయాణికులు పూర్తిగా తగ్గిపోవడం, రైలు బోగీలోనే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడంపై ఆయన దృష్టికి తీసుకురాగా అతి త్వరలో వేగాన్ని 50 కి.మీ.లకు పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలుకు సాధారణ బోగీలు ఏర్పాటుకు కూడా ప్రయత్నిస్తామన్నారు. ఆయన వెంట ఏడీఈ స్టాన్లీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్లాట్‌పారంపై వసతులను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం

అండర్-14 ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ ఎంపిక

కడప, స్పోర్ట్స్: ఈ నెల 21 నుంచి 23 వరకు అనంతపురంలోని ఆర్‌డీటీలో జరుగు అండర్-14 రాష్ట్ర పోటీలకు శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అండర్-14 ఫుట్‌బాల్ జిల్లా ప్రాబబుల్స్‌ను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ హుసేన్ అధ్యక్షతన ఎంపికలు జరిగాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అండర్-17 సాయశక్తులా అభివృద్ధి చేశాము. దీంతో పలువురు క్రీడాకారులు జాతీయ, పీఎండబ్ల్యూపీ స్థాయిలో పాల్గొన్నారని తెలిపారు. 2015లో ఇమ్రాన్ (కడప), 2016లో అంజి (ఎర్రగుంట్ల) క్రీడాకారులు సంతోష్ ట్రోఫీలో పాల్గొన్నారన్నారు. అండర్-14 క్రీడాకారులు పరిచయం చేసుకొని జిల్లా ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. ఈ ఎంపిక కమిటీలోని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మైకేల్ డానియల్ ప్రదీప్, యంగ్‌మెన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్, వల్లూరు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగాయి. అనంతరం ప్రాబబుల్స్‌ను ఎంపిక చేసి ప్రకటించారు. వీరు ఈ నెల 13 నుంచి 19 వరకు నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో జరిగే శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

అండర్-14కు ఎంపికైన వారు

కొండారెడ్డి, జగదీష్, మహ్మద్ యాసిన్, ఆరీఫ్, జగదీష్, పూజిత్, వెంకటశివ, జశ్వంత్, పరమేశ్వరరెడ్డి, బాష, ధనుంజయరెడ్డి, రామమూర్తి నాయుడు, సాయిరామ్, జగదీష్, బాలాజీ, ఫర్హాన్, జీవీ లోక్‌నాథ్‌రెడ్డి, హమీద్, మహ్మద్, రాఘవేంద్ర, నరసింహ, నాగేశ్వర్, లీలావంశీ, మహేష్, వంశీతేజలు వున్నారు.

సోషల్ మీడియాతో దుష్ఫలితాలే ఎక్కువ..


పి.పావని, విద్యార్థిని, ఎస్వీ ఇంజనీరంగ్ కాలేజి, కడప



ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సోషల్ మీడియాతో దుష్ఫలితాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొత్త విషయాలు తెలుసుకోవడం మంచిదే కానీ చదువుపై శ్రద్ధ లేకపోవడం చూస్తే దానిపై ఎంత ప్రభావం ఉందో తెలుస్తుంది. యువకులు ఎంటర్‌టైన్‌మెంట్‌కు అలవాటుపడి తప్పుడు ధోరణికి లోనవుతున్నారు. ఇది ప్రమాదకరమని తెలుసుకోవాలి.

యువతపై సోషల్ మీడియా ప్రభావం..

ప్రస్తుతం సోషల్ మీడియా హల్‌చల్ చేస్తున్న తరుణంలో యువత చాలవరకు ఇందులో మునిగింది. ఈ మీడియా కొన్ని సందర్భాల్లో మంచికి దోహదపడినా మరికొన్ని సందర్భాల్లో చెడును కలిగిస్తోంది. కొన్ని సందర్భాల్లో తప్పుడు సంకేతాలకు తావిస్తోందనడంలో సందేహాల్లేవని కొందరు యువ విద్యార్థుల మనోగతం.



టెక్నాలజీ మోజులో చీకటి దారిలో...

శ్రమయేవ జయతే.. సాధించేది యువతే..



యువతలో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు...

మమత, సీఈవో, స్టెప్, కడప.



జిల్లాలో యువతను చైతన్యం చేసే దిశగా ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టాం. ఇందుకు సంబంధించి 2 వేల మందికి అవసరమైన శిక్షణ ఇప్పించాం. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. గతేడాదిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల నుంచి సుమారు 20 వేల మంది యువతీ యువకులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.

ప్రయోజనాల కన్నా అనర్థాలే అధికం..

సనత్‌కుమార్, విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజి, కడప



సోషల్ మీడియా నేటి యువతను ఊర్రూతలూగిస్తోంది. అయితే దానివల్ల ప్రయోజనాల కన్నా అనర్థాలే అధికంగా కనిపిస్తున్నాయి. తప్పుడు సమాచారంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. కొందరైతే ఫేస్‌బుక్‌లో లేనిపోని విషయాలను షేర్ చేస్తారు. వీటివల్ల మోసానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు. టైంపాస్ చేసేవారికి సోషల్ మీడియా చాలవరకు ఉపయోగపడుతుంది.

మీడియా వల్ల నష్టాలే ఎక్కువ..

హరిత, డిగ్రీ విద్యార్థినీ, ఎస్వీ డిగ్రీ కాలేజి, కడప



సోషల్ మీడియా వల్ల ఎక్కువగా నష్టాలే ఉంటాయి. మనకు ఎలాంటి విషయాలు అవసరమో వాటిని స్వీకరించాలి. మిగిలిన తప్పుడు విషయాలను పట్టించుకోకపోవడం మంచిది. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటివి కూడా ప్రమాదకరమే. అందులో నిజనిజాలు ఎంతవరకు కరెక్ట్ అనేది ఉండదు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువతరం పలువురికి ఆదర్శంగా ఉండే ఉన్నత శిఖరాలను చేరుకుంటేనే ఫలితం ఉంటుంది.



యువతా మేలుకో.. లక్ష్యం చేరుకో...



మంచిని స్వీకరించాలి..

కె. మహేశ్వరి, విద్యార్థిని, ఎస్వీ ఇంజనీరంగ్ కాలేజి



ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పలు విషయాలను సోషల్ మీడియా అతి త్వరగా వెలుగులోకి తెస్తోంది. అయితే ఇందులో నిజనిజాలు పూర్తిగా ఉండకపోతే తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇందులో మంచిని మాత్రమే స్వీకరించి చెడును వదలివేయాలి. చాలా సులభంగా ఉందని చాటింగ్ అలవాటు పడిన వారు చదువుపై శ్రద్ధ చూపడం లేదు.


భవిష్యత్తు వారి చేతుల్లోనే..! | శక్తిని ఫణంగా పెడితే విజయం నీదే.. | యువతరం వేయాలి అడుగు నవతరం వైపు | నేడు అంతర్జాతీయ యువజనోత్సవం

కడప, కోటిరెడ్డిసర్కిల్

నటనలో రాణించాలా? అన్ని భాషల సినిమాలు చాడాలి.. నాట్యం నేర్చుకోవాలా..? నిరంతరం శ్రమించాలి.. విదేశీ చదువులా? ఉద్యోగమా? అన్ని వెబ్‌సైట్లు వెదుకుతూనే ఉండాలి.. పట్టు వదలని విక్రమార్కుల్లా ఉండాలి. గగనమే వీరిగమ్యం విభిన్న నేపథ్యం.. వైవిధ్య దృక్పథం. ఎంచుకున్న రంగాల్లో గగనం చేరేందుకు వీరికి గమనమే గమ్యంగా సాగిపోతామంటున్నారు. పట్టుదల, నైపుణ్యాలనే తాళ్లుగా చేసి హరివిల్లుపై ఊయలుగా ఊగగలరు. కష్టాలు పలుకరించినా, జీవితం కనికరించకున్నా ఎదురొడ్డి పోరాడగలమంటున్నారు. వివిధ రంగాల్లో భవిష్యత్తు తరాలకు దీపధారులం కాగలమని చెబుతోంది నేటియువత. యువత మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాలు వంటి దురలవాట్లకు బానిసలు కారాదు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాభివృద్ధికి కృషి చేయాలి. ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలి.

యువశక్తి..

నేటియువతే రేపటి భవిత అంటారు. యువతకు అంతులేని శక్తి అపారమైనది. దేశ ఉన్నత్తికి, ఔన్నత్యానికి ఈ శక్తి ఫణంగా పెడితే తిరుగులేని విజయాలే ఉంటాయి. వారి విజయాలు వ్యక్తిత్వం మాత్రమే కాదు. సామాజికమైనవి. తద్వారా జాతీయం, అంతర్జాతీయం అయ్యాయి. ఈ శక్తి ఎపుడూ అనుకూల పథంలో సాగాల్సి ఉంటుంది. యువశక్తి దేశానికి ఎంత మేలు చేస్తుందో.. గతి తప్పితే అంతకు రెట్టింపు కీడు చేస్తుంది. నేటితరానికి బాధ్యతలు గుర్తు చేసేందుకు, యువతకు గల శక్తిని చాటి చెప్పేందుకే అంతర్జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. యువతరం తమ ధోరణి మార్చుకోవడం ద్వారానే యువజనోత్సవాలు సార్థకమవుతాయి.



దేనికీ భయపడవద్దు.. మీరు అద్భుతాలను సాధించగలరు. భయపడిన మరు క్షణమే మీరు ఎందుకూ పనికిరారు. లోకం దుఃఖానికి కారణం ఈ భయమే! భయమే సర్వ బంధకారిణి. నిర్భయత్వం ఒక్క క్షణంలో సైతం స్వర్గాన్ని ప్రాప్తింపచేయగలదు. స్వామి వివేకానంద

చేదు జ్ఞాపకాలు పునరావృతం కాకుండా లక్ష్య సాధనకు సరికొత్త కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో యువతదే కీలక పాత్ర. ఒక మార్గం.. ఒక దిశా నిర్దేశం.. చివరి గమ్యంకోసం కఠోర సాధన చేయాలి..

అందుకే శ్రమయేవ జయతే.. సాధించేది యువతే



ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో శిక్షణ పొందిన యువకులు (ఫైల్)

యువతీ యువకులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం జిల్లా యువజనుల సర్వీసుల శాఖ(స్టెప్) ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో ప్రధానంగా యువత తాము ఎంచుకున్న రంగాలకు సంబంధించిన శిక్షణ అందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ రోజులకు సంబంధించి ప్రజల్లో యువతీ, యువకుల్లో అవగాహన కల్పించడం వంటివి చేస్తున్నారు. అలాగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ పురస్కరించుకుని సుమారు 210 మంది యువకులకు ఎంపికకు అవసరమైన శిక్షణ ఇచ్చారు. ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమం కింద 350 మందికి అవగాహన తరగతులు నిర్వహించారు. కాగా ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో 138మంది జిల్లా నుంచి ఎంపికయ్యారు. ఇటీవల యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం కింద 100మంది యువతీ యువకులను రాష్ట్రవ్యాప్త పర్యటనకు పంపించి వారిలో చైతన్యం తీసుకొచ్చే విధంగా కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు జాతీయ విపత్తు నిర్వహణపై సుమారు 200మంది యువకులకు శిక్షణ ఇప్పించారు. వీరు ఆయా ప్రాంతాల్లో అనుకోని విధంగా ప్రకృతి పరంగా సంభవించే విపత్తుల్లో పాల్గొని స్వచ్ఛంద సేవలు అందించే విధంగా చైతన్యపరిచినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో యువతీ యువకులకు అవగాహన తరగతులు చేపట్టారు.

మీడియా ప్రభావం.. ప్రభుత్వ కార్యక్రమాలు



ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొన్న యువత(ఫైల్)

నిరుద్యోగ యువతలో చిగురిస్తున్న ఆశలు..

జిల్లాలో పెద్ద పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఉపాధి, సమీప ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేసింది. కరువు కాటకాలతో అల్లాడుతున్న కడప జిల్లాలోనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుకుంటోంది. ఈ దిశగా పలు ప్రజా సంఘాలు కూడా నిరుద్యోగులకు బాసటగా నిలిచి ఉద్యమాలు చేపట్టాయి.

ఉన్నత స్థాయికి చేరాలనే లక్ష్యం ఉండాలి..

మహమ్మద్, డిగ్రీ విద్యార్థి, ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజి



భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే లక్ష్యం ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానం అవసరమే. కానీ సోషల్ మీడియాకు అవసరమైనంతగా వినియోగించుకుని అందులో మంచి సమాచారాన్ని మాత్రమే తీసుకోవాలి. మోసాలకు గురయ్యే విధంగా కొన్ని ప్రకటనలు వస్తుంటాయి. వాటిని నమ్మి జీవితం నాశనం చేసుకోకూడదు.

యువత దేశానికి వెన్నెముక..

డాక్టర్ పివిఎన్.రెడ్డి, ప్రిన్సిపాల్, ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజి



దేశానికి యువత వెన్నెముకలాంటిది. పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకోవాలి. అయితే ఎంతవరకు అవసరమో అంతవరకే ఉండాలి. శృతి మించితే అనార్థలే. వారి శక్తి సామర్థ్యాలు దేశానికి ఎంతో అవసరం. అయితే ఉన్నత చదువులు చదివేటపుడు భవిష్యత్తును దృష్టి పెట్టుకోవాలి. లేదంటే వారికి కష్టాలే.

రాజంపేటలో 14 హైస్కూళ్ల డిజిటలైజేషన్

- విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం
- ఆంధ్రజ్యోతితో తానా అధ్యక్షుడు వేమన సతీష్



రాజంపేట

రాజంపేట ప్రాంతంలో 14 ఉన్నత పాఠశాలలను డిజిటల్ స్కూల్స్‌గా మార్చడానికి నిధులు కేటాయించామని ఉత్తర అమెరికా తెలుగుసంఘం (తానా) అధ్యక్షుడు సతీష్ వేమన తెలిపారు. రెండు రోజుల్లో రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు అధ్వర్యంలో ప్రతి పాఠశాలకు మూడు కంప్యూటర్లు, ఒక స్క్రీన్, ప్రొజెక్టర్ అందజేయనున్నట్లు, ఒక్కో పాఠశాలకు 1.50 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. రాజంపేట ప్రాంతంలోని ఉన్నత పాఠశాలలకు ఇవి కేటాయిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది 100 కోట్ల రూపాయలతో వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని , విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు తొలి ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. తానా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా తన స్వగ్రామం రాజంపేటకు వచ్చిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 2250 పాఠశాలలను డిజిటల్ స్కూల్స్‌గా మార్చడానికి తానా కోట్లాది రూపాయల నిధులను విడుదల చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 70 శాతం ఖర్చు చేస్తుండగా, అందులో 30 శాతం తానా అందజేస్తుందన్నారు.

క్యాన్సర్, కంటి ఆపరేషన్‌ల కోసం ప్రత్యేకంగా నిధులు

బసవతారకం ఆసుపత్రి సహకారంతో రాష్ట్రమంతా క్యాన్సర్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన చోట వాటి ఆపరేషన్‌ల కోసం తమవంతు సహకారం అందజేస్తామని తానా అధ్యక్షుడు సతీష్ వేమన తెలిపారు. మొదటగా 200 మంది క్యాన్సర్ రోగులను గుర్తించి వారి ఆపరేషన్‌కు తాము సహాయపడతామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో లక్ష మందికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి చూపు లేనివారందరికీ శంకర ఐ ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో ఆపరేషన్‌లు నిర్వహించి వారికి చూపు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విధంగా విద్య, వైద్య, ఆరోగ్య రంగాలకు ఎక్కువ నిధులు కేటాయిస్తున్నామన్నారు.

ప్రతి ఏడాది 8 మిలియన్ల డాలర్ల ఖర్చు

తానా ద్వారా ఇటు అమెరికాలోనూ.. అటూ తెలుగు రాష్ట్రాలలోనూ ఏటా 8 మిలియన్‌ల డాలర్లను సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పేద విద్యార్థులకు 10 వేల మందికి ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశామని తెలిపారు.

కళారంగాలకు అధిక ప్రాధాన్యం

ప్రాచీన నాగరికతలో మరుగవుతున్న మన కళారంగాన్ని ఆదుకోవడానికి తానా ఎక్కువ నిధులు కేటాయిస్తుందన్నారు. జానపద రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించామన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ సహకారంతో 500 మంది విద్యార్థినులను గుర్తించి వారికి కూచిపూడి నాట్యం నేర్పించి ప్రత్యేకంగా వారికి సర్టిఫికెట్లను తానా అందజేస్తోందని తెలిపారు.

శ్మశానాల్లో ఎలక్ట్రికల్ ట్రిమిటోరియంకు రూ.10 లక్షలు

రాష్ట్రంలోని పెద్ద పట్టణాల్లో శ్మశానాలలో ఏర్పాటు చేసుకునే ఎలక్ట్రికల్ ట్రిమిటోరియాలకు 10 లక్షల రూపాయలను తానా ఇస్తోందని సతీష్ తెలిపారు. తిరుపతి అలిపిరి, కరకంబాడి సెంటర్లలోని శ్మశాన వాటికలు ఎలక్ట్రికల్ ట్రిమిటోరియంలు ఏర్పాటు చేయడానికి తానా 30 లక్షల రూపాయలు ఇచ్చిందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి సహకరించడంలో కూడా తానా ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే 30 అంగన్‌వాడీ భవనాలను తానా నిర్మిస్తోందన్నారు. ఈ విధంగా తన పదవీకాలంలో ఇటు తెలుగు రాష్ట్రాలలోనూ.. అటు అమెరికాలోనూ తానా అనేక కార్యక్రమాలను నిర్వహించి సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సతీష్ వేమన వెల్లడించారు.

అమెరికాలోని తెలుగు వారందరికీ తానా అండ

అమెరికాలో ఉన్న తెలుగు వారందరికీ తానా ప్రత్యేక రక్షణగా ఉంటుందన్నారు. ఎవరైనా అక్కడ చనిపోతే అమెరికా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోదని, అయితే తానా సొంత ఖర్చులతో ఆ చనిపోయిన వారి పార్థివ దేహాలను ఇంటికి పంపిస్తోందని తెలిపారు. తానా ప్రారంభించిన 40 సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు 700 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని వెల్లడించారు. ప్రధానంగా మూడు కళాశాలలను తానా ఏర్పాటు చేసిం దన్నారు. అమెరికాలో తెలుగువారందరినీ ఆదుకోవడం, ప్రధానంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అంద జేస్తున్నట్టు వెల్లడించారు.

కదిలే మేఘమా .. కాసేపు ఆగవమ్మా ...



ఇడుపులపాయ శేషాచలం మేఘమాల ఛత్రం

ఈ దృశ్యం ఏ అరకులోయో, ఊటీనో, సిమ్లా ప్రాంతం అనుకుంటే పొరపాటే. వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ సమీపంలో ఉదయం పూట కనువిందు చేస్తున్న ఆహ్లాదకర వాతావరణం. తిరుమల కొండల మాదిరిగా ఉన్న ఇడుపులపాయ శేషాచల కొండలపై మంచు దుప్పటిలా పరుచుకున్నట్లు ఆ ప్రాంతంలో ఉన్న వారికి ఆహ్లాదకరాన్ని అందిస్తోంది. ఈ దృశ్యాలను వేంపల్లె ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది. **వేంపల్లె**


1976 మే 25 ఏ వారం అవుతుంది?

మెంటల్ ఎబిలిటి

1. 200 కిమీ పొడవైన రహదారిపై రెండు కార్లు చెరోవైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. మొదటి కారు 40 కిమీ ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 20 కిమీ ప్రయాణించింది. మరల ఎడమవైపునకు తిరిగి 35 కిమీ ప్రయాణించింది. తదుపరి ఎడమవైపునకు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొంది. రెండో కారు చిన్న లోపంతో కేవలం 55 కిమీ మాత్రమే ప్రయాణించింది. అయితే ప్రస్తుతం ఆ రెండు కార్ల మధ్య దూరం ఎంత?
ఎ) 60 కిమీ బి) 80 కిమీ సి) 75 కిమీ డి) 70 కిమీ
2. 6842109357 సంఖ్యలో మొదటి అంకెను రెండో స్థానంలోకి, రెండో అంకెను మొదటి స్థానంలోకి, మూడో అంకెను నాలుగో స్థానంలోకి, నాలుగో అంకెను మూడో స్థానంలోకి ఇలా అన్ని అంకెలు మారగా ఏర్పడిన కొత్త సంఖ్యలో ఎడమ నుంచి అయిదో అంకెకు గల మూడో కుడి అంకె?
ఎ) 9 బి) 5 సి) 3 డి) 4
3. కింది సంఖ్యలను ముందుగా వ్యతిరేక దిశలో రాసి తరవాత ఆ సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే మధ్య సంఖ్య మధ్య అంకె?
853, 942, 687, 439, 924, 168, 316
ఎ) 8 బి) 2 సి) 1 డి) 4
4. 80 మంది విద్యార్థులు ఉన్న ఒక వరసలో కిరణ్ ఎడమ నుంచి 32వ స్థానంలోను, తరుణ్ కుడి నుంచి 28వ స్థానంలోను ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరి మధ్య గల విద్యార్థుల సంఖ్య?
ఎ) 20 బి) 40 సి) 28 డి) 26
5. ఒక వరసలో అచ్యుత్ ఎడమ నుంచి పదో స్థానంలోను, కుడి నుంచి ఆరోస్థానంలోను ఉన్నాడు. ఆ వరసలో మొత్తం సభ్యుల సంఖ్య 34 ఉండాలంటే ఎంతమంది వ్యక్తులు అవసరం?
ఎ) 12 బి) 19 సి) 21 డి) 18
6. వివేక్‌కు అతని సోదరి పుట్టిన రోజు ఆగస్టు 20, 25 మధ్య అని గుర్తు. అతని తండ్రికి తమ కుమార్తె పుట్టిన రోజు సెప్టెంబరు 23, 28 మధ్య అని గుర్తు అయితే వివేక్ సోదరి పుట్టిన రోజు ఎప్పుడు?
ఎ) ఆగస్టు 24 బి) సెప్టెంబరు 24
సి) చెప్పలేం డి) ఏదీకాదు
7. పాట్నాకు ఒక రైలు ప్రతి 80 నిలకు ఉంది. విచారణాధికారి తనను కలసిన ప్రయాణి కుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాతి రైలు గం.10.15నిలకు అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పాడు?
ఎ) గం. 9.10 ని. బి) గం. 10.20 ని.
సి) గం. 9.30 ని. డి) ఏదీకాదు
8. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల సరి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏమీ లేవు
9. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి

8	5	961
7	8	522
9	3	?

ఎ) 843 బి) 441 సి) 924 డి) 462
10. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి



ఎ) 65 బి) 92 సి) 48 డి) 64



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

11. ఒక అంకె 3 కన్నా పెద్దది 7 కన్నా చిన్నది. అదే అంకె 5 కన్నా పెద్దది, 9 కన్నా చిన్నది. అయితే ఆ అంకె?
ఎ) 8 బి) 4 సి) 6 డి) 9
12. 1976 మే 25 ఏ వారం అవుతుంది?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం
13. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల బేసి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 2 5 6 8 5 2 7 3 4 6 8 7 9 2 1 4 8 9 3
ఎ) నాలుగు బి) మూడు సి) రెండు డి) ఏమీలేవు
14. ఇంటర్వ్యూ నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 11.00 కంటే 15 ని.లు ముందుగా వచ్చారు. ఈయన చైర్మన్ కంటే 25ని.లు ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 20 నిలు ముందు వచ్చారు. అయితే ఇంటర్వ్యూని ఎప్పుడు నిర్వహించాలనుకొన్నారు?
ఎ) గం. 11.00 ని. బి) గం. 11.30 ని.
సి) గం. 11.15 ని. డి) ఏదీకాదు
15. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్యలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Mobile 2. Master 3. Manner
4. Market 5. Minister
ఎ) Master బి) Minister
సి) Market డి) Mobile
16. అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం కుడి నుంచి 12 వ అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరం?
ఎ) P బి) R సి) Q డి) J
17. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను సవ్య దిశలో రాసి రెండో సగం అక్షరాలను అపసవ్య దిశలో రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల అయిదో కుడి అక్షరం?
ఎ) Z బి) Y సి) X డి) W
18. సవ్యదిశ వర్ణమాలలో కుడి ఆరో అక్షరం నుంచి పది అక్షరాలను అపసవ్యదిశలో రాసి మిగిలిన అక్షరాలను యధాతథంగా రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల నాలుగో కుడి అక్షరం?
ఎ) U బి) R సి) T డి) S
19. 1956 ఆగస్టు 2న ఏవారమవుతుంది?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) బుధవారం
20. ఈ రోజు ఆగస్టు 19 గురువారం. ఇది లీపు సంవత్సరమయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) ఆదివారం బి) శనివారం
సి) సోమవారం డి) బుధవారం
21. 2001 జనవరి 1 శుక్రవారం అయితే తదుపరి వచ్చే ఏ సంవత్సరంలో జనవరి 1 శుక్రవారమవుతుంది?
ఎ) 2001 బి) 2007 సి) 2008 డి) ఏదీకాదు
22. ఈ రోజు నవంబరు 14 గురువారం. ఇది లీపు సంవత్సరం. అయితే అయిదేళ్ల తరవాత ఇదే తేదీకి ఏ వారమొస్తుంది?
ఎ) బుధవారం బి) మంగళవారం
సి) గురువారం డి) ఏదీకాదు
23. గడియారంలో సమయం గం.1.30ని. అయితే నిముషాల ముల్లు, గంటల ముల్లు మధ్య కోణం?
ఎ) 180° బి) 120° సి) 135° డి) 140°
24. విక్రం 50 మీ ఉత్తరానికి నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 40 మీ నడిచాడు. మరల కుడివైపునకు తిరిగి 35 మీ నడచిన తరవాత కుడివైపునకు తిరిగి 25 మీ నడిచాడు. చివరగా ఎడమవైపునకు తిరిగి 15 మీ నడిచాడు. అయితే ప్రస్తుతం విక్రం బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 15 మీ తూర్పు బి) 15 మీ పడమర
సి) 15 మీ ఉత్తరం డి) 15మీ దక్షిణం
25. గడియారంలో సమయం గం.12.00 అయింది. గంటల ముల్లు తూర్పును చూపిస్తోందనుకొంటే గం3.30నిల సమయంలో నిముషాల ముల్లు ఏ దిక్కును సూచిస్తోంది?
ఎ) తూర్పు బి) ఉత్తరం సి) దక్షిణం డి) పడమర

26 - 30

A, B లు భార్యాభర్తలు. X, Y లు సోదరులు. A కుమార్తె K. Y తల్లి B. M తండ్రి Y. Z కుమార్తె M. F భార్య K. T కుమారుడు A. K కుమారుడు N. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి?

26. T కి B ఏమవుతారు?
ఎ) కోడలు బి) అత్తగారు
సి) మామగారు డి) ఏదీకాదు
27. M కి K ఏమవుతారు?
ఎ) మేనల్లుడు బి) మేనత్త
సి) మేనమామ డి) మేనకోడలు
28. Z కి A ఏమవుతారు?
ఎ) అత్తగారు బి) కోడలు
సి) అల్లుడు డి) మామగారు
29. X కి N ఏమవుతారు?
ఎ) మేనకోడలు బి) మేనమామ
సి) మేనల్లుడు డి) మేనత్త
30. B కి F ఏమవుతారు?
ఎ) అల్లుడు బి) కోడలు
సి) మేనల్లుడు డి) మేనకోడలు

31 - 35

1. ఒక కళాశాలలో A, B, C, D, E, F, G, H, I, J అనే పది పరీక్షలను వారం రోజుల్లో నిర్వహించదలిచారు. ఆదివారం సెలవు. ప్రతి రోజు ఒకటి/ రెండు పరీక్షలు జరుగుతాయి.
2. B పరీక్షతోపాటు మరో పరీక్ష ఉంటుంది. కాని గురువారం కాదు.
3. A తో పరీక్షలన్నీ మంగళవారం మొదలౌతాయి
4. చివరి రోజు, శుక్రవారంనాడు ఒక పరీక్ష మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు J పరీక్ష నిర్వహిస్తారు.
5. H పరీక్ష, D తరవాత ఉంటుంది. D పరీక్ష, F తరవాత ఉంటుంది.
6. చివరి రోజున E పరీక్ష ఉంటుంది. J పరీక్ష తరవాతి రోజు G, సెలవు రోజుకి ముందు రోజు I పరీక్ష ఉంటాయి. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. సెలవు రోజుకి ముందు నిర్వహించే పరీక్షలు?
ఎ) D, B బి) G, I సి) H, C డి) ఏదీకాదు
32. H పరీక్ష రోజున ఉన్న మరో పరీక్ష?
ఎ) B బి) F సి) C డి) ఏదీకాదు
33. బుధవారం రోజున ఉన్న పరీక్ష?
ఎ) C, H బి) B, D సి) G, I డి) ఏదీకాదు
34. C పరీక్ష తరవాతి రోజు ఉండే పరీక్ష?
ఎ) E బి) F సి) J డి) ఏదీకాదు
35. మొదటి రోజు జరిగే పరీక్షలు?
ఎ) A, F బి) C, H సి) G, I డి) D, B
36. వినయ్ పడమరకు 80 మీ నడచిన తరవాత ఎడమవైపునకు తిరిగి 30 మీ నడిచాడు. మరల ఎడమకు తిరిగి 20 మీ నడిచాడు. చివరగా ఉత్తరానికి 110 మీ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలు దేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఏ దిశలో ఉన్నాడు?
ఎ) 100 మీ నైరుతి బి) 100 మీ వాయవ్యం
సి) 100 మీ ఈశాన్యం డి) 100 మీ ఆగ్నేయం

37 - 38

కింది పదాలకు అర్థవంతమైన రీతిలో సరైన క్రమాన్ని meaningful sequence of order తెలపండి

37. 1. Walls 2. Windows 3. Foundation
4. Roof 5. Room 6. Floor
ఎ) 3, 2, 5, 4, 1, 6 బి) 3, 1, 2, 4, 6, 5
సి) 3, 1, 2, 6, 4, 5 డి) 3, 1, 2, 4, 5, 6
38. 1. Rain 2. Rainbow 3. Child
4. Sun 5. Happy
ఎ) 1, 4, 2, 3, 5 బి) 1, 2, 3, 4, 5
సి) 1, 2, 4, 5, 3 డి) 1, 3, 4, 2, 3

సమాధానాలు

1) డి	7) ఎ	13) ఎ	19) సి	26) ఎ	33) బి
2) ఎ	8) సి	14) బి	20) ఎ	27) బి	34) సి
3) సి	9) బి	15) ఎ	21) బి	28) డి	35) ఎ
4) ఎ	10) ఎ	16) సి	22) ఎ	29) సి	36) బి
5) బి	11) సి	17) బి	23) సి	30) ఎ	37) బి
6) సి	12) బి	18) డి	24) ఎ	31) బి	38) ఎ
			25) డి	32) సి	

ఉద్యోగాలు

టిఎస్‌సిఎబి

తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టిఎస్‌సిఎబి)- ఆర్‌బిఐ/ నాబార్డ్ సహకారంతో కింది అయిదు డిసిసిబి బ్యాంకుల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

డిసిసిబి బ్యాంకులు: హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

వయసు: 55 ఏళ్లు మించరాదు

అర్హత: పీజీ/ సీఏ/ డిగ్రీ + సిఏఐఐబి/ డిబిఎఫ్/ డిప్లొమా(కో ఆపరేటివ్ బిజినెస్ మేనేజ్‌మెంట్)/ పీజీడిసిఆర్‌ఎస్ పూర్తిచేసి ఉండాలి. బ్యాంకింగ్ రంగంలో కనీసం ఎనిమిదేళ్ల మిడిల్/ సీనియర్ మేనేజ్‌మెంట్ కేడర్‌లో పనిచేసి ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు డౌన్‌లోడింగ్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 31

దరఖాస్తు సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 7

చిరునామా: Managing Director, TSCAB, Head Office, Troop Bazar, Hyderabad- 500001

వెబ్‌సైట్: www.tscab.org

స్కాలర్‌షిప్

టైమ్-క్యాట్ మాక్ టెస్ట్

మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లకు శిక్షణ ఇచ్చే ప్రముఖ సంస్థ 'టైమ్' క్యాట్ ఔత్సాహికుల కోసం దేశ వ్యాప్తంగా ఆగస్టు 13న ఆల్ ఇండియా ఫ్రీ మాక్ టెస్ట్‌ను నిర్వహించనుంది. ఇన్విజిలేట్, నాన్ ఇన్విజిలేట్ పద్ధతుల్లో ఈ మాక్ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో చక్కని ప్రతిభ చూపిన వారికి 2017/18 క్యాట్ క్లాస్ రూమ్ ప్రోగ్రామ్, టెస్ట్ సిరీస్‌లపై ఫీజులో రాయితీ ఇస్తారు. అయితే ఈ అవకాశం ఇన్విజిలేట్ మోడ్‌ను ఎంపిక చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుంది. రియల్ టైమ్ ఎగ్జామ్ ఎక్స్‌పిరీయెన్స్ కల్పించేలా ఈ మాక్ టెస్ట్‌ను రూపొందించినట్లు టైమ్ క్యాట్ కోర్స్ డైరెక్టర్ రామనాథ్ కనకదండి తెలిపారు.


రిజిస్ట్రేషన్ లింక్: http://www.time4education.com/local/articlecms/page.php?id=1030

వెబ్‌సైట్: www.time4education.com

మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?

మానవ శరీరం

1. మానవ శరీరంలోని అతిపెద్ద గ్రంథి ఏది?
ఎ) అవటు గ్రంథి బి) క్లోమ గ్రంథి
సి) కాలేయం డి) పీయూష గ్రంథి
2. మానవ దేహంలోని అతి పెద్ద అవయవం ఏది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) అవటు గ్రంథి డి) గుండె
3. మానవ శరీరంలోని అంతర్గత అవయవాల్లో పెద్దది?
ఎ) కాలేయం బి) చర్మం
సి) గుండె డి) పీయూష గ్రంథి
4. మానవ దేహంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) మూత్రపిండాలు బి) ప్లీహం
సి) క్లోమం డి) కాలేయం
5. మానవ శరీరంలో పొడవైన ఎముక ఏది?
ఎ) స్టెపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్
6. మానవ శరీరంలోని చిన్న ఎముక ఏది?
ఎ) స్టపిస్ బి) ఫిమర్ సి) టిబియ డి) టార్సస్
7. వయోజన మానవునిలో ఉండే మొత్తం ఎముకలెన్ని?
ఎ) 180 బి) 306 సి) 156 డి) 206
8. మానవునిలో ఉండే పక్కటెముకల సంఖ్య?
ఎ) 33 బి) 26 సి) 12 జతలు డి) 14
9. వయోజన మానవుని వెన్నుముకలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 33 బి) 26 సి) 22 డి) 14
10. మానవుని కపాలంలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 22 బి) 14 సి) 8 డి) 18
11. మానవుని పుర్రెలో ఎన్ని ఎముకలుంటాయి?
ఎ) 14 బి) 8 సి) 22 డి) 26
12. మానవుని ముఖ భాగంలో ఉండే ఎముకలు ఎన్ని?
ఎ) 14 బి) 22 సి) 8 డి) 30
13. మానవ శరీరంలోని థర్మోస్టాట్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైమస్ బి) కాలేయం
సి) హైపోథాలమస్ డి) ప్లీహం
14. మానవ శరీరంలో రక్తనిధి అని దేన్ని పిలుస్తారు?
ఎ) కాలేయం బి) ప్లీహం సి) గుండె డి) ఎముక
15. ఎర్రరక్త కణాల శ్మశానవాటిక అని దేన్ని అంటారు?
ఎ) ఎముక బి) గుండె సి) కాలేయం డి) ప్లీహం
16. మెదడులోని ఏ భాగాన్ని ఆల్కహాల్ ప్రభావితం చేస్తుంది?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్
17. జ్ఞాపకశక్తిని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) మస్తిష్కం బి) అనుమస్తిష్కం
సి) ద్వారగోర్థం డి) హైపోథాలమస్
18. కోపాన్ని నియంత్రించే మెదడులోని భాగం?
ఎ) ద్వారగోర్థం బి) హైపోథాలమస్
సి) అనుమస్తిష్కం డి) మస్తిష్కం
19. మెదడులోని ఏ భాగాన్ని అనుమస్తిష్కం అని అంటారు?
ఎ) ముందు భాగం బి) మధ్య భాగం
సి) వెనుక భాగం డి) హైపోథాలమస్
19. పోరాట, పలాయన హార్మోన్ అని దేన్ని పిలుస్తారు?
ఎ) థైరాక్సిన్ బి) ఎపినెఫ్రిన్
సి) పారాథైరాక్సిన్ డి) ఇన్సులిన్
21. మాస్టర్ గ్రంథి అని దేన్ని పిలుస్తారు?
ఎ) పీయూష గ్రంథి బి) అవటు గ్రంథి
సి) క్లోమ గ్రంథి డి) అధివృక్క గ్రంథి




ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం - బయాలజీ

22. ఆడమ్స్ ఆపిల్ గ్రంథి అని దేన్ని పిలుస్తారు?
ఎ) అవటు గ్రంథి(థైరాయిడ్) బి) పీయూష గ్రంథి
సి) అధివృక్క గ్రంథి డి) క్లోమం
23. కింది వాటిలో మిశ్రమ గ్రంథి ఏది?
ఎ) క్లోమం బి) కాలేయం సి) థైమస్ డి) పైవన్నీ
24. మూత్రపిండాలపై ఉండే గ్రంథి?
ఎ) థైమస్ బి) క్లోమం
సి) అధివృక్క గ్రంథి డి) అవటు గ్రంథి
25. ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవించే గ్రంథి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) ప్లీహం డి) పీయూష గ్రంథి
26. మరుగుజ్జుల్లో తక్కువగా ఉండే హార్మోన్ ఏది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) పెరుగుదల హార్మోన్ డి) పైవన్నీ
27. 'క్రెటినిజం' వ్యాధి ఉన్న పిల్లల్లో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) థైరాక్సిన్ బి) ఇన్సులిన్
సి) వాసోప్రెసిన్ డి) ఎపినెఫ్రిన్
28. ప్రసవ సమయంలో ఉత్పత్తి అయ్యే హార్మోన్ ఏది?
ఎ) ఆక్సిటోసిన్ బి) ప్రొజెస్టిరాన్
సి) ప్రోలాక్టిన్ డి) ఈస్ట్రోజన్
29. రక్తంలో ఉండే పాస్ఫేట్ల స్థాయిని నియంత్రించే గ్రంథి?
ఎ) అవటు గ్రంథి బి) పార్శ్వ అవటు గ్రంథి
సి) పీయూష గ్రంథి డి) క్లోమ గ్రంథి
30. ఉరఃకుహరంలో ఉండే గ్రంథి?
ఎ) థైమస్ బి) పీయూష గ్రంథి
సి) అవటు గ్రంథి డి) ఏదీకాదు
31. పేస్ మేకర్ ఏ అవయవానికి సంబంధించింది?
ఎ) గుండె బి) మూత్రపిండం
సి) కాలేయం డి) మెదడు
32. లింఫోసైట్ కణాలను ఉత్పత్తి చేసే గ్రంథి?
ఎ) క్లోమం బి) కాలేయం
సి) థైమస్ డి) జఠర గ్రంథి
33. లాలాజల గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) టైలిన్
34. జఠర గ్రంథులు స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) పెప్సిన్ సి) లైపేజ్ డి) అమైలేజ్
35. ఎంజైములు, హార్మోన్‌లను ఉత్పత్తి చేసే గ్రంథి?
ఎ) పీయూష గ్రంథి బి) కాలేయం
సి) క్లోమం డి) జఠర గ్రంథి
36. క్లోమ గ్రంథి స్రవించే ఎంజైమ్ ఏది?
ఎ) ట్రిప్సిన్ బి) లైపేజ్ సి) అమైలేజ్ డి) పైవన్నీ
37. డయాబెటిస్ ఇన్ సిపిడస్ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ తక్కువగా ఉంటుంది?
ఎ) ఇన్సులిన్ బి) థైరాక్సిన్
సి) వాసోప్రెసిన్ డి) గ్లూకగాన్
38. టిటనీ వ్యాధి ఉన్నవారిలో ఏ హార్మోన్ లోపిస్తుంది?
ఎ) పారాథైరాక్సిన్ బి) థైరాక్సిన్
సి) ప్రోలాక్టిన్ డి) ఇన్సులిన్
39. మెదడులోని ఏ భాగాన్ని చిన్న మెదడు అని అంటారు?
ఎ) మస్తిష్కం
బి) అనుమస్తిష్కం
సి) హైపోథాలమస్
డి) ద్వారగోర్థం



40. వ్యాధికారక బ్యాక్టీరియాను చంపే రక్తకణాలు?
ఎ) రక్త ఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) తెల్లరక్త కణాలు డి) పైవన్నీ
41. వయోజన మానవుని శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 18 సి) 72 డి) 10
42. మెదడు : మెనింజెస్ :: ఊపిరితిత్తులు : ....
ఎ) వాయుగోణులు బి) క్షయ
సి) ప్లూరా డి) వృక్కాలు
43. హిమోసైటోమీటర్‌ను దేని కోసం ఉపయోగిస్తారు?
ఎ) రక్త పీడనం కొలిచేందుకు
బి) రక్తకణాలను లెక్కించేందుకు
సి) రక్తాన్ని శుద్ధి చేయడం కోసం
డి) గుండె పనితీరు తెలుసుకోవడం కోసం
44. ఎర్రరక్త కణం సగటు జీవితకాలం ఎన్ని రోజులు?
ఎ) 180 బి) 90 సి) 120 డి) 13
45. మానవునిలో ఉండే జ్ఞానదంతాలు ఎన్ని?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6
46. కింది ఏ జంతువులో రధనికలు క్షీణించి ఉంటాయి?
ఎ) పులి బి) గేదె సి) కుక్క డి) ఏదీకాదు
47. మానవ శరీరంలోని అతిచిన్న కణం?
ఎ) అండం బి) నాడీకణం
సి) ఎర్రరక్తకణం డి) శుక్రకణం
48. ఏ అవయవం పనిచేయనప్పుడు డయాలసిస్ చేస్తారు?
ఎ) గుండె బి) ఊపిరితిత్తులు
సి) మూత్రపిండాలు డి) కాలేయం
49. పైత్య రసాన్ని స్రవించే గ్రంథి ఏది?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) థైమస్ డి) ప్లీహం



50. కింది వాటిలో జ్ఞానేంద్రియం కానిది?
ఎ) చర్మం బి) కన్ను సి) నాలుక డి) ఉండుకం
51. ఫారన్ హీట్ డిగ్రీల్లో మానవుని సాధారణ ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 37 బి) 72 సి) 98.4 డి) 104
52. ఎలర్జీ ఉన్న వ్యక్తి రక్తంలో ఏ కణాలు పెరుగుతాయి?
ఎ) రక్తఫలకికలు బి) ఎర్రరక్త కణాలు
సి) ఇసినోఫిల్స్ డి) లింఫోసైట్లు
53. ఆరోగ్యవంతుడైన మానవుని నాడీ పీడనం ఎంత?
ఎ) 72 బి) 120 సి) 40 డి) 18
54. బ్లడ్ బ్యాంకుల్లో రక్తాన్ని నిల్వ చేసేందుకు రక్తంలో కలిపే పదార్థం?
ఎ) సోడియం క్లోరైడ్ బి) సోడియం సిట్రేట్
సి) అమ్మోనియం క్లోరైడ్ డి) పైవన్నీ
55. మానవ గర్భావధి కాలం?
ఎ) 360 రోజులు బి) 270 రోజులు
సి) 180 రోజులు డి) 240 రోజులు

సమాధానాలు

		17) ఎ	27) ఎ	37) సి	47) డి
		18) ఎ	28) ఎ	38) ఎ	48) సి
1) సి	9) బి	19) సి	29) బి	39) బి	49) ఎ
2) బి	10) సి	20) బి	30) ఎ	40) సి	50)డి
3) ఎ	11) సి	21) ఎ	31) ఎ	41) బి	51) సి
4) డి	12) ఎ	22) ఎ	32) సి	42) సి	52) సి
5) బి	13) సి	23) ఎ	33) డి	43) బి	53) సి
6) ఎ	14) బి	24) సి	34) బి	44) సి	54) బి
7) డి	15) డి	25) ఎ	35) సి	45) ఎ	55) బి
8) సి	16) డి	26) సి	36) డి	46) బి	

JOBS ఉద్యోగాలు

పిజెటిఎస్ఎయు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎస్సీ& ఎస్టీ బ్యాక్‌లాగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 18
విభాగాలవారీ ఖాళీలు: అగ్రికల్చర్ 10, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ 5, హోం సైన్స్ 3
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 21
వెబ్‌సైట్: www.pjtsau.ac.in

ఐటిబిపి

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటిబిపి)- **సబ్ ఇన్‌స్పెక్టర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21 (మహిళలకు 3, పురుషులకు 18)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 22
వెబ్‌సైట్: www.recruitment.iitbpolice.nic.in
www.itbpolice.nic.in

వివిఎస్‌ఎస్‌సి

ఇస్రో ఆధ్వర్యంలోని విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (వివిఎస్‌ఎస్‌సి)- **టెక్నీషియన్ అప్రెంటిస్‌**ల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
మొత్తం ఖాళీలు: 158
విభాగాలవారీ ఖాళీలు: ఆటొమొబైల్ 8, కెమికల్ 25, సివిల్ 8, కంప్యూటర్ సైన్స్ 15, ఎలక్ట్రికల్ 10, ఎలక్ట్రానిక్స్ 40, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ 6, మెకానికల్ 46
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. అయితే 2015 ఏప్రిల్ తరవాత డిప్లొమా పూర్తిచేసినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. శాండ్‌విచ్ డిప్లొమాస్/ ప్రైవేట్ డిప్లొమాస్/ షార్ట్ టర్మ్ కోర్సులు/ సర్టిఫికెట్ కోర్సులను పరిగణనలోకి తీసుకోరు.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 30 ఏళ్లు మించరాదు
స్టయిపెండ్: నెలకు రూ.3542
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **ఇంటర్వ్యూ:** ఆగస్టు 19
వేదిక: Govt.polytechnic College, kalamassery, Ernakulam District, Kerala
ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా www.mhrdnats.gov.in/ www.sdcentre.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి.
వెబ్‌సైట్: http://www.vssc.gov.in/VSSC V4/images/

కొచ్చిన్ షిప్‌యార్డ్

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ **ఖాళీలు:** 72
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 12, మెకానికల్ 27, ఎలక్ట్రానిక్స్ 6, సివిల్ 12, కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి 8, సేఫ్టీ 3, మెరైన్ 2, నేవల్ ఆర్కిటెక్చర్ & షిప్ బిల్డింగ్ 2
అర్హత: సంబంధిత విభాగంలో బిఇ/ బిటెక్ పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.8,000
టెక్నీషియన్ అప్రెంటిస్ **ఖాళీలు:** 100
విభాగాలవారీ ఖాళీలు: ఎలక్ట్రికల్ 22, మెకానికల్ 28, ఎలక్ట్రానిక్స్ 8, ఇన్‌స్ట్రుమెంటేషన్ 7, సివిల్ 9, కంప్యూటర్ 6, కమర్షియల్ ప్రాక్టీస్ 20
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
స్టయిపెండ్: నెలకు రూ.7,000
ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.cochinshipyard.com/ career/ Notification

ముదినేపల్లె పాఠశాలలో తిథి భోజనం



ఓబులవారిపల్లె : మండలంలోని ముదినేపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏపీ ట్రాన్స్ కో ఉద్యోగి సురేష్ దంపతులు వారి వివాహ రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం మధ్యాహ్నం తిథి భోజనం ఏర్పాటు చేశారని పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు శశిధర్‌మౌళిరాజు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడి అనుమతితో పాఠశాలలోని 50మంది విద్యార్థినీ, విద్యార్థులతో పాటు అధ్యాపకులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పథంలో చెన్నయ్యగారిపల్లె

● స్వగ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించిన ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, మేడా కుటుంబీకులు

రాజంపేట

ఎర్రజెరువుపల్లె గ్రామ పంచాయతీలోని చెన్నయ్య గారిపల్లె అంటే ఎవ్వరికీ తెలియని ఓ కుగ్రామం. నంద లూరు మండల కేంద్రానికి సుమారు 15కిలో మీటర్ల దూరంలో మారుమూల ప్రాంతంలో దిక్కూదివానం లేని గ్రామంగా బిక్కుబిక్కు మంటూ ఉండేది. అయితే ఆ గ్రామానికి చెందిన మేడా వెంకటమల్లికార్జునరెడ్డి ఎమ్మె ల్యేగా గెలుపొందడం, ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీక రించడం, ఆయన పిన్నమ్మ మేడా పద్మజ మండలాధ్యక్షు రాలిగా బాధ్యతలు స్వీకరించడం, ఆమె భర్త ఎమ్మెల్యే చిన్నాన్న మేడా విజయభాస్కర్‌రెడ్డి సింగిల్‌విండో అధ్యక్షు లు కావడంతో స్వగ్రామం అభివృద్ధి పథంలో దూసుకు పోతోంది. ఎమ్మెల్యే మేడా ఆయన కుటుంబీకులు తమ మేడా ట్రస్ట్ ద్వారా గ్రామంలో అనేక ఆలయాలను నిర్మిం చారు. ప్రధానంగా శివాలయం, కాశీనాయన , అయ్యప్ప స్వామి, రామాలయం ఇలా ఎన్నో ఆలయాలను సుమారు కోటి రూపాయల పైబడి ఖర్చు చేసి నిర్మించడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కన్న తల్లి కన్నా స్వగ్రామమే మిన్న అన్న చందంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తీసుకుపోతున్నారు. వారి కుటుంబంలో ప్రధాన ఆర్థిక వనరులైన మేడా కన్‌స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథరెడ్డి గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఇలా కుటుంబీకులందరూ గ్రామ అభివృద్ధిపై దృష్టిసారించడంతో ఎమ్మెల్యే, ప్రభుత్వ నిధు లతో ఏకంగా ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలు, కోటి రూపాయల పైబడి ఖర్చుతో సిమెంటు రోడ్ల ఏర్పా టు చేశారు. గ్రామపరిధిలో చెన్నయ్యగారిపల్లె వారి స్వగ్రామం. ఈ గ్రామంలో జరగని అభివృద్ధి అంటూ లేదు. ఏకంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటి శుద్ధిప్లాంట్ ను ఏర్పాటు చేసి గ్రామప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. గ్రామపరిధిలో మొత్తం 2712మంది జనాభా ఉండగా 1800మంది ఓటర్లు ఉన్నారు. ఎస్సీలు 360మంది, ఎస్టీలు 21మంది మిగిలిన అన్ని వర్గాల వారు 329మంది ఉన్నారు. 2015-16సంవత్సరంలో సుమారు 26లక్షల పైబడి ఖర్చుతో సిమెంటు రోడ్లు వేయించారు. అనేక పాఠశాల భవనాలను నిర్మించారు. 2014-15వ సంవత్సరంలో గ్రామపరిధిలో పూర్తి తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. నీరు-చెట్టు పథకం కింద రూ.30లక్షల ఖర్చుతో సాగునీటి పథకాలను అభివృద్ధి చేశారు. ఈదర పల్లె, ఎర్రజెరువుపల్లె మార్గంలో సుమారు 1.50కోట్ల రూపాయల ఖర్చుతో బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు.



ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మేడా స్వగ్రామం చెన్నయ్యగారిపల్లె



గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటిశుద్ధిప్లాంట్



మేడా ట్రస్ట్ ద్వారా నిర్మించిన అయ్యప్పదేవాలయం



గ్రామంలో పూర్తైన సిమెంటు రోడ్లు

రుణాలకోసం 586 మంది దరఖాస్తుదారులు హాజరు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రైల్వేకోడూరురూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వ హించిన రుణదరఖాస్తు దారుల ఇంటర్వ్యూ లకు 1600 దరఖాస్తులకు గాను 586 మం ది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీవో సంజీ వరావుతెలిపారు. ఇంటర్వ్యూలకు అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 185 మంది, బీసీ రుణాలకు 109మంది, మైనారిటీ కార్పొరే షన్ రుణాలకు 57మంది, కాపుకార్పొరేషన్ రుణాలకు 188 మంది, ఎస్టీ రుణాలకు 47 వంది హాజరైనట్లు ఆయన తెలిపారు. కార్య క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధి నాగ బూషణం, ఎస్టీ కార్పొరేషన్ ప్రతినిధి వెంక టసుబ్బయ్య స్థానిక బ్యాంకర్లు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సభలు

రైల్వేకోడూరు రూరల్ : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు నిర్వ హిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ మోహన్ కృష్ణ తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమానికి రైల్వేకోడూరు తూర్పు రెవెన్యూ పంచాయతీ గ్రామాలైన రైల్వేకోడూరు, రెడ్డివారిపల్లె, మైసూరువారిపల్లె రైతులు వారి పరిధిలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు హాజరయ్యారు. కానీ సరైన ప్రచారం లేక రైతులకు గ్రామసభకు చాలా మంది రైతులు హాజరు కాలేకపోయామని వాపోయారు. అధికారులు సాయంత్రం 5గంటల వరకు ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారం కోసం రైతులు రాకపోవడం శోచనీయం.

కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరాము లు, స్థానిక సర్పంచ్ తిప్పన కృష్ణయ్య, ఉప సర్పంచ్ నాట్యాల హేమరాజు, మైసూరు వారిపల్లె సర్పంచ్ దివిటి మోహన్, వీఆర్వోలు ఈశ్వరయ్య, బుజంగరావు, హరిప్రసాద్, ప్రవీణ్, శివ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

62మందికి ఎంఆర్ టీకాలు



జాగువారిపల్లెలో టీకాలు వేయించిన చిన్నారులతో ప్రధానోపాధ్యాయులు

పుల్లంపేట : మండల పరిధిలోని జాగువారి పల్లె ప్రాథమిక పాఠశాలలోని 62మంది విద్యార్థులకు శుక్రవారం ఎంఆర్ టీకాను వేసినట్లు ప్రధానోపాధ్యాయులు సాంబశివ రావు తెలిపారు. గ్రామంలోని పిల్లలకు కూడా ఈ టీకాలు వేయడం వల్ల భవిష్య త్తులో తట్టు, రూబెల్లా, ఇమ్మోని యా, అతి సారా తదితర వ్యాధులే కాకుండా పుట్టుకతో వచ్చు అన్ని లోపాలను నివారించ వచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించి పిల్లలకు టీకాలు వేయిం చాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శాంతకుమారి, శ్రీదేవి, ఆశావర్కర్ వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన సాజిద్



సాజిద్

రైల్వేకోడూరు రూరల్ : పట్టణంలోని ఏఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న సి.పకీరయ్య కుమారుడు సి.సాజిద్ స్టేట్ నీట్‌లో 3502వ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. 10వ తరగతిలో 9.8జీపీఏ సాధించి ఇంటర్మీడియట్‌లో 976మార్కులు సాధించిన సాజిద్ నీట్‌లో 3502ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు సంపాదించాడన్నారు. ఏఎస్‌డబ్ల్యూవో పకీరయ్య కుటుంబంలో మొదటి కుమారుడు సుహైల్ గత ఏడాదిలో ఎంబీబీఎస్ సీటు సాధించి అమలాపురం సిమ్స్‌లో వైద్య విద్యను చదువుతున్నాడన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు కొడుకులు ఎంబీబీఎస్ సాధించడంతో పకీరయ్యను స్థానికులు అభినందనలతో ముంచెత్తారు. మరో కొడు కు కూడా సీఏ సీటు సాధించి ఉన్నత చదువులు చదవడంతో ఆ కుటుంబంలో ముగ్గురు కుమారులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు.


సబ్సిడీ రుణాల ఎంపికకు 300మంది హాజరు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : సబ్సిడీ ఋణాల కోసం శుక్రవారం ఓబులవారిపల్లె మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 300మంది హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతా లలోని యువతీ, యువకులకు వివిధ రకాల స్కీములకు సబ్సిడీతో బ్యాంకు ద్వారా రుణా లు ఇచ్చేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనా రిటీ కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూ లకు హాజరుకాగా మండలంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు మేనేజర్లు, మండల కమిటీ అధ్యక్షుడు ఎంపీపీ వెంకటేశ్వ రరాజు, ఎంపీడీవో వెంకటసుబ్బయ్య, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీదేవి పూజ



పుల్లంపేట : పుల్లంపేటలోని సాయిబాబాదేవాలయంలో శ్రావణమాస మూడవ శుక్రవారం పురస్కరించుకొని లక్ష్మీదేవికి సహస్ర నామ కుంకుమార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుల్లంపేటలోని మహిళలు లక్ష్మీదేవి పటం, కుంకుమ, పసుపు, టెంకాయలు తీసుకువచ్చి కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఉపాధి పనులు గ్రామసభల్లో ప్రతిపాదించాలి

చిట్వేలి : సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఉపాది హామీ పథకం పనులను ప్రతిపాదించాలని ఉపాధి హామీ పథకం రాష్ట్ర కమిటీ సభ్యుడు పీరయ్య ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీరయ్య మాట్లాడుతూ పంట సంజీవిని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పారంఫాండ్స్‌లకు తప్పనిసరిగా రివిట్‌మెంట్ కొట్టాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పథకంపై పూర్తి అవగాహన కలిగి ఉండి బాధ్యతతో పనిచేయాలన్నారు. ఏపీడీ వరప్రసాద్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు జవాబు దారితనంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో మస్తాన్‌వల్లీ మాట్లాడుతూ పనుల అంచనాలను తప్పనిసరిగా సర్పంచ్‌లకు తెలియజేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పీరయ్య

మండలంలోని చెర్లోపల్లె, ఉపాధి పథకం ద్వారా జరుగుతున్న పారంఫాండ్లను వర్మీకంపోస్ట్ యూనిట్లను అలాగే తుమ్మకొండలో జరుగుతున్న కాంటూరు కందకాలను పీరయ్య పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, చెంగల్‌రాయుడు, నాగేశ్వరయ్య, చెన్నకేశవులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వివాదాస్పద వైన్ షాపుల పరిశీలన

రైల్వేకోడూరు రూరల్ : పట్టణంలోని ఆర్‌ఎస్‌రోడ్‌లో షిరిడిసాయి జూనియర్ కళాశాల, ఆదర్శ హైస్కూల్ సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం షాపులను శుక్కవారం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెండెంట్ స్వాతి పరిశీలించారు. విద్యాలయాలకు సమీపంలో ఉన్నాయని విద్యార్థులరారపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు అందడంతో వివాదాస్పద మద్యం దుకాణాలను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెండెంట్ స్వాతి మాట్లాడుతూ మద్యం దుకాణాల ఏర్పాటు ఎక్సైజ్ నియమ నిబంధనలకుఅను గుణంగానే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యాసంస్థలకు 100 మీటర్లు పరిధిలో ఏర్పాటు చేయకూడదని అయితే సంధ్యా, గంగాభవాని మద్యం షాపులు 100 పైబడి దూరంలో ఉన్నాయన్నారు. ఈవిషయాన్ని న్యాయస్థానాలకు, ఉన్నతాధికారులకు విన్నవించనున్నట్లు ఆమె తెలిపారు. మద్యం దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయించినా 21 సంవత్సరంలోబడిన యువకులకు మద్యం విక్రయించినా చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ఉదయం 10 గంటలనుంచి రాత్రి 10 గంటలవరకే దుకాణాలు తెరవాలని నిభందనలు అతిక్రమిస్తే చర్యలు తప్పని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించి అధికధరలకు మద్యం విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా స్థానిక ఎక్సైజ్ సీఐకు ఫిర్యాదు చేయాలని చూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శివసాగర్ పాల్గొన్నారు.



వివాదాస్పద మద్యం షాపులపై విచారిస్తున్న జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెండెంట్

16న ట్రాన్స్‌పోర్ట్ లైసెన్సులు ఇస్తాం

-రాజంపేట ఎంవీఐ ఎన్.వి.రాజాబాబు

రాజంపేట : ఆటో రవాణా లైసెన్సు ఉండి చదువుకు సంబందించిన సర్టిఫికెట్ లేకపోయినా వారికి ఈ నెల 16వ తేదీన 9గంటలకు ట్రాన్స్‌పోర్ట్ లైసెన్సు రాజంపేట ఎంవీఐ కార్యాలయం వద్ద ఇస్తామని ఎంవీఐ ఎన్.వి.రాజాబాబు తెలిపారు. ఆటో నడుపువారు ఆటో లైసెన్సు(నాన్ ట్రాన్స్‌పోర్ట్) ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ సివిల్ సర్జన్ మెడికల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఒరిజినల్ లైసెన్సు, జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని, అందుకు 260రూపాయలు రుసుము చెల్లించాలని అన్నారు. అనంతరం ఆటో యూనియన్ నాయకులకు అందుకు సంబందించిన వివరాలను అందించారు.

ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

రాజంపేట టౌన్ : పిల్లలకు తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని రాజంపేట మెడికల్ అధికారి డాక్టర్ సానె శేఖర్ అన్నారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని కాకతీయ విద్యాసంస్థల శ్రీ చక్ర స్కూల్‌లో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వైద్యసిబ్బందితో వేయించారు. =డాక్టర్‌లు శివకుమార్, వైద్యసిబ్బంది జి.వి.రాజమ్మ, ఏఎన్‌ఎంలు, కాకతీయ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : తట్టు, రూబెల్లా వ్యాధులను అరికట్టేందుకు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని అడపూరు సర్పంచ్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అడపూరు గ్రామంలోని శ్రీ సాయి విద్యానికేతిన్ పాఠశాలలో డాక్టర్ వెంకట చంద్రారెడ్డి విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. పాఠశాల కరస్పాండెంట్ సరస్వతి, సీహెచ్‌వో పిల్లిపిచ్చయ్య, హెల్త్ సూపర్ వైజర్ జయరామయ్య పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పేరుతో వేధిస్తున్న బ్యాంక్ అధికారులు

నందలూరు : స్టేట్ బ్యాంకు ఖాతాను ప్రారంభిస్తున్న లబ్ధిదారులపై ఇన్సూరెన్స్ ఖచ్చితంగా చేయాలని బ్యాంకు అధికారులు ఖాతాదారులను వేదిస్తున్నారని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు. నందలూరు స్టేట్ బ్యాంకు నందు పొదుపు ఖాతాను ప్రారంభించేందుకు వచ్చిన ప్రజలపై ముఖ్యంలగా స్కాలర్‌షిప్‌ల కోసం పొదుపు ఖాతాలను ప్రారంభిస్తున్న విద్యార్థులపై ఇన్సూరెన్స్ భారాన్ని అధికారులు మోపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలువచ్చాయని కుంటిసాకులు చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు ఖాతాదారులపై భారాన్ని తగ్గించి ప్రజలకు సహకరించాలని కోరుకుంటున్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోండి

పుల్లంపేట : గ్రామసభల ద్వారా రెవెన్యూ సమస్యలను పరిష్కరించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గౌరీశంకర్ సూచించారు. శుక్రవారం గారాలమడుగు, టి.వి.ఎన్.ఆర్.పురం గ్రామాలలో రెవెన్యూ గ్రామసభ లు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీ రూపంలో రెవెన్యూ సమస్యలు ఇస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ సమస్యలు, ఈ పాసుపుస్తకాల కొరకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ పం ట పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మురళీ, సర్వేయర్ చిట్టిబాబు, తెలుగుదేశం నాయకులు పోలి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : రైతులకు సంబందించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం 11మంది రైతులు తమ భూ సమస్యల గురించి గ్రామసభలో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అర్చన, వీఆర్వో ఫరాస్‌బాబు, సర్వేయర్ రామ్మోహన్ రైతులు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తహశీల్దార్ దార్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సర్వే, సబ్‌డివిజన్ నెంబర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కానందున వాటి నమోదు కొరకు తగు చర్యలు తీసుకొంటామన్నారు.

కొత్తకుంటకు గండి



వీరబల్లి: మండలంలోని పెదవీడు పం చాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో వున్న కొత్తకుంటకు అధికంగా వర్షపు నీరు చేరడంతో చెరువు పూర్తి స్థాయిలో నిండి శుక్రవారం తెల్లవారు జామున గండి పడింది. దీంతో చెరువులోని మూడు భాగాల నీరు ఏటి పాలు అయ్యాయి. పది సంవత్సరాల తరువాత చెరువు నిండిందని సంతోషపడ్డ రైతులకు నిరాశ మిగిలింది. ఈ విషయాన్ని వెంటనే ఇరిగేషన్ డీఈ రంగయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఈ, ఏఈ సుబ్బారెడ్డిని ఆదేశించడంతో ఆయన చెరువు వద్దకు చేరుకొని పరిశీలించి మరమ్మతు పనులను ప్రారంభించారు. ఇకపై వర్షం కురిసిన చెరువుకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి నాగముణి రెడ్డి, బసిరెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీని రౌడీ ప్రదేశ్ చేయడమే జగన్ లక్ష్యమా..!

రాజంపేట టౌన్ : ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిషలు శ్రమిస్తూ ఉంటే ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డి ఏపీని రౌడీ ఆంధ్రప్రదేశ్‌గా చేయడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నాడని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ఆరోపించారు. శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులతో కలిసి మాట్లాడుతూ నంద్యాలలో సీఎంను తుపాకీతో కాల్చి చంపాలంటూ.. నిన్న రోడ్‌షోలో ఉరిశిక్ష వేయాలంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు జగన్ రౌడీయిజానికి నిదర్శనమన్నారు. జగన్ ఎన్ని కుప్పిగంతులు వేసినా నంద్యాలలో టీడీపీదే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పోలి శివకృష్ణ, శ్యామ్, నాగరాజు, సునీల్, కనకయ్య,పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

రుణాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన

నందలూరు : మండలంలోని నిరుద్యోగ యువతకు శుక్రవారం నిర్వహించిన సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మండలంలోని ముస్లిం మైనారిటీ, కాపు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎస్‌బిఐ, కెనరా, సిండికేట్, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముస్లిం మైనారిటీలు 38, కాపులు 89, ఎస్సీలు 70, బీసీలు 62, ఎస్టీలు 10మంది మొత్తం 269ఇంటర్వ్యూలకు హాజరు అయినట్లు ఎంపీడీవో మల్లీశ్వరి తెలిపారు. అర్హులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, జడ్పీటీసీ శివరామరాజు, సర్పంచ్ సమెమ్మ శివప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు, కెనరా, ఎస్‌బిఐ, ఏపీజీబీ, సిండికేట్ బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. చిట్‌ఫండ్‌లు, పొదుపు పథకాలు లాభిస్తాయి. చిన్నారుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. సంకల్పం నెరవేరుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరుతారు. వేడుకలు, బృందకార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారు కీలక పదువులు అందుకుంటారు. కీలక పత్రాలు అందుకుంటారు.

మిథునరాశి: (మే21-జూన్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. సమావేశాలు, చర్చలు ఫలిస్తాయి. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రముఖుల్ని కలుసుకుంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. లక్ష్యం నెరవేరుతుంది.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): కొత్త వ్యూహాలు అమలు చేసి సత్ఫలితాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రవాణా రంగాల వారికి అనుకూలం. నూతన ప్రాజెక్టులను విజయవంతంగా చేపడతారు. మనసు ఉల్లాసంగా ఉంటుంది.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సంస్మరణలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటారు. పూర్వ మిత్రులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. యోగ, ధ్యానాలపై దృష్టి పెడతారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆస్పత్రులు, ఫార్మా, రెస్టారెంట్లు, రిక్రియేషన్ రంగాల వారు పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి ప్రోత్సాహకరం. విందు వినోదాల్లో ఉల్లాసంగా పాల్గొంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రియతములకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. బంధుమిత్రులతో సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): గృహావసరాల కోసం అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక విషయాల్లో కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకర సమయం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రుల కలయిక ఆనందం కలిస్తుంది. జనసంబంధాలు విస్తరిస్తాయి. స్టేషనరీ, ప్రింటింగ్, కమ్యూనికేషన్ల రంగాల వారికి శుభప్రదం. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అనుకూలం. సహోద్యోగుల ఆర్థిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, చిట్‌ఫండ్‌లలో పనిచేసే వారికి ప్రోత్సాహకరం

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సహకార సొసైటీలు రైతు శ్రేయస్సుకు పాటుపడాలి

మార్క్‌ఫెడ్ ద్వారా తక్కువ ధరలకు ఎరువులు ● జేడీఏ ఠాగూర్ నాయక్

కడప, ఐటిఐ సర్కిల్ : రైతుల శ్రేయస్సు కోసం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు పాటుపడాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు ఠాగూర్‌నాయక్ పేర్కొన్నారు. నగరంలోని డీసీసీ బ్యాంక్‌లో ఉన్న సభాభవనంలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలలో పనిచేస్తున్న సీఈఓలకు మార్క్‌ఫెడ్ డీఎం అధ్యక్షతన సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేడీఏ ఠాగూర్ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల శ్రేయస్సు లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘాలు జిల్లాలో 69 ఉన్నాయన్నారు. వీటి ద్వారా ఆయా సీజన్లలో రైతులు సాగుచేసి పంటలకు అవసరమైన నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు జిల్లా వ్యవసాయశాఖ ద్వారా మంజూరుచేసే ఎరువులను రైతులకు అందించే బాధ్యతలు కూడా సంఘాలకు అప్పచెప్పడం జరిగిందన్నారు. అయితే జిల్లాలో 10 సంఘాలు మాత్రమే రైతులకోసం పనిచేస్తున్నాయన్నారు. మిగిలిన సంఘాలు ఉనికే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను అందించడం జరుగుతుందన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం లూద్రారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఏపీ మార్క్‌ఫెడ్ కృషి చేస్తుందన్నారు. బయట మార్కెట్‌లో ఎరువులు అధిక ధరలకు లభిస్తున్నాయన్నారు. రైతులకు తక్కువ ధరలకే ఎరువులను అందించాలనే లక్ష్యంతో ఏపీ మార్క్‌ఫెడ్ పనిచేస్తోందన్నారు. డీలర్లకు రవాణ ఉచితంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీసీఓ పోమేనాయక్, డీసీసీ బ్యాంక్ సీఈఓ వెంకటరత్నం, జిల్లావ్యసాయశాఖ ఎరువుల విజిలెన్స్ అధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఠాగూర్‌నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం లూద్రారెడ్డి తదితరులు

జడ్పీలో దొంగలు పడ్డారు... కథనంపై కదలిక



విద్యుత్ మోటారు వైరును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కడప రూరల్: జడ్పీలో దొంగలు పడ్డారు అన్న శీర్శికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై జడ్పీ అధికారులలో కదలిక వచ్చింది. డిప్యూటీ సీఈవో సయ్యద్ ఖాదర్‌బాషా శుక్రవారం ఉదయం 10 గంటలకే తమ చాంబర్‌కు చేరుకున్నారు. జడ్పీలో దొంగలు పడ్డ విషయంపై ఆరాతీశారు. సంబంధిత వాచ్‌మెన్‌ను, అటెండర్లను, ఎలక్ట్రికల్ విభాగం వారి పనితీరుపై మండిపడ్డారు. జడ్పీలో దొంగలు పడి 50 మీటర్ల విద్యుత్ వైరును, ఇతర పరికరాలను దోచుకెళ్లడంపై నైట్ వాచ్‌మెన్ అసమర్థత విధులే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అటెండర్లకు విధులను కేటాయించారు. అనంతరం విద్యుత్ వైరున మోటారుకు అమర్చి నీటిని సరఫరా చేయించారు.

పర్మనెంట్ నైట్ వాచ్‌మెన్ పోస్టు భర్తీకి ప్రభుత్వానికి సిఫార్సు...

నాలుగు రోజుల క్రితం జడ్పీలో దొంగలు పడి కార్యాలయ ఆవరణలోని విద్యుత్ మోటారు వైరును దొంగలించారు. ఈ నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ గూడూరు రవి కలెక్టర్‌ను కలిసి జడ్పీకి పర్మనెంట్ వాచ్‌మెన్ పోస్టు మంజూరు కోరతూ రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు సమాచారం.

కరువును ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుండాలి

కడప, కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయశాఖ అనుబంధ అధికారుల ద్వారా కంటింజెంట్ ద్వారా సిద్ధంగా వుండాలని రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం శుక్రవారం సాయంత్రం రాజధాని నుంచి జిల్లా కలెక్టర్లతో కరువు పరిస్థితులను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ అనుబంధ శాఖ అధికారుల ద్వారా కంటింజెంట్‌ప్లాన్ సిద్ధం చేశామని ఆరు నెలల్లో కురిసిన వర్షపాతం మేరకు పంటలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎర్రనేలలో ప్రత్యామ్నా పంటలు వేసుకున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు క్వింటాలుకు రూ.200లు అందిస్తామన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ జేడీలు ఠాగూర్‌నాయక్, జయకుమార్ సీపీవో తిప్పేస్వామి, డ్వామా పీడీ విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ సంజీవరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఏపీఎం ఐపీపీడీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రనేలల్లో పత్తికి బదులు ఇతర పంటలు సాగుచేయాలి

కడప, ఐటీఐసర్కిల్ : ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని రైతులు ఎర్రనేలల్లో సాగుచేసే పత్తిపంటకు బదులుగా కంది, కొర్ర పంటలతో పాటు మిగిలిన పప్పుధాన్య పంటలను వేసుకోవాలని కలెక్టర్ బాబూ రావునాయుడు రైతులకు సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ ద్వారా ఇన్‌స్టంట్‌గా సస్యరక్షణ మందులను ఇవ్వడంతో పాటు పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధరపై అదనంగా రూ.200 చెల్లించి కొనుగోలు చేసి ఆదుకోనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఎర్రనేలలో పత్తిపంటకు బదులు ఇతర పంటలు వేసుకోవాలన్నారు.

ఆటోడ్రైవర్లకు 16న ట్రాన్స్‌పోర్టు బ్యాడ్జిమేళా

కడప, వినాయకనగర్ : రవాణాశాఖ కార్యాలయంలో ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి జిల్లాలోని నాన్‌ట్రాన్స్‌పోర్టు ఆటోడ్రైవర్లకు ట్రాన్స్‌పోర్టు బ్యాడ్జి మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ ఉపకమిషనర్ ఎం.బసిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ప్రస్తుతం ఆటో నాన్‌ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ కలిగిన డ్రైవర్లు హాజరై ట్రాన్స్‌పోర్టు బ్యాడ్జి, లైసెన్స్ పొందవచ్చన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ లైసెన్స్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. అలాగే రూ.260లు ఫీజు చెల్లించాల్సి వుంటుందన్నారు. 8వ తరగతి పాసైనట్లు అభ్యర్థులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సి వుంటుందన్నారు.ప్రొద్దుటూరు, రాజంపేట, పులివెందుల, రాయచోటి, బద్వేల్, రవాణా శాఖ కార్యాలయాల్లో ఉదయం 9 నుంచే మేళా ప్రారంభమవుతుందన్నారు.

సూక్ష్మపోషకాల పంపిణీలో లక్ష్యాన్ని అధిగమించాం

వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఠాగూర్‌నాయక్

కడప, ఐటీఐసర్కిల్ : జిల్లాలో భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులకు అవసరమైన సూక్ష్మపోషకాల పంపిణీలో ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి లక్ష్యాన్ని అధిగమించామని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఠాగూర్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 426 టన్నుల జింక్‌సల్ఫేట్, 17 టన్నుల బోరాన్, 8300 టన్నుల జిప్సం పంపిణీ చేశామని 65వేల హెక్టార్లకు సరిపడుతుందన్నారు. వీటిని రైతులకు బయోమెట్రిక్ పద్ధతి ద్వారా వందశాతం రాయితీలో పంపిణీ చేశామన్నారు. ఇప్పటి వరకు 51 మండలాల్లో జిప్సం 2278టన్నులు, జింకు 173 టన్నులు, బోరాన్ 856 టన్నులుపంపిణీ చేశామన్నారు. రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేర అదనంగా జిప్సం 4029 టన్నులు, జింక్ 536 టన్నులు, బోరాన్ 52 టన్నులు అవసరం వుందని ప్రభుత్వానికి నివేదిక పంపామని ఆయన పేర్కొన్నారు.

రాజంపేటకు రేపు నలుగురు మంత్రులు రాక

రాజంపేట : నలుగురు రాష్ట్ర మంత్రులు 13వ తేదీ రాజంపేటకు వస్తున్నట్లు తానా అధ్యక్షుడు వేమన సతీష్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు, పత్తిపాటి పుల్లారావు, జిల్లా ఇన్‌చార్జి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సహకార శాఖామంత్రి ఆది నారాయణరెడ్డి, విప్ మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీ గరికపాటి మోహన్‌రావు, కోమటి జయరామ్ హాజరవుతున్నారన్నారు. ఆదివారం సాయంత్రం 3గంటలకు రాజంపేట మన్నూరు ఉన్నత పాఠశాలలో 14పాఠశాలలను డిజిటల్ స్కూళ్లగా మార్చడానికి అందజేయనున్న కంప్యూటర్ల కార్యక్రమానికి మంత్రులు హాజరవుతున్నారన్నారు. రాజంపేట ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు తానా సభ్యులతో జరగనున్న ర్యాలీ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. స్నేహితులు, పట్టణ ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, తానా సభ్యులచే నిర్వహించే కార్యక్రమాలకు మంత్రులు హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రాజంపేటకు వచ్చిన వేమన సతీష్‌ను పలువురు నాయకులు కలిసి అభినందించారు.



వేమన సతీష్‌ను అభినందిస్తున్న పలువురు నేతలు



ఏనుగులు చాలా తెలివైనవి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. మనుషుల్లానే వాటికీ భావోద్వేగాలుంటాయి. మనుషులతో చాలా స్నేహంగా ఉంటాయి. కానీ రోజు రోజుకూ వాటి సంఖ్య తగ్గిపోతోంది. దంతాల కోసం, శరీర భాగాల కోసం అమానుషంగా వాటిని కొందరు చంపేస్తున్నారు. అయినా ఆ భారీ జంతువులకు మనుషుల మీద కోపం రాలేదు. ఆకారం భారీగా ఉన్నా అందరితో ప్రేమగా మెదిలే ఏనుగులను కాపాడాలనే ఉద్దేశంతో 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' మొదలైంది.



ఏనుగమ్మ.. ఏనుగు

ఏనుగులు మనుషులతో ఇట్టే కలిసిపోతాయి. భారతీయ సంస్కృతిలోనూ ఏనుగులకు విశిష్ట స్థానం ఉంది. నాలుగు వేల సంవత్సరాల నుంచి మానవులతో మైత్రి కొనసాగిస్తున్న గజరాజులకు.. మానవుల వల్లే ప్రమాదం పొంచి ఉంది. గత పది సంవత్సరాల్లో ఏనుగుల సంఖ్య 62 శాతం తగ్గింది. ప్రతిరోజు దాదాపు 100కు పైగా ఏనుగులు చనిపోతున్నాయి. ఏనుగు మాంసం, శరీర భాగాలు, దంతాల కోసం వేటగాళ్లు వాటిని చంపుతున్నారు. ఇది ఇలానే కొనసాగితే మరో పదిహేను, ఇరవై సంవత్సరాల్లో ఏనుగులు అంతరించిపోతాయని అంటున్నారు పర్యావరణవేత్తలు. అరణ్యంలో దొరికిన అనాథ ఏనుగుల్ని 'టూరిజమ్ ఇండస్ట్రీ', 'సర్కస్', 'టూరిస్ట్ పార్క్'లకు విక్రయించడంతో పాటు, అడవుల సంఖ్య తగ్గడం వల్ల కూడా వీటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇది గమనించిన కెనడియన్ ఫిల్మ్‌మేకర్ ప్యాట్రిసియా సిమ్స్, 'థాయ్‌లాండ్ రీ ఇంట్రడక్షన్ ఫౌండేషన్' సాయంతో ఆగస్టు 12న 'ప్రపంచ ఏనుగుల దినోత్సవా'న్ని జరుపుకోవాలని పిలుపునిచ్చాడు. ఏనుగులను కాపాడుకోవటం అందరి బాధ్యతంటూ సిమ్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాడు.

రక్షించుకుందాం !

WORLD elephant DAY August 12th

- అరణ్యాల్లో పోలీసుల సంఖ్య పెంచడం వల్ల వేటగాళ్ల నుంచి ఏనుగులను రక్షించుకోవచ్చు.
- గాయపడ్డ ఏనుగులకు ప్రత్యేక చికిత్సలను అందిస్తే, ఎన్నో ఏనుగులను కాపాడుకోవచ్చు.
- అనాథ ఏనుగులను టూరిజం ఇండస్ట్రీకి ఇవ్వకుండా ప్రత్యేక చట్టాలను రూపొందించడం ద్వారా కూడా వీటిని రక్షించుకోవచ్చు.
- ఏనుగుల శరీర భాగాలను స్మగ్లింగ్ చేస్తున్న వారికి కఠిన శిక్షలు విధించడం వల్ల కూడా గజరాజులను కాపాడుకోవచ్చు.



ఎన్నెన్నో ఏనుగులు

ఆసియా ఏనుగులు:

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏనుగుల్లో కేవలం పది శాతం మాత్రమే ఆసియా ఏనుగులున్నాయి. జన్యు వ్యత్యాసాల ఆధారంగా ఏనుగులను మూడు ఉప జాతులుగా విభజించారు. ఇవి ఇంచుమించు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు ఉన్నాయి.
- **శ్రీలంక ఏనుగు :** ఆసియా ఏనుగులన్నింటిలోనూ పెద్దది. ఇవి శ్రీలంకలో మాత్రమే ఉన్నాయి.
- **ఇండియన్ ఎలిఫెంట్ :** ఇవి భారతదేశం నుంచి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్నాయి. వీటి సంఖ్య దాదాపు 35 వేల వరకు ఉండొచ్చు.
- **సుమత్రా ఏనుగు :** ఇవి అన్నింటికన్నా చిన్న పరిమాణంలో ఉంటాయి.

ఆఫ్రికా ఏనుగులు :

- ఆఫ్రికా ఖండంలో 37 దేశాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి.
- ఇవి ఆసియా ఏనుగులకంటే పెద్దవిగా ఉంటాయి. వీటి చెవులు చాలా విశాలంగా, చెవులు చూడటానికి ఆఫ్రికా ఖండం ఆకారంలో ఉండటం విశేషం.

టంగ్ ట్విస్టర్స్

1. I see a sea down by the seashore.But which sea do you see down by the seashore?
2. There those thousand thinkers were thinking where did those other three thieves go through.
3. Five frantic frogs fled from fifty fierce fishes.

నవ్వుల్ నవ్వుల్

తండ్రి : ఏరా! గౌరీ! ఆవుకి ఆ కళ్లద్దాలు ఎందుకు పెట్టావు రా?
గౌరి : ఈ రోజు పచ్చగడ్డి దొరకలేదు. అందుకే ఆవుకు ఎండుగడ్డి వేసి పచ్చ కళ్లద్దాలు పెట్టాను.
తండ్రి : !!!!!!!!!!!!

సుత్తివేలు : అరేయ్! నువ్వు నిద్రపోయి లేచేసరికి నీకో కోటి రూపాయలు వచ్చాయనుకో! ఏం చేస్తావ్?
మిస్టర్ మేధావి : మళ్లీ పడుకుని ఇంకో కోటి రూపాయలు వస్తాయేమో చూస్తా!
సుత్తివేలు : !!!!!!!!!!!!!!

రంగులు నింపండి



ఔనా!

- గోల్డెన్ ఈగల్ గంటకు 250 కిలో మీటర్ల వేగాన్ని కూడా అందుకోగలదు.
- ఇది ఆరు వేల అడుగుల ఎత్తు వరకు ఎగరగలదు.



సూక్తి

మనిషికి వివేకాన్ని సంపాదించి పెట్టేవి అతనికి తగిలే ఎదురుదెబ్బలే.


చెప్పగలరా?

పదిలో ఉన్నాను కానీ గదిలో లేను
గర్వంలో ఉన్నాను కానీ సర్వంలో లేను
వాలులో ఉన్నాను కానీ వారులో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



పదాలు గుర్తించండి

R	B	Z	B	V	S	W	W	H	K	F	C	I	Q	C
R	S	G	U	O	C	A	W	F	M	O	E	S	F	L
Y	H	M	T	N	K	T	V	X	R	O	B	I	N	K
W	O	Y	T	O	Q	G	R	E	E	N	Y	Q	W	Z
O	W	Z	F	C	T	T	O	X	T	L	A	Z	P	A
I	E	Y	R	L	I	K	R	O	E	V	H	M	W	Y
G	R	Z	F	E	P	D	J	Z	A	T	V	O	Y	K
A	S	D	L	A	Q	A	Y	S	P	P	R	A	G	T
R	I	M	Y	N	G	N	W	E	Y	N	L	J	V	B
D	K	W	K	T	S	D	T	S	T	Q	Y	D	L	L
E	P	A	Z	N	M	E	M	A	Y	F	A	I	W	O
N	G	N	V	G	V	L	R	S	B	I	E	S	H	S
U	L	T	O	Y	K	T	K	J	B	I	Y	T	Y	S
Z	Y	N	R	F	L	O	W	E	R	S	C	K	E	U
Y	Q	K	P	T	C	N	T	C	W	O	B	N	U	M

జంతర్‌మంతర్

1. కచిలు ▸ ....
2. రుపుమ ▸ ....
3. పిపులు ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

1. STEA ▸ ....
2. RHUS ▸ ....
3. SLEA ▸ ....

జవాబులు

చెప్పగలరా? : పగలు **జంతర్‌మంతర్ :** 1. చిలుక 2. మరుపు 3. పిలుపు **జంబ్లింగ్ వర్డ్స్ :** 1. EAST/SEAT 2. RUSH 3. SALE/ SEAL

తిరుమల సమాచారం

తిరుమలకు వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ముందస్తుగా కడప టీటీడీ దేవస్థాన ఈ-దర్శన్ ద్వారా దర్శనం టిక్కెట్లు, వసతి (రూములు) పొందవచ్చు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు అందిన సమాచారం మేరకు తిరుమలలో వసతి, దర్శనం టిక్కెట్ల ఖాళీలు ఇలా వున్నాయి.

- **రూ.300 దర్శనం టిక్కెట్లు**

ఆగస్టు 21న 80, 22న 970, 23న 740, 27న 850, 28న 1370 టిక్కెట్లు ఖాళీగా వున్నాయి.

- **రూ.50 రూములు**

ఆగస్టు 24న 43 రూములు ఖాళీగా వున్నాయి.

- **రూ.100 రూములు**

సెప్టెంబర్ 14న 19, 19న 98, 20న 62, అక్టోబర్ 4న 8, 8న 8 రూములు ఖాళీగా వున్నాయి.

- **రూ.500 రూములు**

సెప్టెంబర్ 13న 12, 14న 23, 18న 36, 19న 45, 20న 13 రూములు ఖాళీగా వున్నాయి.

- **రూ.200 రూములు (శ్రీనివాసం) తిరుపతిలో**

ఆగస్టు 23న 4, 24న 11, 31న 7 సెప్టెంబరు 5న 6, 6న 8 ఖాళీగా ఉన్నాయి.

- టీటీడీ కల్యాణమండపాలు బుకింగ్ చేసుకునేందుకు సంప్రదించాల్సిన నెంబరు 9059948220.

టీటీడీ కార్యాలయం పనిచేయు వేళలు

- ప్రతి మంగళవారం సెలవు
- సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి 1 గంట వర కు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఆ సమయంలో దర్శనం టిక్కెట్లతో పాటు వసతి కోసం రూములను బుక్ చేసుకోవచ్చు.

గమనిక : ఈదర్శన టిక్కెట్లకు వచ్చే వారు గుర్తింపు కార్డులు తెచ్చుకోవాలి ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదో ఒక గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.

ఓటు నమోదుకు చర్యలు చేపట్టాం

- విదేశాల్లో ఉన్న వారివి తొలగిస్తున్నాం ● వినూత్నంగా చేపట్టిన బంధం యాప్ ద్వారా చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఈసీకి వెల్లడించిన కలెక్టర్ బాబూరావునాయుడు




వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఈసీ భన్వర్‌లాల్, పాల్గొన్న కలెక్టర్ బాబూరావునాయుడు, జిల్లా అధికారులు

కడప, కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా 18 నుంచి 25 సంవత్సరాలలోపు ఉన్న ఓటరు నమోదుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ బాబూరావునాయుడు తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల అధికారి (ఈసీ) భన్వర్‌లాల్ తెలుగు రాష్ట్రాల కలెక్టర్లు, ఈఆర్వోలతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అజెండా అంశాలపై చర్చించారు. ఈ నెల 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలోని సీఈవోలతో జరగనున్న సమీక్షలో నివేదికలు సమర్పించాల్సి ఉందన్నారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న నివేదికలను ఆయా జిల్లాల కలెక్టర్లు పంపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాబూరావునాయుడు జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో చనిపోయిన వారి ఓటర్ల వివరాలను గుర్తించామన్నారు. అలాగే వినూత్నంగా ప్రారంభించిన బంధం యాప్ ద్వారా విదేశాలకు వెళ్లిన వారి సమాచారం తీసుకుని వారి పేర్లను ఓటరు జాబితాలో తొలగించేందుకు చర్యలు చేపట్టామని ఈసీకి నివేదించారు. కాగా ముందుగా ఈసీ భన్వర్‌లాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ ఈఆర్వోకు అత్యాధునిక సాంకేతిక హార్డ్‌వేర్ సిస్టంతో పాటు నైపుణ్యం కలిగిన సిబ్బందిని ఏర్పాటు చేయించాలని సూచించారు. ఆయా జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల సమాచారాన్ని సెంట్రలైజ్ చేసే విధంగా జిల్లా కేంద్రంలో జిల్లా కాంట్రాక్ట్ సెంటర్‌ను నెలకొల్పాలన్నారు. ఓటరు నమోదు, తొలగింపులో వచ్చిన ఫిర్యాదులపై వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారులు ఆయా ఈఆర్వో, ఏఆర్వోలతో సమీక్షించాలన్నారు. ఎపిక్, ఎలక్టోరల్, ఓటర్ల జాబితా, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తదితర ఎన్నికల ఖర్చుకు సంబంధించిన బిల్లులు ట్రెజరీ ద్వారా సర్దుబాటు చేయాలన్నారు. చనిపోయిన వారి ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అలాగే సైనికోద్యోగుల సర్వీసు ఓటర్లపై సేకరించిన దరఖాస్తులను పరిశీలించి శనివారం మధ్యాహ్నంలోపు పూర్తి చేసి జాబితాలో నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల అవగాహనపై జాతీయ ఓటర్ల దినోత్సవ నిర్వహణలో చేపట్టాల్సిన పద్ధతులపై ఈఆర్వో, ఏఆర్వోలకు సూచనలు జారీ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కోర్టుకు సంబంధించిన కేసుల వివరాలను ఈసీఐ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు.

400 కిలోల పూలతో గండి క్షేత్రం ముస్తాబు




బెంగుళూరు నుంచి గండికి తెప్పించిన రకరకాల పూలు

చక్రాయపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గండి మూడో శ్రావణ శనివారం సందర్భంగా 400 కిలోల పూలతో ముస్తాబవుతోంది. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గండికి దాదాపు 11 రకాల 400కిలోల పూలు బెంగుళూరు నుంచి తెప్పించారు. చైర్మన్ రాజారావు, ఏసీ పట్టెం గురుప్రసాద్, పాలక మండలి సభ్యులు శుక్రవారం రాత్రి ఆలయాన్ని పూలతో తీర్చిదిద్దారు. ప్రత్యేకించి బెంగుళూరు నుంచి పూలను తెప్పించి కొత్త కొత్త అలంకరణలు, తోమాలలు ఏర్పాటు చేశారు. జరాతరు, ఆర్చెర్చ్, ఆంటోరియం, కార్మిశన్, అస్తమేరియా, లిల్లీ, జెనడ, సాండ్రాఫ్‌బార్డ్, ఇందిమా, బంతి, చామంతి, లీవ్స్, ఆస్పరస్ ఇలా అనేక రకాల పూలను తెప్పించి ఆలయాన్ని అలంకరించారు. అంజన్న మూలవిరాట్‌ను తోమాలలతోనూ, గర్భాలయం, రాజగోపురం, దీపస్తంభం, గుడి ముందు భాగాన వివిధ రకాల పూలతో కొత్త పద్ధతిలో అలంకరిస్తున్నారు.

మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌కు అభినందనలు

మైదుకూరు : మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్‌గా ఎంపికైన యలవలి వెంకటగోపాల్‌కు ఆర్యవైశ్య ప్రతినిధులు అభినందనలు తెలియచేశారు. ఆర్యవైశ్యసభ ఆహ్వా నం మేరకు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయానికి చేరుకున్న యలవలి గోపి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు తల్లం వెంకటసుబ్బయ్య గోపికి పూల మాల వేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు సుబ్రహ్మణ్యం, యువజన సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడి మృతి



అన్వర్‌బాషా (ఫైల్ ఫొటో)

ఖాజీపేట: ఖాజీపేట మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ అన్వర్‌భాష శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన ముస్లిం మైనార్టీల కోసం అహర్నిశలు కృషి చేశారు. అంతేకాకుండా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ గుర్తింపు పొందారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడంతో నేతలు, కార్యకర్తలు, అభిమానులు దిగ్ర్భాంతికి గురయ్యారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

టీడీపీ నేతలు సంతాపం: మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అన్వర్‌బాషా మృతి పట్ల టీడీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. అన్వర్‌బాషా పార్థవదేహంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల్ రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి పుష్పగుచ్ఛం వుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో ప్రొద్దుటూరు మాజీ మున్సిపల్ ఛైర్మన్ ముక్తియార్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ నేత సిద్దారం ఖదీరుల్లా, మార్కెట్ యార్డు ఛైర్మన్ బిపి సుధాకర్ రెడ్డి, తేదేపా జిల్లా కార్యదర్శి బండి వెంకటేష్, రియాజ్, జలీల్, అహ్మద్ మున్నీర్, రెడ్యం ఆదినారాయణ రెడ్డి, రెడ్యం రామక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంతాపం తెలుతుపున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, రెడ్యం తదితరులు

ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విరజానందస్వామి, హాజరైన మహిళలు

బ్రహ్మంగారిమఠం : ధర్మపరిరక్షణకు సమాజంలో ఉండే ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి టూరిస్ట్ భవనంలో సమరసత సేవాఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ప్రాంతీయ మహిళా సమావేశం చేపట్టారు. ఈ సమావేశం రాష్ట్ర కార్యదర్శి శ్రీనాథ్ అధ్యక్షతన చేపట్టారు. ఈసందర్భంగా విరజానందస్వామి మాట్లాడుతూ ధర్మపరిరక్షణకు, సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదే విధంగా స్త్రీ చైతన్యవంతమైతే, సృష్టి చైతన్యవంతమవుతుందన్నారు. స్త్రీమూర్తి లేకుంటే యావత్ జగత్తు ఉండదని, జాతి నిర్మాణానికి మొదటి వ్యక్తి మాతృమూర్తిఅని, మూలాలు పరిరక్షించుకోవాలంటే హైందవ ధర్మాన్ని ఆచరించాలని ఆయన తెలిపారు. అనంతరం ఈశ్వరీ దేవి మఠాధిపతి వీరశివకుమారస్వామి మాట్లాడుతూ తల్లి ఆదిగురువు, జీవితంలో ఎలా మెలగాలో ఉగ్గుపాలతో నేర్పించి, కట్టు, బొట్టు, ఆచారాలు హైందవ సంస్కృతిని భావితరాలకు అందించాలన్నారు. బ్రహ్మంగారిమఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞానం గురించి తెలిపారు. అనంతరం హిందూధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా సభ్యులు సి.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ధర్మం గురించి అవగాహన పొంది, ధర్మాచరణ చేస్తూ ఇతరులను భాగస్వామ్యులు అయ్యేట్లు చైతన్యపరచాలన్నారు. 2015 డిసెంబర్ 2వ తేదీన మఠాధిపతులు, పీఠాధిపతులతో ధార్మిక సదస్సుజరిగిందని, ధర్మపరిరక్షణకు అందరం కలసికట్టుగా కృషి చేయాలని ఆసమావేశంలో తీర్మానించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం 500 దేవాలయాలు నిర్మించాలని తీర్మానించారు. ప్రస్తుతం 360 దేవాలయాలు నిర్మాణంలో ఉన్నాయని, మహిళలకు, గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో శిక్షణపూర్తి అయిందని, ప్రస్తుతం ప్రాంతీయస్థాయిలో కడప, కర్నూలు, అనంతపురం నుంచి 50మంది మహిళలు పాల్గొన్నారన్నారు. వీరి శిక్షణానంతరం మండలాల్లో విస్తృతంగా పర్యటించి ధర్మాన్ని గురించి తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ధర్మప్రచారక్ సాయిరాం, డివిజన్ ధర్మప్రచారక్‌లు, రాయలసీమ ధర్మప్రచారక్ ఈశ్వరరెడ్డి, సమరసతసేవా ఫౌండేషన్ మండల ప్రచారక్ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూముల పంపిణీలో రెవెన్యూ యంత్రాంగం విఫలం

బ్రహ్మంగారిమఠం : పేదలకు భూములను చూపించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు జి. శివకుమార్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సోమిరెడ్డిపల్లె సీటిబావి భూముల్లో పేదల భూములను ఆక్రమించి సాగుచేస్తున్న భూ ఆక్రమణదారులపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదన్నారు. స్వేచ్ఛగా పేదల భూములను సాగు చేస్తున్నప్పటికీ వీఆర్వో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో సిటిభాయి భూములను సంరక్షించగా అక్కడ వేరే గ్రామాల నుంచి కూలీలను పిలిపించి వరినాట్లను వేస్తున్నారని, వెంటనే రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వై. గురివిరెడ్డి, రమణ, గోవింద్, దస్తగిరి, సుబ్బయ్య, అసైన్డ్‌మెంట్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో నడవాలంటే... నరకమే



గుంతలమయమై అధ్వానంగా ఉన్న రోడ్డు

మైదుకూరు రూరల్ : ఆ రోడ్డులో నడవాలంటేనే నరకం కనిపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. మైదుకూరు మున్సిపాలిటీలో పరిధిలోని నానుబాలపల్లె, శెట్టివారిపల్లె, చిన్నయ్యగారిపల్లె తదితర గ్రామాలకు వెళ్లాలంటే వనిపెంట రోడ్డులో అంకాలమ్మ గుడి ఎదురుగా ఉన్న రోడ్డుపై వెళితే ఆ గ్రామాలకు దగ్గరగా ఉంటుందని చాలామంది గ్రామస్థులు ఇదే దారిలో వెళుతుంటారు. అయితే రోడ్డు అధ్వానంగా తయారైనా పట్టించుకునే అధికారులే కరువయ్యారని బాటసారులు వాపోతున్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్డు వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దిగజారే జగన్ నోట ఇలాంటి మాటలే వస్తాయి.. రెడ్యం



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

దువ్వూరు: తండ్రి శవాన్ని పక్కనబెట్టుకుని ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాలు సేకరించిన వైయస్ జగన్ నోట ఉరితీస్తాం, కాల్చిపారేస్తాం, చెప్పులతో కొడతాం లాంటి సంస్కారహీనమైన అనుచిత వ్యాఖ్యలు వస్తాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దువ్వూరులోని మాజీ మండలాధ్యక్షుడు మెరిమేకల గురువయ్య యాదవ్ స్వగృహంలో రెడ్యం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి ఓటమి తప్పదని, జగన్ అక్కడే తిష్ఠ వేశారని, అయినా ఫలితం లేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పైన ప్రతిపక్షనేత ఫ్యాక్షన్, వీధి రౌడీ భాషను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం రావణ కాష్టం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్, పీకెలు ఏమి చేయలేక సోషియల్ మీడియా ద్వారా విషప్రచారం చేస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. జగన్ లాంటి నేత రాజకీయాల్లో ఉంటే అరాచకాలు రాజ్యమేలుతాయని అశాంతి ప్రభలుతుందన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే జగన్ భవిష్యత్తుపై ఆశలు వదులు కోవాల్సిందేనని, చరిత్ర హీనుడు కాకతప్పదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురువయ్య, మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు.

మితిమీరుతున్న ఆటోవాలాల ఆగడాలు

దువ్వూరు : అసలే జాతీయ రహదారి. ఆపై మద్యం మత్తులో దువ్వూరు నుంచి ప్రొద్దుటూరు-చాగలమర్రివైపు ప్యాసింజర్ ఆటోలు ప్రయాణికులతో నిత్యం సుమారు వంద ఆటోలకుపైగా తిరుగుతున్నాయి. మండల కేంద్రమైన దువ్వూరుకు చెందిన ఆటోవాలాల చేష్టలు మితిమీరుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో కడప నుంచి కర్నూలుకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓ ఆటో డ్రైవరు బస్సుకు ఎదురుగా ఆటోను నిలిపివేసి బస్సును కదలనివ్వకుండా చేశారు. స్థానికులు వాగ్వాదం చేసినా, పోలీసుల దృష్టికి తీసుకెళ్తామన్నా అడ్డుకున్న స్థానికులను ఎవ్వరికి చెబుతారో చెప్పండి అంటూ ఎంతసేపటికి ఆటోను అడ్డు తీయలేదు. గతంలో ఇదే ఆటోవాలా పుల్లారెడ్డిపేట సమీపంలో ఆర్టీసీ బస్సును అడ్డుకున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి రికార్డులు లేకున్నా, ఆటోలు తిరుగుతున్నా పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ వాహనాలను సైతం లెక్కచేయలేదు. సంబంధిత అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆర్టీసీ బస్సు ఎదురుగా ఆటో నిలిపిన దృశ్యం

ఆంధ్రజ్యోతి
4
ప్రొద్దుటూరు
కడప । శనివారం 12 ఆగస్టు 2017
ప్రొద్దుటూరు - రాజుపాళెం

గండికోట అవినీతి అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్: గండికోట ముంపువాసుల పరిహారం పంపిణీలో రూ.30 కోట్ల అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు చంద్ర, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌లు, తహసీల్దారు వెంకటరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అవినీతికి పాల్పడ్డవారిపై కేసులు నమోదు చేసి సొమ్మును వసూలు చేయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

విధుల్లో చేరిన టీచర్లు

ప్రొద్దుటూరు టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు పూర్తికావడంతో పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు మండలంలోని ఉర్దూ పాఠశాలల్లో శుక్రవారం విధుల్లో చేరారు. మండలంలోని ఎనిమిది మండల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అమృతానగర్ మండల ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నూరుల్‌అమీన్, బొజ్జవారిపల్లె పాఠశాలలో సాదిఖాబేగం, పెన్నానగర్ పాఠశాలలో నజ్మపర్వీన్, కొత్తపల్లె పాఠశాలలో కరీమున్నీసా, ఖాదర్‌బాద్ పాఠశాలలో మహముదాచాన్ అబ్దుల్ రహమాన్‌లు విధుల్లో చేరారు.

పరిశుభ్రతతోనే దోమల నివారణ


మాట్లాడుతున్న ఎంటీఎఫ్ జిల్లా కన్వీనర్ రఫీవుద్దీన్

ప్రొద్దుటూరు టౌన్: ఇళ్లు, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించి ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంటీఎఫ్ జిల్లా కన్వీనర్ రఫీవుద్దీన్ పేర్కొన్నారు. నడింపల్లె మున్సిపల్ హైస్కూలులో దోమలపై దండయాత్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో చెత్తను రోడ్లపైన మురికి కాలువల్లో వేయరాదని, చెత్తట్రాక్టర్లలో వేయాలని సూచించారు. శానిటరీ సూపర్‌వైజర్ రాంప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటిలో పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఇన్‌చార్జి హెడ్మాస్టర్ ఓబులేసు మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

విద్యుత్తులైన్లను పరిశీలించిన డీఈ

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్: వర్షాకాలంలో విద్యుత్తు సమస్యలను ముందస్తుగా గుర్తించేందుకు, పరిష్కారం కోసం శుక్రవారం ప్రొద్దుటూరు పెన్నానగర్, ఈశ్వరరెడ్డినగర్‌లలో విద్యుత్తు లైన్లను పరిశీలించినట్లు స్థానిక డీఈ విజయన్ తెలిపారు. ఏఈలు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు. వాటి పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీలు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు ఇంజినీర్లకు అవార్డులు

ప్రొద్దుటూరు విద్యుత్తు శాఖ డివిజన్ పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీరు శ్రీనివాసులరెడ్డి, సబ్ ఇంజినీరు శివప్రసాద్‌లను స్వాతంత్ర్య దినోత్సవ అవార్డులకు ఎంపిక చేసినట్లు డిఇ విజయన్ తెలిపారు. వీరికి ఆరోజున తిరుపతి ఎస్‌పీడీసీఎల్ సీఎండీ దొర చేతుల మీదుగా అవార్డులు, మెమొంటోలు అందజేస్తారన్నారు.

మద్యం దుకాణాల తొలగింపునకు 13న నిరాహార దీక్షలు

ప్రొద్దుటూరు అర్బన్: ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం రోడ్డు వసంతపేటలో ఉన్న గోసుల, కడప, పీఎన్ఆర్, రఘు, కనకదుర్గ షాపులను తొలగించాలని మద్య వ్యతిరేక ఐక్యవేదిక కన్వీనర్ ఆధ్వర్యంలో ఆగస్టు 13వ తేదీ ఆదివారం మద్యం దుకాణాల ఎదుట మహిళలు నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వైదిక కన్వీనర్లు బొర్రా రామాంజనేయులు, ఎం.పద్మ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నెల రోజులుగా వసంతపేట, సాయిబాబా కొట్టాల మహిళలు తమ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పరచిన మద్యం దుకాణాలు తొలగించాలని పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారన్నారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బ్రాందీషాపులున్న ప్రాంతాల్లో విచారణ చేపట్టి ప్రజల సమస్యలు తీర్చుతామని, కాలయాపన ప్రకటనలు చేస్తారన్నారు. స్థానికర మహిళలుఏ తమ ఆవేదనను, ఆందోళనను స్వయంగా ఎక్సైజ్ కార్యాలయంకు వచ్చి అధికారుల ఎదుటే వాపోయినా మహిళల ఆవేదనలను పరిగణలోకి తీసుకోకుండా విచారణ పేరుతో సమస్యను నీరుగార్చే ప్రయత్నం చేయాలని ప్రయత్నిస్తున్న బ్రాందీషాపుల యజమానులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలను మభ్యపెట్టేందుకు మద్యంషాపుల వద్ద తాగుబోతులలను కట్టడి చేస్తాం, మహిళలకు ఇబ్బంది కలుగకుండా చేస్తామని ఎక్సైజ్ అధికారుల మాటల్లో వారి ఎవరి పక్షం మాట్లాడుతున్నారు, వారి వైఖరి స్పష్టమవుతోందన్నారు. దుకాణాలు ఆ ప్రాంతాల నుండి తొలగించటమే మహిళలకు పరిష్కారమని దుకాణాలు తరలించేవరకు ఉద్యమం కొనసాగుతుందని వారు తెలిపారు. 13న జరిగే నిరాహార దీక్షల్లో మద్యం వ్యతిరేక వేదికలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు పాల్గొంటాయన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కూడా ప్రజలకిచ్చిన హామీ మేరకు నిరాహార దీక్షలో పాల్గొంటారన్నారు. దీక్షలను విజయవంతం చేయడానికి మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ సదస్సులో రైతుల విన్నపాలు

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో 7, 13, 14 సర్వే నంబర్లలో 12 ఎకరాల భూమి చెక్కలు ఉన్నాయని ఇరువురు రైతులు తహసీల్దారు వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇరువురు రైతులను పట్టాదారు పాస్‌పుస్తకాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గురివిరెడ్డి, వీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

ప్రొద్దుటూరు టౌన్: మోడంపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. పాఠశాల ఎస్ఎంసీ సమావేశం 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ ఎన్.వి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలను రోజు బడికి పంపాలని, 10వ తరగతి విద్యార్థులపై శ్రద్ధపెట్టి ఉదయం, రాత్రి చదివించాలని సూచించారు. ఎస్ఎంసీ సభ్యులు మాట్లాడుతూ ఉర్దూమీడియం ఎన్.సైన్స్‌కు నాలుగు సంవత్సరాలు టీచర్లు లేని ఇంగ్లీషుమీడియంకు సోషల్ టీచర్ రెండు నెలలుగా మెడికల్ లీవులో ఉన్నందు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శాస్త్రినగర్‌లో ఉన్న సంస్కృతి స్వచ్ఛందసేవా సంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. 18-35 యేళ్ల మధ్య ఉన్న మహిళలు శాస్త్రినగర్‌లోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్, ధృవపత్రం అందజేస్తామన్నారు.

'జగన్‌పై ఈసీ చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్: మతిభ్రమించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామిశెట్టి బాబు అన్నారు. నంద్యాల ఎన్నికలను పురస్కరించుకుని జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉరితీయాలని, నడిరోడ్డుపై కాల్చి చంపాలని పేర్కొనడం ఆయన లోని నేర స్వభావానికి నిదర్శమన్నారు.

అత్యాధునిక వైద్య సౌకర్యాలతో...

డాక్టర్ నాగలక్ష్మి స్పెషాలిటీ హాస్పిటల్

ప్రొద్దుటూరు క్రైం : మూడు దశాబ్దాలుగా ప్రొద్దుటూరు ప్రజలతో వైద్యపరమైన అనుబంధం ఉందని, ఈ క్రమంలోనే సామాన్య, మధ్య తరగతి ప్రజల అందరికి అందుబాటులో అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందించాలన్న సంకల్పంతోనే డాక్టర్ నాగలక్ష్మి స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ స్త్రీవ్యాధి నిపుణురాలు డాక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఇక్కడ సంతాన సాఫల్య కేంద్రాన్ని, గ్యాస్ట్రోఎంటరాలజీ సెంటర్‌ను అత్యాధునిక వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దినట్లు ఆమె తెలిపారు. శనివారం డాక్టర్ నాగలక్ష్మి స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఆ హాస్పిటల్ భవన సమావాయంలో డాక్టర్ నాగలక్ష్మి, ఆమె కుమార్తె డాక్టర్ కాత్య, అల్లుడు డాక్టర్ హరీష్‌కుమార్‌లు తమ హాస్పిటల్‌లో రోగులకు అందించనున్న అత్యాధునిక వైద్యసేవల గురించి వివరించారు. సంతాన సాఫల్య వైద్యం కోసం బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు లాంటి నగరాలకు వెళ్లకుండానే ఇక్కడే అంతకు మించి వైద్యం అందించేలా డాక్టర్ కాత్య ఆధ్వర్యంలో డాక్టర్ నాగలక్ష్మి ల్యాపరోస్కోపీ అండ్ టెస్ట్‌ట్యూబ్‌బేబీ సెంటర్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించే విధంగా అధునిక ఎండోస్కోపి, కొలనోస్కోపి వైద్య పరీక్షలతో అధునిక గ్యాస్ట్రోఎంటరాలజీ సెంటర్‌ను డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో నెలకొల్పుతున్నట్లు చెప్పారు. డాక్టర్ హరీష్, డాక్టర్ కాత్యాలు మాట్లాడుతూ సంతాన సాఫల్యం, ఉదరకోశ వ్యాధుల కోసం నగరాలకు వెళ్లాల్సిన పని లేదని, ఇక్కడే అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్య చికిత్సలు అందిస్తామని చెప్పారు. నగరాలకు వెళ్లి వైద్యం చేయించుకునే ఖర్చులో 50శాతం ఖర్చుతోనే ఇక్కడ వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. తమ పిల్లలు అభయ్‌అమోఘ్ పేరిట ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నామని, దీని ద్వారా చాలా తక్కువ ఖర్చుతో నిరుపేదలకు వైద్యం అందించాలనే ఆలోచన ఉందని తెలిపారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు అర్బన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పే జీవో 279ని రద్దు చేయాలని ఆగస్టు 22న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శేషన్నను కలిసి కార్మికులందరూ 22న చలో విజయవాడకు వెళ్లేందుకు ముందస్తు అనుమతిని కోరారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా రిలే దీక్షలు చేపట్టామన్నారు. 22న భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి

కడప సిటీ	: 9985411176	వినాయకనగర్	: 9849744014	మారుతీనగర్	: 9849117632
సెవెన్‌రోడ్స్	: 9985921355	కడప అర్బన్	: 9052239140	స్పోర్ట్స్	: 9059064398
కోటిరెడ్డిసర్కిల్	: 9347422385	ఐటిఐసర్కిల్	: 8886959903	వైవీయూ	: 9492563188
కడప క్రైం	: 9885477301	రూరల్	: 8520888323	ప్రకాష్‌నగర్	: 9866445574
రిమ్స్	: 9160619141	ఎర్రముక్కపల్లె	: 7702707108	రవీంద్రనగర్	: 9949232217

దళారులను నమ్మి మోసపోవద్దు

జిల్లేల సుబ్బరాయుడు, రూరల్ సబ్ రిజిస్ట్రార్



ఇంటర్వ్యూ

కడప, ప్రకాష్‌నగర్ : భూములు, భవనాల స్థలాల క్రయ, విక్రయాల్లో ప్రజలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజ్, ఈసీని సరిచూసుకుని కొనుగోలు చేయాలి. అలా ఈసీ నకలు చూడకుండా కొనుగోలు చేస్తే ప్రజలు నష్టపోతారని కడప రూరల్ సబ్‌రిజిస్ట్రార్ జిల్లేల సుబ్బరాయుడు తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎక్కువశాతం స్థల, భవన కొనుగోళ్ళల్లో తప్పిదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్త పాటించాలన్నారు. ఉద్యోగులు సొంత భవనం నిర్మించుకోవాలని అనేక మంది స్థలాలు, భవంతులు కొనుగోలు చేస్తుంటారు. కొనుగోలు సమయంలో పై నియమాలు పాటిస్తే నష్టపోకుండా ప్రజలు బయటపడతారని **ఆంధ్రజ్యోతి** ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

ప్రశ్న : భూములు మార్కెట్ విలువ ఎలా గుర్తిస్తారు ?

జవాబు : భూముల పాస్‌బుక్, ఆన్‌లైన్ ఆధారంగా ఒక్కొక్క ఏరియా పరిధిని బట్టి ప్రభుత్వం నిర్ధేశించిన మార్కెట్ విలువ గుర్తించడం జరుగుతుంది. పాస్‌బుక్, ఆన్‌లైన్ ఆధారంగా మార్కెట్ విలువలను నిర్ధేశించి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది.

ప్రశ్న : రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఏమి అవసరం ?

జవాబు : కొనుగోలు దారులు, అమ్మేవారికి ఆధార్‌ప్రూఫ్ తప్పనిసరి. దీంతో పాటు రిజిస్ట్రేషన్ జరగాలంటే అమ్మినవారు, కొనుగోలు దారులతో పాటు ఇద్దరు సాక్షులు అవసరం. స్థలాలకైతే లింక్ డాక్యుమెంట్, భూములకైతే పాస్‌బుక్ 1,బీ అండంగల్ ఉండాలి.

ప్రశ్న : పట్టణాల్లో భవనాల రిజిస్ట్రేషన్ కు ఏ నకలు అవసరం ?

జవాబు : పట్టణాల పరిధిలో వార్డును బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు నిర్ధేశించడం జరుగుతుంది. భవనానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్, ఇంటి పన్ను రశీదు తప్పనిసరిగా ఉండాలి.

ప్రశ్న : రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు జరుగుతాయి ?

జవాబు : ప్రతి రోజు 10 నుంచి 15 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మంచి రోజుల్లో మరిన్ని రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

ప్రశ్న : భూమి, స్థలం, భవనాలు కొనుగోలు చేసే వారు ముందు జాగ్రత్త చర్యలు ఏమి పాటించాలి ?

జవాబు : భూమి, భవనాలు కొనుగోలు చేసే వారు ఈసీ, నకలు తప్పని సరిగా సరిచూసుకోవాలి దళారుల మాటలు ఎట్టి పరిస్థితిలోనూ నమ్మవద్దు.

ప్రశ్న : ప్రజలకు సకాలంలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారా ?

జవాబు : ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. నెట్, సర్వర్ ఆలస్యమైతే తప్ప సకాలంలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

పాతబస్టాండ్.. కంపుబస్టాండ్

కడప, రవీంద్రనగర్ : అక్కడ స్వచ్ఛభారత్ మాట వినిపించదు. పొరపాటున కూడా కనిపించదు. మూత్రం వస్తే చాలు ఆరుబయటే పోసేస్తారు. కనీసం బహిరంగంగా మూత్రవిసర్జన చేయకూడదన్న మాటే మరచిపోతారు. పోనీ అధికారులైనా వారిపై చర్యలు తీసుకుంటారా ? అంటే అదీలేదు. అటు ఆర్టీసీ అధికారులు ఇటు ప్రజలు పాతబస్టాండును కంపుకంపు పట్టిస్తున్నారు. నగర నడిబొడ్డున వున్న పాతబస్టాండులో కనీస వసతులు కరువయ్యాయి. బస్టాండు పరిసరాలు మలమూత్రవిసర్జనతో కంపుకొడుతున్నాయి. బస్టాండు ఆవరణ మొత్తం బయట చెత్తాచెదారంతో నిండి వుండడంతో ప్రయాణికులు ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండులో కుళ్లినవ్యర్థాలతో వాసన వస్తోంది. బస్టాండులో మరుగుదొడ్లు వున్నప్పటికీ వాటిని ప్రయాణికులు ఉపయోగించడం లేదు. ఆవరణలో కార్పొరేషన్ అధికారులు ఏర్పాటుచేసిన డంపింగ్‌లో అక్కడే వ్యాపారంచేసుకుని చిరువ్యాపారులు కుళ్లిన వ్యర్థపదార్థాలను వేస్తుండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లాలంటేనే భయంతో పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాతబస్టాండు పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కంపుకొడుతున్న పరిసరాలు
ఆరుబయటే మల,మూత్ర విసర్జన



కంపుకొడుతున్న చెత్త

దుర్వాసన భరించలేకున్నాం...



పాతబస్టాండు ఆవరణలో చెత్తాచెదారం, మురుగునీరు వుండడం వల్ల విపరీతమైన వాసన భరించలేకున్నాం. కొద్దిసేపుకూడా బస్టాండలో కూర్చోలేకున్నాం. ఎక్కడబడితే అక్కడ మలమూత్రాలతో బస్టాండ్ మొత్తం దుర్వాసతో భయపెడుతోంది.

● మహబూబ్‌ఖాన్, ప్రయాణికుడు

మురుగునీరు తొలగించాలి



పాతబస్టాండు ఆవరణలో నిలిచిన మురుగునీటిని తొలగించాలి. సమీపంలో వున్న మరుగుదొడ్లను ప్రయాణికులు వినియోగించుకోకపోవడంతో మలమూత్ర విసర్జన ఆరుబయట చేస్తున్నారు. దీంతో భరించలేని దుర్వాసన వస్తోంది. అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● బాలుడు, ప్రయాణికుడు

చదువుకు మించిన సంపద లేదు

కడప,ఎర్రముక్కపల్లె : చదువుకు మించిన సంపద లేదని అమన్ చారిటబుల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎజాజ్ అహ్మద్ పేర్కొన్నారు. నకాష్,మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నోటుపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ ఇలియాస్ బాష ట్రస్టు సేవలు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్. షకీంబేగం, ఫీడ్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్‌జలీల్ ప్రతినిధులు యాసర్, చాంద్‌బాష, అహ్మద్ ఉపాధ్యాయులు జమీల్, నాయబ్‌రసూల్, షహబుద్దీన్, గోపీక్రిష్ణ పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

కడప, ప్రకాష్‌నగర్ : మున్సిపల్‌వర్కర్లకు శాపంగా మారే జీవో 279 రద్దు చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం అభినందనీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ అన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. ఆయన శుక్రవారం సీఐటీయు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్లకు నష్టం కలిగించే జీవోను రద్దు చేసి 151 జీవోను అమలు చేయాలని అనేకసార్లు పోరాటం చేశామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించక టెండర్లు పిలవడం దారుణమన్నారు. రాజ్యాంగం, చట్టంపై నమ్మకమున్న ప్రభుత్వాలు వెంటనే హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ విషయంలో అవినీతికి పాల్పడ్డ అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు వెంకటసుబ్బయ్య, చెన్నయ్య, విజయ్, కేశవ, ఓబులరెడ్డి, నరసింహా,నాగేంద్ర, సుబ్బయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా వుండని ప్రాంతాలు

కడప, సెవెన్‌రోడ్స్ : మరమ్మతుల నిమిత్తం నేడు నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాను 3గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్ డివిజన్ ఇంజనీర్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రామరాజుపల్లె, కలెక్టరేట్, పాతరిమ్స్, సాయిపేట, బాలాజీనగర్, ఎల్ఐసీ, చిన్నచౌకు, పవర్‌హౌస్, దేవునికడప, పాతకడప, మూలవంక, పక్కీరుపల్లె, ఐటీఐ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దాడి కేసులో ఆరుగురి అరెస్టు

కడప క్రైం: కడప నగరం శివానందపురంలో శ్మశాన స్థల విషయమై బాల సుబ్బయ్యపై దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ మోహన్‌ప్రసాద్ తెలిపారు. శివానందపురానికి చెందిన బ్రహ్మయ్య, సుబ్బయ్య, ఓబుల్‌రెడ్డి, నరేష్, సతీష్, ప్రవీణ్‌కుమార్ శ్మశాన స్థలంవిషయమై బాలసుబ్బయ్యతో గొడవకు దిగారు. దీంతో బాలసుబ్బయ్యతో కర్రలతో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

'ఉక్కు' వస్తే కడప మరో జంషెడ్‌పూర్

కడప, రవీంద్రనగర్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తే కడపమరో జంషడ్‌పూర్‌గా మారుతుందని భారత్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత ఫరూక్‌అహ్మద్, విద్యామందిర్ కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. వారు శుక్రవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు పోరాట దీక్షలకు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి మాట్లాడారు. విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమ వుందని, ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం ఆవేదన కలిగిస్తుందన్నారు. దీక్షలు చేపట్టిన వారికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు.ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో 30వేల మందికి ప్రత్యక్షంగా, లక్షమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ దీక్షల్లో కిరణ్, రాజేష్, రవి, పద్మ, శాంతమ్మ తదితరులు వున్నారు.



ఉక్కుదీక్షకు మద్దతు తెలుపుతున్న కళాశాలల అధిపతులు

సమస్యల పరిష్కార కోసమే రెవెన్యూ సదస్సులు

లక్కిరెడ్డిపల్లె: రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రామాలల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ కృపావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుర్నూతల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై సదస్సుకు వచ్చిన అర్జిదారుల సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. అలాగే ఏవైనా భూ సమస్యలు వుంటే రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చునని ఆమో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నరేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

రాయచోటిటౌన్ : రాయచోటి ప్రాంతంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాంతో పట్టణంలోని ఎగువ ప్రాంతాలనుంచి వచ్చిన డ్రైనేజీ నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో పలు ఇళ్ల గోడలు కూలాయి. నివాస ప్రాంతాలలోకి వర్షపునీరు చేరి జనాలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. అక్కడక్కడ డ్రైనేజీ, రహదారులు దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం మున్సిపాలిటీలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని 4,7,8,12 వార్డులలోను, బస్టాండ్, నేతాజీసర్కిల్ రోడ్డుమార్గంలోని డ్రైనేజీలను నివాసగృహాలను, వ్యాపార సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలవాసులు, మహిళలు, గత రెండు రోజులుగా వర్షపునీటి కారణంగా పడ్డ సమస్యలను ఎమ్మెల్యే ఎదుట మొరపెట్టుకున్నారు. అస్థవ్యస్థంగా వున్న డ్రైనేజీ కాలువలకు మరమతులు చేపట్టాలని, పూడికతో నిండిపోయిన డ్రైనేజీ కాలువలను తక్షణం అదనపు కార్మికులను తీసుకొని పారిశుద్యం చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజుకు, మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కొత్తపల్లె కోనేటి గుంత వద్ద డ్రైనేజీకి అదనపు వాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మహ్మద్ పురామసీదు వద్ద వున్న ట్రాన్స్‌పార్మ్‌ను ప్రజలకు ఇబ్బంది లేకుండా తగినంత ఎత్తులో ఏర్పాటు చేయించాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు. అలాగే బస్టాండు రోడ్డులో వ్యాపార కేంద్రాలకు ఎట్టువంటి ఇబ్బంది లేకుండా వేగవంతంగా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అదికారులకు తెలియజేశారు. అలాగే వర్షానికి గోడలు, ఇళ్లు కూలిన కుటుంబాలకు ప్రభుత్వం అర్ధిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజులలో అధికంగా వర్షాలు వున్నందున అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, కౌన్సిలర్లు పయాజుర్ రెహామాన్, చిల్లీస్‌పయాజ్, వైసీపీ నాయకులు జాకీర్ హుస్సేన్, అల్తాప్, ఎస్‌పీఎస్ రిజ్వాన్, రియాజుర్ రెహమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

టీడీపీ హయాంలోనే మైనార్టీలకు పెద్ద పీట



చెక్కలు పంపిణీ చేస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె: చంద్రబాబునాయుడు హయాంలోనే మైనార్టీలకు పెద్దపీఠ వేశారని మాజీ ఎమ్మెల్యే రాయచోటి టీడీపీ ఇన్‌చార్జీ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పందిళ్లపల్లెలోని మసీదులో పనిచేస్తున్న హజరత్ అబ్దుల్ సలీం అలాగే మౌజన్‌లకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మసీదులలో పని చేస్తున్న హజరత్‌లకు గౌరవేతనంగా రూ.5వేలు నెలనెల అలాగే మౌజన్‌లకు రూ.3వేల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా రాయచోటి నియెజకవర్గంలోని పందిళ్లపల్లెలో ఈ పథకాన్ని ప్రారంభించారు. అలాగే సబ్సిడీతో ఆరు మంది రైతులకు ట్రాక్టర్ మడకలను ఆయన పంపిణీ చేశారు. చంద్రబాబునాయుడు మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమపథకాలను ప్రవేశపెట్టారని ఏ ప్రభుత్వం చేయలేని విధంగా టీడీపీ ప్రభుత్వం చేస్తోందని నియోజకవర్గంలోని పాత మసీదుల మరమతులకోసం లక్షల రూపాయలు వేచ్చించారని ఆయన అన్నారు. మైనార్టీల అభివృద్ధికోసం మరెన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు రెడ్డిగపూర్, సెక్రటరీ మౌలాలీ, మాజీ కోఆప్షన్ సభ్యులు అజ్మతుల్లా, మైనార్టీ నాయకులు మదార్‌సాబ్, చిన్న పకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నాగులచవితి వేడుకలు

చిన్నమండెం : మండలంలో శ్రావణ శుక్రవారాన్ని పురష్కరించుకొని నాగల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయమే ఇళ్ళు వాకిళ్ళు శుభ్రంచేసుకొని ఇంటిళ్ళ పాది ఉపవాసాలు ఉండి నాగ రాళ్ళ వద్దకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేశారు. నాగపడిగల చుట్టూ ప్రదక్షిణలు చేసి దారాలు చుట్టారు. అనతంరం ప్రత్యేకంగా తయారు చేసిన దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. సమీపంలో పుట్టలలో పాలు పోసి ఉపవాసాలు తీర్చుకున్నారు. నువ్వుల చిమ్మిలి, చలివిండి, నానబియ్యం, మొలక సద్దలు పంచి పెట్టారు.



నాగపడిగలకు పూజలు చేస్తున్న మహిళలు

ఎమ్ఆర్ టీకాలు వేయించుకోవాలి

లక్కిరెడ్డిపల్లె: ప్రతి ఒక్కరూ ఎమ్ఆర్ టీకాలు వేయించుకోవాలని సీహెచ్‌వో శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కోనంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎమ్ఆర్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరికి మీజిల్స్, రూబిల్లా వ్యాధులు రాకుండా ఎమ్ఆర్ టీకాలను తప్పని సరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈవో రేఖానాయక్, మణి, సుబ్బయ్యలు పాల్గొన్నారు.

సకల జీవ రాశులకు మొక్కలే ప్రాణాధారం



ఎగువ అబ్బవరం సమీపంలో మొక్కలు నాటుతున్న కమిషనర్

రాయచోటిటౌన్: సకల జీవరాశులకు మొక్కలే ప్రాణాధారమని మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని రింగు రోడ్డునుంచి ఎగువ అబ్బవరం, కంచాలమ్మ గండి వరకు వృక్షరక్షణ సమితి అధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా 300 మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితులలో పర్యావరణం పూర్తి స్థాయిలో కాలుష్యం అయిందన్నారు. మొక్కలు నాటే వారి సంఖ్య తగ్గిందని, చెట్లను విచ్చల విడిగా నరికేస్తున్నారని తెలిపారు. దీంతో పర్యావరణ కాలుష్యానికి విఘాతం ఏర్పడి భవిష్యత్తులో మానవ మనుగడ కష్ట తరంగా మారుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలవారికి మంచి వాతావరణాన్ని, ఫలాలను అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వృక్ష రక్షణ సమితి అధ్యక్షుడు తులశీశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆనందరెడ్డి, పర్యావరణ ఇంజనీర్ రవి, వృక్షరక్షణ సమితి సభ్యులు బ్రహ్మానందరెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ మృతులకు
రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

చిన్నమండెం: చిన్నమండెం మండలం పడమటికోన దళితవాడలో డెంగ్యూ జ్వరంతో మృతి చెందిన రెడ్డిశేఖర్, బానుప్రకాష్ కుటంబాలకు మాన్యం తరహాలో రూ.5 లక్షల ఎక్స్‌గేషియా ప్రకటించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మండలంలోని పడమటికోన దళితవాడలో ఎమ్మెల్యే, మాజీ జడ్పీవైస్ ఛైర్మన్ దేవనాథరెడ్డిలతో శుక్రవారం కలసి పర్యటించారు. వరుసగా రెండురోజుల వ్యవధిలో డెంగ్యూ జ్వరంతో మృతి చెందిన రెడ్డిశేఖర్, బానుప్రకాష్‌ల కుంటుంబ సభ్యులతో కలసి మాట్లాడారు. జ్వరాలు ప్రభలడానిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇక్కడి పరిస్థితులను తెలియజేశారు. ఎమ్మెల్యే డిమాండ్‌పై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ప్రజలను చైతన్యం చేసి విశృతంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్నిశాఖలు సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. మృతులకు సంబంధించిన అన్నివివరాలను సేకరించి నివేధికలు ఉన్నతాధికారుల అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జీవి రమణారెడ్డి, వైద్యాధికారి మధుసూధన్ రెడ్డి, సర్పంచ్ జయమ్మ, వైఎస్ఆర్ సీపీ నాయకులు ఏజాస్, లోకనాధరెడ్డి, నాగశేషారెడ్డి, అక్రం, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్వరాలపై ఎమ్మెల్యేకి వివరిస్తున్న గ్రామస్తులు

కోనంపేటలో డ్రైనేజీ కాలువలు
ఏర్పాటు చేస్తాం



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

లక్కిరెడ్డిపల్లె: మండలంలోని కోనంపేట, బీఎరగుడి పంచాయతీలలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తామని ఎంపిడీవో రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్ర వారం బీ ఎరగుడి పంచాయతీలోని చంచర్లపల్లెలో పారిశుధ్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేకపనుల చేపట్టాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కోనంపేటలో మురుగు నీరు చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పారుతున్నాయని వీటిపైన పంచాయతీ నిమిత్తం డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్యారీన, ఈవోపీఆర్‌డీ ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి పద్మనాభరెడ్డి, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు

చిన్నమండెం : ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందని ఇప్పుడు లేదంటున్నారని విచారించి న్యాయం చేయాలంటూ దేవగుడిపల్లె గ్రామం కొండమూలకు చెందిన రైతులు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని దేవగుడిపల్లె పంచాయతీ పరిధిలోని కొండమూల గ్రామం చుట్టూ శ్రీమండెం లక్ష్మీనరసింహస్వామి మాన్యం భూములు ఉన్నాయి. సర్వేనెంబరు 12, 13లో 57 ఎకరాల మెట్ట భూమి ఉంది. ఈపొలాలను కొండమూలకు చెందిన 50 మంది రైతులు కౌలుకు తీసుకొని ఖరీఫ్‌లో వేరుశనగ పైరు సాగు చేశారు. వర్షాభావం కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. వీఆర్వో, గ్రాసేవకులు వచ్చి పంట సాగు వివరాలు నమోదు చేసుకువెళ్ళారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చింది. కొండమూలకు చెందిన కౌలు రైతులకు వారి ఖాతాలలో ఇన్‌పుట్ సబ్సిడీ జమ కాలేదు. ఈవిషయంపై శుక్రవారం రైతులు తహసీల్దార్‌కు తమ గోడు వినిపించారు. తమకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చవితికి సిద్ధమైన గణనాథుని ప్రతిమలు

పోరుమామిళ్ల: వినాయకచవితి పండుగకు బొజ్జగణపయ్య ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో విగ్రహాల తయారీదారులు నెల నుంచి వివిధ రకాల బొజ్జగణపయ్య ప్రతిమలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం గణపయ్య విగ్రహాలకు రంగులు అద్ది తదిమెరుగులు దిద్దుతున్నారు.



పేరుకే బద్వేలు మున్సిపాలిటీ

కనీస వసతులు కరువు

ఉపాధి పనులులేవు - అవకాశాలు లేవు

గోపవరం: మున్సిపాలిటీ కంటే పంచాయితీగా ఉన్నప్పుడే కనీస వసతులు ఉండేవి. మున్సిపాలిటీగా మార్చి పన్నుల గుదిబండ పెంచారే తప్ప ఒరిగిందేమీలేదని బద్వేలు మున్సిపాలిటీ గోపవరం పరిధిలోని వల్లెలవారిపల్లె ప్రజలు వాపోతున్నారు. తమ గ్రామా న్ని మున్సిపాలిటీలో కలపడం వలన ఉపాధిపనులు లేకపోగా ఎలాంటి అవకాశాలు రా వడం లేదన్నారు. కనీసం పారిశుధ్యంపైనైనా పట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపల్ సిబ్బంది ఈ పదేళ్లలో తమ గ్రామానికి వచ్చి న దాఖలాలు లేవంటున్నారు. పన్నుల వసూళ్లకు తప్ప మరే పనికి సిబ్బంది గ్రా మంలో తిరిగింది లేదని గ్రామస్థులు బాహాటంగా విమర్శిస్తున్నారు. గ్రామంలో ఎక్కడా డ్రైనేజీ కాల్వలు లేకపోవడంతో పారిశుధ్య సమస్య కొట్టువచ్చినట్లు కనపడుతోంది. ఇక వీధి దీపాల మరీ దయనీయంగా తయారైం ది. మున్సిపాలిటీ ఏర్పడి సుమారు పదేళ్లు కావస్తున్నా ఏ ఒక్క అభివృద్ధి చేపట్టలేదు. మున్సిపాలిటీలో గ్రామాన్ని కలపడం వలన ఉపాధి పనులు కూడా నిర్వహించే అవకా శం లేదని అధికారులు చెబుతున్నారు. అలాంటప్పుడు తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపడం దేనికని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కనీసం గుడిదగ్గర వీధిలైట్లు వేసే అవకాశం కూడా లేదంటే గ్రామంలో అభివృద్ధి పరిస్థితి ఏ విధం గా ఉందో అర్థం చేసుకోవచ్చని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామం చుట్టూ పంటపొలాలు ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, ఏ ఒక్కరోజు కూడా మున్సిపాలిటీ తరుపున దోమల నివారణకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవని వా రు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలి టీ అధికారులు, పాలక మండలి సభ్యులు గ్రామంపై ప్రత్యేక దృష్టిపెట్టి కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.



బోరింగ్ చుట్టూ మురికే, పారిశుధ్యం ఎరగని వల్లెలవారిపల్లె


పంచాయితీయే మేలు



పంచాయితీగా ఉన్న సమయంలోనే బాగుండేది. పేరుకు మాత్రమే మున్సిపాలిటీ పరిధిలో ఉంది. గ్రామంలో డ్రైనేజీకానీ, పారిశుధ్యంకానీ, వీధిలైట్లు కానీ మున్సిపాలిటీ వేసిన సందర్భమే లేదు. పన్నుల మోత తప్ప ఒరిగిందేమీలేదు.

- వెంకటసుబ్బారెడ్డి, వల్లెలవారిపల్లె

గుడి వద్ద వీధిలైట్లు వేయండి సారూ...



గ్రామంలో మిగతా సమస్యలు ఎలా ఉన్నా కనీసం గుడివద్ద అయినా వీధిలైట్లు వేయండి. దోమల మోతతో ఇబ్బంది పడుతున్నాము. దోమల నివారణకు చర్యలు చేపట్టండి.

- వెంకటరమణ, వల్లెలవారిపల్లె.

ఒక్కటీకాతో రెండు వ్యాధులు దూరం

పోరుమామిళ్ల: ఒక్కటీకాతో రెండు వ్యాధులు దూరమవుతాయని వైద్యాధికారులు అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది దాదాపు 850మంది విద్యార్థినీ విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ పాండురంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

కాశినాయన: వరికుంట్ల నాయునిపల్లె గ్రామాల్లో శుక్రవారం రైతుసేవలో రెవెన్యూ శాఖ కింద గ్రామసభలు నిర్వహించినట్లు ఆర్‌ఐ మోహన్‌రాజు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం వరికుంట్ల, సాయంత్రం నాయునిపల్లె గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 61వినతులు అందాయన్నారు. ఇందులో ఎక్కువ భాగం రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వమని కోరారన్నారు. మిగిలినవి భూముల ఆన్‌లైన్‌కు సంభందించినవన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మహేశ్వరరెడ్డి, వీఆర్ఏలు లాల్‌పీరా, నరసింహులు, పలువురు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

బద్వేలు: గోపవరం మండలం రామిరెడ్డిపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.రామక్రిష్ణయ్యను స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్.వెంకటరవణమ్మ, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఆయన బదిలీ కావడంతో ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు.

పరిపాలన ఎవరి కోసం : ఏఐటీయూసీ

పోరుమామిళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన తీరు ప్రజల కోసమా ? సాధువులు, సన్యాసుల కోసమా అని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఏఐటీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్నతీరు దారుణంగా ఉందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అంగన్వాడీలు పెంచే జీతాలు ఇవ్వకపోవడం, ఆశ కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయించుకుని వారి శ్రమను దోచుకుంటున్నారన్నారు. ఆటో కార్మికుల ఎఫ్‌సి రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులను 16 ఏళ్లగా పనులు చేయించుకుని కమీషన్లకు కక్కుర్తిపడి 80వేల మంది కార్మికులను రోడ్డునపడేసేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. జీఎస్టీపేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. ఇలాంటి ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేస్తామని, ప్రజలు మాకు దేవుళ్లని ప్రకటనలు తప్ప, ఆచరణలో చేసిందేమీ లేదన్నారు. సీపీఐ మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నేతలు పిడుగు మస్తాన్, రవికుమార్, రాజేంద్ర, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

బద్వేలు : ప్రభుత్వాస్పత్రిలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆస్పత్రి కమిటీ చైర్మన్ అశోక్‌కుమార్‌రాజు అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో వైద్యులతో, కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి మిగులు బడ్జెట్‌లో సుమారు రూ. 5.40లక్షలు నిధులు ఉన్నాయన్నారు. వాటిని ఖర్చుచేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో పురిటిబిడ్డలకు ప్రత్యేక గది నిర్మాణం ఏర్పాటు, వాతావరణం మార్పువల్ల దోమలు అధికంగా ఆస్పత్రిలోకి వస్తున్నాయని, కిటికీలకు మెస్, మరుగుదొడ్ల శుభ్రత, విద్యుత్తు సరఫరా, ఆస్పత్రిలో ఉన్న అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సివిల్‌సర్జన్ రాంప్రసాద్, వైద్యాధికారులు శిరీష, దుర్గాభవాణి, కమిటీ మెంబర్లు పుల్లారెడ్డి, ఫాతిమా, సుబ్బారెడ్డి, స్వరూప్, రామక్రిష్ణ, హుస్సేనయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వాస్పత్రి కమిటీ చైర్మన్ అశోక్‌కుమార్‌రాజు

రాజమ్మ సేవలు అభినందనీయం

పోరుమామిళ్ల: పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపులో, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయురాలు రాజమ్మ కృషిచేశారని మండల విద్యాశాఖాధికారి రఘురాము అన్నారు. శుక్రవారం టేకూరుపేట మండల పరిషత్తు పాఠశాలలో ఉపాధ్యాయురాలు రాజమ్మ బొప్పాపురానికి బదిలీ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీరయ్య, సూరిసిద్దుపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు, విద్యాకమిటీ చైర్మన్ రత్నస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

బద్వేలు	
శేఖర్	: గౌతమ్‌నంద
నౌషాద్	: ఫిదా
లక్ష్మీనరసింహ	: నక్షత్రం
పోరుమామిళ్ళ	
వెంకటేశ్వర	: ఫిదా
దేశాయి	: గౌతమ్‌నంద

అర్హులకు రుణాలు అందజేస్తాం

అట్లూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీల కార్పొరేషన్లకు సంబంధించి ఆన్‌లైన్ చేసుకున్న లబ్ధిదారులను పరిశీలించి అర్హులకు రుణాలు అందజేస్తామని ఎంపీడీఓ రెడ్డెయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో కార్పొరేషన్ రుణాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 147 దరఖాస్తులు రాగా, 77మంది హాజరయ్యారు. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 122 అప్లికేషన్లకు 53 మంది, ఎస్టీ కార్పొరేషన్‌కు సంబంధించి 9అప్లికేషన్లకు ఇద్దరు, మైనారిటీ కార్పొరేషన్ల కు సంబంధించి 10అప్లికేషన్లకు ఐదుగురు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో అట్లూరు, కమలకూరు, బద్వేలు బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

బద్వేలు టౌన్ : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరమని అగ్నిమాపక అధికారి ఓబులేసు అన్నారు. గురువారం స్థానిక ఫాతిమామాత స్కూల్లో అగ్ని ప్రమాదాలపట్ల అవగాహన చేపట్టారు. ఈసందర్భంగా వంటింట్లో వంట చేసేటప్పుడు గాలి, వెలుతురు వచ్చేట్లు చూసుకోవాలని, వంటగదిలో ఎలాంటి చిత్తుపేపర్లు కానీ, కిరోసిన్‌కాని ఉంచరాదని, మంటలు అంటుకున్నప్పుడు వాటిని ఎలా ఆర్పివేయాలో డెమో ద్వారా చూపించారు. బహుళ అంతస్థులలో మంటల్లో చిక్కుకున్నవారిని ఎలా కాపాడాలని అనేదానిపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసులు, భాస్కర్, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

30 కేజీల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

జమ్మలమడుగు: నగర పంచాయతీ పరిధిలోని దుకాణాలపై శుక్రవారం ఛైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు దాడులు జరిపి 30 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నామని టౌన్‌ప్లానర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజాద్‌బాష ఒక ప్రకటనలో తెలిపారు. షాపు యజమానులు ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించామని ఆయన కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ యాక్టు 1965 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

కరపత్రం ఆవిష్కరణ

ఎర్రగుంట్ల: ఇంటిస్థలాలు, పెన్షన్లు,ఎస్సీఎస్టీ,బీసీ మైనారిటీ రుణాలు మంజూరు చేయాలని 17.08.17న నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ కార్యవర్గం తెలిపింది. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

రాజుపాళెం: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, పారిశుధ్య నిర్మూలనకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ దివ్య అనుజ్ఞ తెలిపారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దివ్య అనుజ్ఞ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాటు చేస్తున్నామని, అదే విధంగా పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుని పనులు చేయించాలని అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు మొదలవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా అపరిశుభ్రత నెలకొంటే వెం టనే చర్యలు చేపట్టాలని కోరారు. విధుల్లో నిరక్ష్యం తగదని పేర్కొన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ సాగు చేసిన పంట పొలాలను జియోట్యాగ్ ద్వారా నమోదు


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దివ్య అనుజ్ఞ


చేసి ప్రభుత్వానికి పంపించాలని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి చేపట్టిన పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మంజుల, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, తహసీల్దారు కిరణ్‌జ్ఞానమూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంతో ఎస్‌హెచ్‌జీల బలోపేతం

- ఆర్‌పీల శిక్షణలో డీఆర్‌పీ జోసఫ్

ప్రొద్దుటూరు అర్బన్: సంస్థాగత నిర్మాణంతోనే ఎస్‌హెచ్‌జీలు బలోపేతమవుతాయని జిల్లా రీసోర్స్ పర్సన్ జోసఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక స్వశక్తి భవన్‌లో పట్టణంలోని 40 వార్డుల పరిధిలో పనిచేస్తున్న మెప్మా, ఆర్‌పీలకు సంస్థాగత నిర్మాణం, జీవనోపాధులపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు సంస్థాగత నిర్మాణంపై డీఆర్‌పీ జోసఫ్ మాట్లాడుతూ పేదరికంను నిర్మూలించడానికి పరధానంగా పేదల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై అధ్యయనం జరగాలన్నారు. ఇంటింటికి సర్వే చేసి ప్రతి డ్వాక్రా మహిళ కుటుంబ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సంఘాల్లోకి వచ్చిన మహిళలకు ఎలాంటి చైతన్యం అందించాలి, ఏయే పనులు చేపట్టాలనేది ఆర్‌పీలకు వ్యూహం ఉండాలన్నారు. దీనికితోడు సంఘం ఆర్థిక లావాదేవీలపై ప్రతి డ్వాక్రా సభ్యులకు అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా ప్రతి సభ్యురాలు బుక్ కిపింగ్ నేర్చుకునేలా ఆర్‌పీలు చొరవ చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి కుటుంబం రూ.10 వేలు ఆదాయం పొందేలా వారి జీవనోపాదులు మెరుగుపడేలా సభ్యులను తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఐబీ ప్రసాద్, మెప్మా ఇన్‌ఛార్జి టీఎంసీ హరిత, సీవోలు విమల, ఉష పాల్గొన్నారు.





జన్మభూమి కమిటీలను రద్దు చేయాలి

కడప, ప్రకాష్‌నగర్ : ప్రభుత్వ పథకాలు పేదలకు అంద కుండా అడ్డుపడే జన్మభూమి కమిటీలను రద్దు పరచాలని పీసీసీ అధికార ప్రతినిధి నీలిశ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చంద్రబాబు నియమించిన జన్మభూమి కమిటీల ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ వారికే పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు, జడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు కనీ స విలువలు లేకుండాపోయాయన్నారు. జన్మభూమి కమిటీలు ఇలాగే కొనసాగితే లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

రుణమాఫీ రైతుఖాతాలో జమచేయాలి

కడప, ప్రకాష్‌నగర్ : ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వెంటనే రైతుఖాతాలో జమ చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జిల్లాలో పూర్తిగా వేరుశనగ పంట నష్టపోయినా ఇంతవరకు ఇన్‌పుట్ సబ్సిడీ పంటలబీమా, ఇన్సూరెన్స్ రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, అన్వేష్, సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాసులు, మనోహర్, శివకుమార్, రైతు సంఘం సీకేదిన్నె నేతలు గోపాలక్రిష్ణ, శ్రీనివాసులరెడ్డి, పాపిరెడ్డి, మరియమ్మ, సుబ్బయ్య పాల్గొన్నారు.

కరువు భత్యం విడుదల

కడప, ఎర్రముక్కపల్లె : ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 2016 జులై 1 నుంచి కరువు భత్యం 18.34శాతం నుంచి 22.008శాతానికి పెంచుతూ రాష్ట్రప్రభుత్వం జీవో 140ను విడుదల చేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు.

'జగన్‌ను విమర్శించే అర్హత టీడీపీకి లేదు'


మాట్లాడుతున్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

కడప రూరల్: వైసీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక అర్హత టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి, చంద్రబాబునాయుడు, లోకేష్‌కు లేనేలేదని జడ్పీ వైస్ ఛైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీ ఆవరణలోని ఫోరం బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి నేటికి మూడేళ్ల కాలం పూర్తయినా ఎన్నికల మ్యానిఫెస్టోలోని ఒక్కటంటే ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదన్నారు. ఈ మూడేళ్ల కాలంలో జిల్లాకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈ విషయంలో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఇందుకు సమ్మతమేనా అని ఆయన సవాల్ విసిరారు. టీడీపీ మూడేళ్ల కాంలో ఏమిసిందో శ్రీనివాసరెడ్డి చెప్పకపోగా వారి అసమర్థత పాలననుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి జగన్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ ప్రచారం చేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకుడు భూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలకొండలో స్వామి వారి కల్యాణం

కడప, మారుతీనగర్ : శ్రావణమాసం సందర్భాన్ని పురస్కరించుకొని రిమ్స్ సమీపంలోని పాలకొండలలో వెలసిన శ్రీపాలకొండరాయ స్వామి వారి కల్యాణం శనివారం కన్నులపండువగా జరుగనున్నట్లు ఆలయ ఈవో ఎ.శ్రీధర్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల మధ్య కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల మెరవణి వుంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలి

కడప, క్రైం : బక్రీదు, వినాయకచవితి పండుగలను ముస్లిం, హిందువులు సోదర భావంతో కలిసి మెలిసి జరుపుకోవాలని కడప అర్బన్ సీఐ దారెడ్డి భాస్కర్‌రెడ్డి సూచించారు. కడప నగరం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన వివిధ మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతపెద్దలు పండుగ సమయాల్లో సంయమనం పాటించాలన్నారు. అనంతరం ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ పనితీరును వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐలు అమరనాధరెడ్డి, రుషేంద్రబాబు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా వుండాలి

దొంగతనాలు, దోపిడీలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని తాలూకా ఎస్‌ఐ రాజరాజేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని బాలాజీనగర్, చెమ్ముమియ్యపేట, కాగితాలపెంట, రవీంద్రనగర్, అక్కాయపల్లె తదితర ప్రాంతాల్లో లాగ్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.











వీరాంజనేయ స్వామి ఆలయంలో నేడు జాతర



జాతరకు ముస్తాబైన వీరాంజనేయ స్వామి ఆలయం, ఆంజనేయస్వామి విగ్రహం(ఇన్‌సెట్‌లో)

చిన్నమండెం : కోరిన వారి కొంగు బంగారం గావించే దేవుడిగా ప్రసిద్ధి చెందిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో నేడు జాతర నిర్వహిస్తున్నారు. కడప- చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన తుమ్మల గొంది బస్‌స్టాప్ వద్ద వీరాంజనేయస్వామి ఆలయం వెలసింది. ప్రతి ఏటా శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకొని మూడవ శనివారం ఈ ఆలయంలో జాతర నిర్వహిరచడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఉదయం నుంచేజాతర ఉత్సవాలు మొదలౌతాయన్నారు. జాతర సందర్భంగా స్వామివారి స్వస్తి వాచకము, గణపతి పూజ, అభిషేకం, ఆకు పూజ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రికి ప్ర త్యేక బృందంచే చెక్కభజనకార్యక్రమాలు ఉన్నాయని విరించారు.

సంప్రదాయబద్ధంగా
వరలక్ష్మీ వ్రతం

చిన్నమండెం : శ్రావణ శుక్రవారాన్ని పురష్కరించుకొని చిన్నమండెం మండలంలోని ముత్తైదువుల వరలక్ష్మీవ్రతాన్ని సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామునుంచే మండలంలోని మహిళలంతా ఇళ్ళు వాకిళ్ళు శుభ్రం చేసుకొని ప్రత్యేకంగా వరలక్షీదేవికి పూజలు చేశారు. కొత్తపల్లె సమీపంలోని మాండవ్యానది ఒడ్డున వెలసిన మల్లూరమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వత్రం చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఈక ార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, ముఖ్య కార్యనిర్వహణాధికారి మహేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు లక్షుమయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

పాలెం చెరువుకు గండి

సంబేపల్లె: జిల్లాలోనే వర్షపు నీటిపై ఆదార పడే రైతులు, బీళ్లు తలపిస్తున్న చెరువులు ఇలాంటి పరిస్థితులో ప్రకృతి కరుణించింది. వర్షం కురిసి చెరువునిండితే అధికారులు నిర్లక్ష్యంతో చెరువు గండి పడి ప్రతి ఎటా నీరు వృథాగాపోవడం తాత్కలిక మరమ్మతులు చెపట్టడం సహజపాటుగా మారింది. అది గున్నికుంట్లు గ్రామం పాలెం చెరువు ఆచెరువు కింద సుమారు 60 ఎకరాలు ఆయకట్ట భూమి కలదు గురువారం రాత్రి కురిసిన వర్షాలకు చెరువు నిండా నీరు చేరింది. పాలెం చెరువుకు 4 చోట్ల గండి పడడంతో చెరువులో నీరు వృథాగాపోతుంది. స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం తన సోంత డబ్బులుతో పాలెం చెరువు గండి పూడ్చపనులు చేపట్టారు. వరుసగా మూడు సంవత్సరాలు పాలెంచెరువు గండి పడింది. తాత్కలిక మరమ్మతులతో అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ ఏడాది మళ్లీగండి పడింది. మళ్లీ మూడేళ్లగా సర్పంచ్ సొంత నిధులతో పనులు చేస్తున్నా మన అధికారులు పూర్తి స్థాయిలో చెరువు పనులు పెట్టడంలేదు. ఒక్క సారి చెరువునీరు వృథాగాపోతే మళ్లి పకృతి సహకరిస్తే గాని నిండడం కష్టం ఇప్పటి కైన రైతులను కరువును దృష్టిలో పెట్టుకోని ప్రతి వర్షపునీటి బిందువును వడిసి పట్టాలంటే పనులను పూర్తి స్థాయిలో నాణ్యతగా చేపట్టాలంటున్నారు స్థానిక రైతులు.



జెసిబీతో గండి పూడ్చే పనులు చేపట్టిన సర్పంచ్

వివాదాస్పద భూమికి సర్వే

చిన్నమండెం : చిన్నమండెం రెవెన్యూ గ్రామం పరిధిలో వివాదాస్పదంగా ఉన్న ఉన్న భూమని శుక్రవారం జిల్లా సర్వేయర్ సర్వే చేశారు. చిన్నమండెం సర్వేనెంబరు 1791/12, 1801 సర్వేనెంబరులోని భూమి వివాదాస్పదంగా మారింది. స్థానిక సర్వేయర్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి వివాదానికి పరిష్కారం చూపారు. ఈమేరకు తహసీల్దార్ మల్లికార్జున అర్జీదారులకు ఎండార్సుమెంటు లేఖను ఇచ్చారు. అయితే ఈభూమి తమదేనని స్థానిక అధికారులు తమకు అన్యాయం చేశారని బాధితులు జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయించాలని కోరారు. వివరాలలోకి వెళితే...చిన్నమండెం కస్బాకు చెందిన అలీబాషాకు సర్వేనెంబరు 1791/12, 1801లోని 9,10,11,12 లెటర్లలో డీకేటీ పట్టా ఉంది. ఇతడి పొలంలో సాదిక్‌వల్లి అనే వ్యక్తి అక్రమంగా బోరు వేయడమే కాకా మొక్కలు నాటారని తన పొలం సరిహద్దులు చూపాలని అలీబాషా తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈభూవివాదం సమస్యగా తయారైంది. రెండు వర్గాల మద్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వివాదస్పద భూమి సమస్య పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ఈనెల 12 సర్వే చేసి నివేదికను తహసీల్దార్‌కు ఇచ్చారని తెలిపారు. వీరి నివేదిక ఆధారంగా సాదిక్‌వల్లి వేసిన బోరు 1801 సర్వేనెంబరులో ఉందని, ఈనెంబరు భూమిలో సాదిక్‌వల్లీకి ఎలాంటి హక్కులేదని నిర్ధారిస్తూ తహసీల్దార్ మల్లికార్జున అర్జీ దారులకు ఎండార్సుమెంటు ఇచ్చారు. అయితే బాధితులు తమకు అన్యాయం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో తిరిగి శుక్రవారం జిల్లా సర్వేయర్ వచ్చి సర్వే చేశారు.

గతంలో సర్వేయర్ చూపిన హద్దులనే ఈయన చూపారని తెలిపారు. నివేధికను కలెక్టర్‌కు ఇస్తామని అక్కడి నుంచి తహసీల్దార్‌కు వస్తాయని ఇరువర్గాలు అప్పుడు నివేదికను తీసుకోవచ్చని తెలిపారు.

చంద్రబాబుతోనే మైనార్టీల అభివృద్ధి

రాయచోటిటౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు హాయాంలోనే ముస్లీం మైనార్టీల అభివృద్ధి జరిగిందని టీడీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శి వతనిస్సార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాణా వద్ద మసీదు కమిటీ గటదులలో 7వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్ఎ మతీన్, ప్రధాన కార్యదర్శి అతావుల్లా ఖాన్, పైరోజ్ ఖాన్‌లు వతన్‌నిస్సార్‌ను శాలువా, గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హాయాంలో మైనార్టీలు అన్ని విదాలుగా అభివృద్ధి సాదించారన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

రాయచోటి	9985411187
రాయచోటి టౌన్	9441794427
రాయచోటిరూరల్	9676860131
సంబేపల్లె	9703163108
గాలివీడు	9441049010
చిన్నమండెం	8886297090
లక్కిరెడ్డిపల్లె	8897095884
రామాపురం	9441079032

ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

రాయచోటిటౌన్: గత 20 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిస్కారం కోసం ఈ నెల 16వ తేదీన చేపట్టనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూఈఈయూ రాష్ట్ర ఉపాద్యక్షుడు సుబ్రమణ్యం రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో రాయచోటి డివిజన్ స్థాయి కాంట్రాక్ట్ విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయవాడ కార్యక్రమానికి రాయచోటి డివిజన్ నుంచి విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూఈసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్,శ్రీనివాసులు, యూఈఈయూ జిల్లా కార్యదర్శి సుదర్శనరెడ్డి, ఎఐటీయూసీ, 1104, మైనార్టీ, వైఎస్ఆర్ టీయూసీ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్ఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధులు దూరం

రాయచోటిటౌన్ : ఎమ్ఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధులైన తట్టు, రుబెల్లాలు దూరమౌతాయని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు బయారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజుల కాలనీలో గల ఇంటర్‌నేషనల్ మెరిట్ హైస్కూల్ విద్యార్థులకు ఎమ్ఆర్ వ్యాక్సిన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యండపల్లె వైద్యాదికారి సునీల్‌కుమార్‌నాయక్, కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్‌రెడ్డి, పాఠశాల ఉపాద్యాయులు పాల్గొన్నారు.
సంబేపల్లెలో... సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ వేణుగోపాల్‌రెడ్డి ప్రదానోపాధ్యాయుడు ఎస్‌వి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దజెంగంపల్లె పాఠశాలలో ఎమ్ఆర్ వ్యాక్సిన్ పిల్లలకు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎమ్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన రుణాల ఇంటర్వ్యూలు

గాలివీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు వర్గాలకు చెందిన సబ్సిడీ రుణాల కోసం వెయ్యి మంది ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో 200 దరఖాస్తులు మాత్రమే ఎంపీడీవో కార్యాలయానికి చేరాయని, శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 120 మంది మాత్రమే హాజరు కావడం జరిగిందని తెలియజేశారు.

నడిగడ్డపల్లె పాఠశాలకు కుర్చీలు, బల్లలు వితరణ

చిన్నమండెం : మండలంలోని నడిగడ్డపల్లె ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన గంగిరెడ్డి, పెద్దిరెడ్డిలు రూ.10వేల విలువగల బల్లలు, కుర్చీలు, ర్యాక్‌లు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామస్థులు తమ పాఠశాల, తమ ప్రభుత్వ కార్యాలయాలు తమవిగా బావించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో అరలు లేక కుర్చీలు, బల్లలు లేక సమస్యగా ఉండేదన్నారు. ప్రస్తుతం అవి సమకూరడంతో సమస్య తీరిందన్నారు. వీరిని మరికొందరు ఆదర్శంగా తీసుకొని పాఠశాలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయడు, గ్రాస్థులు, దాతలు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం పై పోలీసులకు పిర్యాదు

రాయచోటిటౌన్ : పట్టణంలోని పాతరాయచోటికి చెందిన మండ్ల మల్లికార్జున అనే యువకుడు అనంతపురం జిల్లా బళారిలో అదృశ్యం అయినట్లు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రాయచోటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 3వ తేదీన మండ్ల మల్లికార్జున మరో వ్యక్తితో కలిసి అనంతపురం జిల్లా బళారిలోని సౌమ్యనాథస్వామి దేవస్థానం దర్శనం కోసం వెల్లాడు అక్కడ గుడిలో నిద్రిస్తూ వున్నట్లుండి అదృశ్యమయ్యాడని పిర్యాదులో తెలిపారు. వారం రోజులుగా బళారి ప్రాంతం, బందువుల ఇండ్ల వద్ద వేతికినా ఆచూకి లేదని ఫిర్యాదులో వివరించారు.



మల్లికార్జున

సినిమా గైడ్

రాయచోటి

ప్రసాద్	: జయ జానకి నాయక
గౌతమ్	: నేను రాజు నేనే మంత్రి
సాయి	: లై
సోనీరాజ్	: నక్షత్రం

గాలివీడు

పావని	: బాహుబలి-2

సురక్షిత నీటిని అందించడమే ధ్యేయం

ఇంటర్వ్యూ

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ



అట్లూరు : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సురక్షిత నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ పేర్కొన్నారు.

ప్రశ్న : వర్షాకాలంలో తాగునీటి సమస్యలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల్లో తాగునీటి సరఫరా అయ్యే పైపులైన్ల లీకేజీలను అరికట్టి ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: ఉపరితల జలాశయాలను ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రపరుస్తారు ?

జ : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ఉపరితల జలాశయాలను 15 రోజులకు ఒక్కసారి శుభ్రపరుస్తున్నాం.

ప్రశ్న: క్లోరినేషన్‌పై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ : మండల పరిధిలో తాగునీటి సరఫరా అయ్యే మోటార్ల ద్వారా వచ్చే నీటిని ప్రతి రోజూ క్లోరినేషన్ మిషన్‌తో నీటిని చెక్‌చేయాలని సర్పంచ్‌లకు ఆదేశించాం.

ప్రశ్న : మండలంలో తాగునీటిని సరఫరా చేసే మోటార్లు ఎన్ని ఉన్నాయి ?

జ: మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి తాగునీటికి సరఫరా చేసే 98 మోటార్లు ఉన్నాయి.

ప్రశ్న: మరుగుదొడ్డి నిర్మాణాలు ఎన్ని చేపట్టారు ?

జ : మండల పరిధిలో ఆర్‌డబ్ల్యూఎస్ కింద 225 మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టాం.

ప్రశ్న: పెన్నానది ద్వారా తాగునీటిని సరఫరా చేసే పైపులైను వేసే సర్వే ఎంత వరకు వచ్చింది ?

జ : పెన్నానది ద్వారా తాగునీరు అందించే పైపులైన్ సర్వే జీపీఎస్ పూర్తిచేసి గుంటూరుకు సర్వే నివేదికను పంపడం జరిగింది.

ప్రశ్న: వర్షాకాలంలో సురక్షిత తాగునీటి కోసం జాగ్రత్తలు తీసుకోవాలి ?

జ : మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన ప్రజలు వర్షాకాలంలో పైపులైన్ లీకేజీలను నివారించుకుంటే మురుగునీరు కాకుండా సురక్షిత నీరు అందుతుంది. పైపులైన్ లీకేజీలను అలానే ఉంచుకుంటే వర్షాకాలంలో వర్షపునీరు పైపులైన్లలోకి వెళ్లి బురద నీరు వస్తుంది. దీంతో వ్యాధులబారినపడే అవకాశం ఉంది.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి



కాశినాయన మండలంలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న ఏఈఓ ధనలక్ష్మి

కాశినాయన : రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఈవోలు రవి, ధనలక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం వీరు మండలంలోని నర్సాపురం, ఉప్పలూరు, ఓబుళాపురం, పిట్టిగుంట, తదితర గ్రామాల్లో ముమ్మరంగా ఈ-క్రాస్ బుకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు గ్రామానికి వచ్చిన వ్యవసాయశాఖ సిబ్బందికి సహకరించి సాగుచేసిన పంటల వివరాలతో పాటు పట్టాదారు పాసుపుస్తకం ఖాతానెంబర్, ఆధార్‌నెంబర్ ఫోన్‌నెంబర్ల వివరాలను తెలపాలన్నారు. మండలంలో 1800 హెక్టార్ల మేర కంది, పత్తి, సజ్జ, మొక్కజొన్న, జనుములు, పెసలు తదితర పంటలను సాగు చేశారని, ఇందులో ఇప్పటి వరకు 370 హెక్టార్లను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేశారన్నారు.

ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఏపీడీ

గోపవరం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని ఏపీడీ హరినాథ్ శుక్రవా రం తనిఖీ చేశారు. ముందుగా మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డితో కలసి ఏపీడీ పరిశీలించారు. రాచాయిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల ప్రాంగణానికి మట్టితోలే పనులను పరిశీలించి పాఠశాలకు అనువుగా ఉండేలా ప్రాంగణాన్ని తయారు చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.
మండలంలో జరుగుతున్న పనుల వివరాలను, కూలీలకు చెల్లిస్తున్న కూలి వివరాలతోపాటు అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నరసింహులు, ఈసీ శివశంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముంపువాసులు సర్వేకు సహకరించాలి



ఆర్డీఓ వీరబ్రహ్మంను అడిగి సర్వేవివరాలను తెలుసుకుంటున్న స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావు

అట్లూరు : సోమశిల ప్రాజెక్టు వెనుకజాలాలతో ముంపునకు గురవుతున్న చింతవాండ్లపల్లె, వరికుంట, మల్లినేనిపట్నం గ్రామాలకు సంబంధించిన ప్రజలు అధికారులు నిర్వహించే సర్వేకు సహకరించాలని స్పెషల్ కలెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముంపు గ్రామాల్లో 2వ రోజు జరుగుతున్న సర్వేను స్పెషల్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలు పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి పరిహారం అందించాలని కలెక్టర్ చొరవచూపుతున్నారని అన్నారు. సర్వేను అడ్డుకోకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సర్వేలో ఎటువంటి అవకతవకలు జరగవన్నారు. ప్రతి ఇంటికి సంబంధించిన అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి సర్వేచేసి నివేదిస్తామని తెలిపారు. బాధితులకు నష్టపరిహారం విషయంలో తప్పక న్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఈ గ్రామాల్లో ఎన్ని గృహాలు ఉన్నాయో అధికారులకు తెలుసన్నారు. ఒకవేళ సర్వేను అడ్డుకుంటే ఎప్పటికీ నష్టపరిహారం అందించేందుకు ఏ అధికారి ముందుకు రారని తెలిపారు. కనుక ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి, ఇంటికి సంబంధించిన వివరాలన్నీ అధికారులకు తెలియజేసి నష్టపరిహారం పొందేందుకు సహకరించాలన్నారు. ఒక వేళ సర్వేచేయించుకోకపోతే వారికి పరిహారం అందే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీరబ్రహ్మం, తహసీల్దార్ ఈశ్వరయ్య, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

కాశినాయన : ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీలకు మండలం నుంచి 65మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోగా, 35మంది వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారని మండల విద్యాధికారి బాలఓబయ్య తెలిపారు. 21 మంది పక్క మండలాలకు వెళ్లగా, మిగిలిన వారు మండలంలోనే ఇతర పాఠశాలలకు వెళ్లాలన్నారు. కాశినాయన మండలానికి కొత్తగా 36మంది ఉపాధ్యాయులు 10మండలాల నుంచి వచ్చారన్నారు. వీరంతా శుక్రవారం తమకు కేటాయించిన పాఠశాలలో చేరిపోయారని తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

బద్వేలు టౌన్ : ఏఐఎస్‌ఎఫ్ 82వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి 4రోడ్ల కూడలి వరకు విద్యార్థినులతో ఏఐఎస్‌ఎఫ్ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందే ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అనిల్, సాయి, శివరామ్, హర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలి

బద్వేలు టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక జేవీభవన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లస్థలాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని కరపత్రాలు విడుదల చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శులు జకరయ్య, చంద్రమోహన్‌రాజు, రంతుల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మీసేవ ద్వారా ఇ-పాసుపుస్తకాలు పొందవచ్చు



గ్రామసభలో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటున్న మహిళా రైతు

గోపవరం : రైతులు భూములకు సంబంధించిన ఇ-పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్‌ను మీ సేవా ద్వారా పొందవచ్చని తహసీల్దార్ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శోత్రియం రామాపురంలో రైతుసేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూములకు సంబంధించి మ్యూటేషన్‌కు 2, భూముల ఆన్‌లైన్‌కు 3 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. మీసేవా ద్వారా రైతులకు కావాల్సిన ఇ-పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్‌లను రూ.25 చెల్లించి వెంటనే పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. మీసేవా ద్వారా పొందిన ఈ ధ్రువపత్రం అన్నింటికి ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో గతంలో గ్రామసభల ద్వారా భూసమస్యలను 90శాతం పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హరి, సర్వేయర్ ఓబయ్య, వీఆర్వో జగదీశ్వరరెడ్డి, ఏఎస్ఓ అర్జున్‌రావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా ఇచ్చారు.... భూములు చూపించండి సారూ



గ్రామసభలో అర్జీలు ఇస్తున్న రైతులు

బి.కోడూరు : మాకు పట్టాలు... పాసుబుక్కులు మంజూరు చేశారు... కానీ ఇంత వరకు భూములు చూపించలేదని తంగెడుపల్లె గ్రామానికి చెందిన మహిళలు తహసీల్దార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని తంగెడుపల్లెలో రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని తహసీల్దార్ గురివిరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలకు 121 సర్వేనెంబర్‌లో 6సంవత్సరాల క్రితం పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మాకు భూములు చూపించలేదని గ్రామసభలో తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన సర్వేయర్‌కు వెంటనే సర్వేచేసి వారికి భూములు చూపించాలని ఆదేశించారు. ఆపై గ్రామసభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భూముల ఆన్‌లైన్, అడంగల్‌కానీ ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. ఇంటిస్థలం లేని వారు ఈ గ్రామసభలో అర్జీలు ఇవ్వాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ వీరబ్రహ్మం, వీఆర్వోలు అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించండి

జమ్మలమడుగు రూరల్: రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించాలని ఏరువాక సమన్వయ కర్త అంకయ్యకుమార్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగులో వ్యవసాయ కార్యాలయంలో 'ఆత్మ' ఆర్థిక సహాయంతో జీవన ఎరువులు, దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువుల వాడకంతో దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసాచారి మాట్లాడారు. రీసోర్స్ అసోసియేషన్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డి, ఎఈవో దస్తగిరి, లక్ష్మన్న, చెన్నకేశవరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ఈ సమస్యకు పరిష్కారమే లేదా?

● వర్షపునీటితో నిండిన ఎర్రగుంట్ల వినాయకనగర్ రోడ్లు

ఎర్రగుంట్ల: వినాయకనగర్‌లోని వర్షపునీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. వినాయకనగర్ సున్నపుబట్టీల పక్కనే ఉన్న వీధులు ప్రధాన రోడ్డుకన్నా తగ్గులో ఉన్నాయి. దీంతో వర్షపు నీరంతా బయటికి వెళ్లేందుకు మార్గం లేక వీధుల్లోనే నిల్వ ఉంటున్నాయి. ఈనీరు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజల జీవనానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా ఈ సమస్యలను పాలకులకు, అధికారులకు అనేకసార్లు చెప్పారు. వారినే అక్కడికి తీసుకెళ్లి పరిష్కరించమని కాలనీవాసులు కోరారు. అయినాఇప్పటికి శాశ్వత పరిష్కారం చేయలేదు. వర్షం వచ్చిందంటే చాలా వీధుల్లో మోకాటిలోతు నీరు నిలుస్తోంది. వారాలతరబడి ఈనీరు అలాగే ఆగిపోయి కంపు కొడుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. దోమలు వ్యాప్తిచెందుతున్నాయని, విషజ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగే ఎర్రగుంట్లలోని శాంతినగర్, రాణివనం, మరికొన్ని వీధుల పరిస్థితి వుంది. వీటిపై పాలకవర్గం ఇప్పటికైనా దృష్టిపెట్టాలని వారు విన్నవిస్తున్నారు.



వాన నీటితో నిండిన వీధి

భూ సమస్యల పరిష్కారానికి సదవకాశం

పెద్దముడియం: రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూశాఖ అనే కార్యక్రమం ఒక చక్కటి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు షఫి ప్రజలను కోరారు. మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామంలోని శివాలయంలో రైతు సేవలో రెవెన్యూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు అధికారుల దృష్టికి భూ సమస్యలు తీసుకొచ్చారు. తమ పాస్‌పుస్తకాల్లోని వివరాలకు, కంప్యూటర్ అడంగల్‌లోని వివరాలకు వ్యత్యాసాలు ఉన్నాయి. అనుభవంలోకంటే రికార్డుల్లో వేరుగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు కోరారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే సమస్య ఉన్న రైతులందరూ పొలం సర్వే చేయించుకుంటే పరిష్కారం లభిస్తుందని ఇన్‌చార్జి తహసీల్దారు చెప్పారు. గ్రామానికి చెందిన సర్వే నంబరు 784కు సంబంధించిన రైతులు సమస్యను అధికారుల దృష్టికి తేగా పొలం సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని రైతులందరూ సర్వేకు సహకరించాలని, సర్వేయర్ సర్వేకొరకు పొలం వద్దకు వచ్చేసరికి రైతులందరూ వారికి వారికి సంబంధించిన రికార్డులను తీసుకురావాలన్నారు. ఇవేకాక ఏ చిన్న సమస్య వచ్చినా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు. మండలంలో చాలా చోట్ల గ్రామంలో ఉన్న భూమి కంటే అధికంగా విస్తీర్ణం కంప్యూటర్ అడంగల్‌లో నమోదైందని, రైతులు సహకరిస్తే అధిక విస్తీర్ణం ఉన్న పొలాల్లో సర్వే చేయించి వాస్తవ విస్తీర్ణాన్ని రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో జరిగే రైతు సేవలో రెవెన్యూ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ హరిప్రసాద్, వీఆర్వో చంద్రమోహన్, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుండ్లకుంటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, ప్రజలు

సబ్సిడీ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండలంలోని రూరల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఎంపీడీవో సభాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు 69యూనిట్లకు 268మంది దరఖాస్తు చేసుకోగా 116 మంది హాజరు అయ్యారు. బీసీ కార్పొరేషన్‌కు 40యూనిట్లకు 206 మంది దరఖాస్తు చేసుకోగా 108 ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కాపు కార్పొరేషన్‌కు 30యూనిట్లకు 113 మంది దరఖాస్తు చేసుకోగా 50మంది హాజరయ్యారు. ఎస్టీ కార్పొరేషన్‌కు నాలుగు యూనిట్లు మంజూరు కాగా 15 మంది దరఖాస్తుచేసుకోగా ఐదుగురు మాత్రమే హాజరయినట్లు ఎంపీడీవో శివకుమారి తెలిపారు. ఎస్‌బీఐ చీఫ్‌మేనేజర్ రామక్రిష్ణ, ఎఫ్ఓ అంజిరెడ్డి, ఏపీజీబీ పొట్లదుర్తి, చిలమకూరు అధికారులు, సూపరిండెంట్ సూర్యనారాయణరెడ్డి, కమిటిమెంబర్లు మోహన్‌రెడ్డి, చిన్ననారాయణమ్మ, ఓబులేసు, వెంకటరమణనాయక్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

కొండాపురం : ఆర్తి ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై నాలుగు రోజుల పాటు శిక్షణ నిర్వహించిన అనంతరం శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. 16 మంది యువతులకు ఎంపీడీఓ అమర్‌నాథరెడ్డి సర్టిఫికెట్లు, బ్యాగులు అందజేశారు. హెచ్ఎం ఈశ్వరయ్య, ఆర్తిలు కరిముల్లా, రవి, కౌన్సిలర్ రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ సరఫరా

కొండాపురం : చౌటిపల్లె, లావనూరు, రామచంద్రనగర్, రేపల్లె తదితర చోట్ల 196 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ కవిత ఆధ్వర్యంలో పిల్లలకు టీకాలు వేయించారు. సీహెచ్ఓ మధుకుమార్, దేవదాసు, బాలనరసింహులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా చిన్నారుల ఆటల పోటీలు

మైలవరం: మండల పరిధిలోని చిన్నకొమెర్ల, పెద్దకొమెర్ల నవాబుపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దాల్మియా ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జనపై పెయింటింగ్, వ్యాసరచనపోటీలు, పరుగు పందెం, మ్యూజికల్ ఛైర్, ఖోఖో తదితర ఆటల పోటీలను విద్యార్థులచే ఆడించారు. గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో దాల్మియా సీఎస్ఆర్ విభాగాధిపతి రాజశేఖర్‌రాజు, గురుదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెం నిర్వహిస్తున్న దృశ్యం

మాల మృత వీరులకు ఘనంగా నివాళి

కొండాపురం : మండలంలో మాల మృత వీరులకు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా మాలమహానాడు ప్రధాన కార్యదర్శి మనోహర్‌బాబు ఆధ్వర్యంలో ఇంతకుముందు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి హక్కుల కోసం పోరాడి మృతిచెందిన మాల మృత వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. హక్కుల కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన వారు చిరస్మరణీయులని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు జయంత్, గిరి పాల్గొన్నారు.



నేటి నుంచి భీమగుండంలో శ్రీకృష్ణ మందిర ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరం

పెద్దముడియం: మండల పరిధిలోని భీమగుండం గ్రామంలో గ్రామ మొదట్లో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిర ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజులపాటు ఘనంగా జరుగనున్నాయి. 12వ తేదీన ఉదయం 9 గంటలకు గణపతి ఆవాహనం, కలశప్రతిష్ఠ, జలాధివాస కార్యక్రమంతో ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ప్రారంభం అవుతుంది. 13వ తేదీ ఆదివారం ఉదయం కలశరాధన, మధ్యాహ్నం రెండు గంటల నుంచి గ్రామోత్సవం జరుగుతుంది. అదే రోజు రాత్రి 9 గంటలకు శూలం ధర్మరాజు యాదవ్ బృందం వారిచే శ్రీకృష్ణ జననం కథ ఉంటుంది. 14వ తేదీ సోమవారం విగ్రహ స్థపన కార్యక్రమం, శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా జరిగేందుకు ఏర్పాట్లు జరిగాయి. రాత్రి 8 గంటల మైలవరం కృష్ణయ్య బృందం వారిచే గొప్ప భజన కార్యక్రమం ఉంటుంది. 14, 15 తేదీల్లో అన్నదాన కార్యక్రమం కూడా పెద్ద ఎత్తున జరుగనుంది. 15వ తేదీ మంగళవారం శ్రీకృష్ణ ప్రతిమ పల్లకి గ్రామోత్సవం ఉంటుంది. ఈ మందిర ప్రతిష్ఠ మహోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను గ్రామ కమిటీ చేస్తుంది. 14వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి ట్రాక్టర్ రివర్స్ పందెం జరుపబడునని, ఆశక్తిగలవారు పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది. ఈ ప్రతిష్ఠ మహోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

పంద్రాగస్టు పతాకావిష్కరణకు ఎంపీటీలను ఆహ్వానించండి

ఎర్రగుంట్ల: పాఠశాలల్లో స్వాతంత్ర్యదినోత్సవం నాడు పతాకావిష్కరణ కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీలను కూడా ఆహ్వానించాలని, గౌరవించాలని స్కూల్ఎడ్యుకేషన్ కమిషనర్ కే.సంధ్యారాణి నుంచి మరోసారి ఆదేశాలు జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు పంపారు. పాఠశాలలో సర్పంచి, ఎంపీటీసీలు కూడా పతాకాన్ని ఎగురవేసేందుకు గతంలో ఎమ్మెల్సీ యలమంచిలిబాబూ రాజేంద్రప్రసాద్ వ్రాసిన లేఖకు బదులుగా ఈ లేఖను వ్రాసినట్లు సమాచారం. రెండు పాఠశాలలుంటే ఒకచోట సర్పంచి, మరోచోట ఎంపీటీసీ జాతీయపతాకాన్ని ఆవిష్కరించేందుకు ఆహ్వానించాలని ఈ సందర్భంగా కోరారు.

విద్యార్థి సంఘాలపై అక్రమ కేసులు బనాయించడం తగదు

కడప, ఎర్రముక్కపల్లె : విద్యార్థి సంఘాలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఏఐఎస్ఎ జిల్లా కార్యదర్శి డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. కడప ఎన్జీవో హోంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు కొనసాగుతున్నాయన్నారు. కనీసం జాతీయగీతం పాడించేందుకు కూడా స్థలం లేకుండా వున్నాయని ఆరోపించారు. బాత్రూమ్‌లు తలపించేలా తరగతి గదులు, కనీస విద్యార్హత లేని ఉపాధ్యాయులతో నడిపిస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ మామూళ్లమత్తులో జోగుతోందన్నారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థలు ఒక పెద్ద మాఫియాగా కొనసాగుతున్నాయన్నారు. తక్షణం విద్యాసంఘ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రరెడ్డి, డీజీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుధీర్, ఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి రమణయ్య ప్రసంగించారు. ఏఐఎస్‌ఎ యోగేశ్వరరెడ్డి, ముబారక్, రవి, రాజేష్, డీజీహెచ్‌పీఎస్ నాగరాజు,ఏసుబాబు పాల్గొన్నారు.

శాంతియుతంగా చవితి ఉత్సవాలు నిర్వహించుకోండి

కడప, క్రైం : వినాయకచవితి పండుగను నిర్వాహకులు శాంతియుతంగా నిర్వహించుకోవాలని తాలూకా ఎస్ఐ రాజ రాజేశ్వరరెడ్డి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో శుక్రవారం వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పకుండా పోలీసుల అనుమతి పొందాలన్నారు.నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించినా అల్లర్లకు పాల్పడినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నిమజ్జనం సందర్భంగా పాటించాల్సిన విషయాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

రిటైర్డు ఆర్ఎస్ఐ గుండెపోటుతో మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఆర్ ఏఎస్పీ

కడప, క్రైం : ఇటీవల పదవీవిరమణ పొందిన ఆర్ఎస్ఐ ఎస్వీ రమణ శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ ఆదేశాల మేరకు ఏఆర్అదనపు ఎస్పీ రిషీకేశవరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ మురళీధర్ మృతుని నివాస గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

ఆర్థిక వ్యవస్థను బలపరచండి: స్వామీజీ

కడప, మారుతీనగర్ : విద్యతో సృజనాత్మకతను పెంపొందించుకొని దేశ ఆర్థిక వ్యవస్థను బలపరచాలని చిన్మయమిషన్ స్వామీజీ షణ్ముక చైతన్య విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల డైరెక్టర్ తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంకితభావంతో చదివాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ రాజోలి సాయిశరణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి బంగారుభవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, చైర్మన్ రాజోలివీరారెడ్డి పాల్గొన్నారు. కాగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హుషారుగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు


వరుస సెలవులు...గ్రామాలకు పయనం




కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండు

కడప, సెవెన్‌రోడ్స్ : నేటి నుంచి వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ఉద్యోగుల కుటుంబాలు సొంత ఊళ్లకు, బంధువుల ఊళ్లకు పయనమయ్యారు. శుక్రవారం కడప ఆర్టీసీ బస్టాండు కిక్కిరిసింది. రెండో శనివారం, ఆదివారం, సోమవారం క్రిష్ణాష్టమి మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. బుధవారం ఒకరోజు సెలవు పెట్టుకుంటే ఐదురోజులు ఆనందంగా గడపవచ్చన్న అభిప్రాయంతో ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో గ్రామాలకు పయనమయ్యారు. ఇలాంటి అవకాశాల కోసం ఉద్యోగుల కుటుంబాలు ఎదురుచూస్తూ వుంటాయి. దూర ప్రాంతానికి వెళ్లాలనుకున్న వారు వారం ముందే రిజర్వేషన్ చేసుకోవడం గమనార్హం.


బస్సుల కోసం ఎదురుచూపులు...


సీటు కోసం ప్రయాణికుల పాట్లు



'ఆఫీసర్స్ క్లబ్‌పై దాడులు దారుణం'


మాట్లాడుతున్న ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ రామచంద్రారెడ్డి

కడప, రవీంద్రనగర్ : కడప ఆఫీసర్స్ క్లబ్‌పై ఇటీవల కాలంలో పోలీసుల దాడులు చేయడం దారుణమని ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ రామచంద్రారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన ఆఫీసర్స్ క్లబ్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాకు చెందిన పలువురు అధికారులతో పాటు ప్రముఖులు సభ్యత్వం కలిగి వున్నారని పేర్కొన్నారు. ఈ క్లబ్‌లో జిమ్‌తో పాటు వివిధ క్రీడాంశాలకు సంబంధించిన కోర్టులు వున్నాయని హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి రిటైర్డు అధికారులు కాలక్షేపం కోసం 13 కార్డుల రమ్మీని ఆడుకుంటూ వుంటారని చెప్పారు.రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఈ మేర గుర్తింపు ఇచ్చిందన్నారు. కాగా ఆఫీసర్స్ క్లబ్‌లో ఏవో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లుగా పోలీసులు పలుమార్లు దాడులు నిర్వహించడం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. క్లబ్ సీనియర్ ప్రతినిధి ఎస్.గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు సూచనలు ఆదేశాల మేర 13కార్డుల రమ్మీ ఆడుకోవచ్చని అయితే పోలీసులు మాత్రం పదే పదే దాడులు చేయడం బాధాకరమన్నారు.తాము ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకుపోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆఫీసర్స్‌క్లబ్ సభ్యులు, రిటైర్డు అధికారులు,అధికారులు పాల్గొన్నారు.

14న విజయ దుర్గాలయంలో శ్రీకృష్ణాష్టమి

కడప, మారుతీనగర్ : విజయదుర్గాలయంలో 14వ తేదీ శ్రీకృష్ణాష్టమి వేడుకలు సంస్కృత భాషా సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల చిన్నారులు రాధాకృష్ణులు వేషాలతో ఆలయానికి తీసుకురావాల్సిందిగా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. వేషాలతో వచ్చిన చిన్నారులకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు ఉట్టి మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9000408250ను సంప్రదించాలన్నారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సుమంగళిపూజలు

కడప, మారుతీనగర్ : నిత్య సుమంగళి, సర్వలోక జనని, ఆదిపరాశక్తి విజయ దుర్గాదేవి. ఆ చల్లని తల్లి సన్నిధిలో శ్రావణ మాసం శుక్రవారం సుమంగళిపూజచేసి తరించారు. విజయదుర్గాదేవి సన్నిధిలో శుక్రవారం కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రత్యేక మండపంలో అర్చకుడు ఫణిభూషణశర్మ స్త్రీలతో కుంకు మార్చనలు చేయించారు. ఈ సందర్భమగా అమ్మకు తెల్లవారు ఝూమున 5 గంటలకు విశేష పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకారం చేశారు. ఉదయం 10.30 గంటలకు కుంకు మార్చనలు సాయంత్రం మహామంగళహారతులు, పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు.


పూజలు చేస్తున్న భక్తులు

అధిక లోడు రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోండి

సింహాద్రిపురం: వినియోగదారులు అధిక లోడుకు రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని ఏఈ రమేష్‌రెడ్డి కోరారు. ఇప్పటికే పలు నోటీసులు పంపడం, వినియోగదారులకు వివరించామన్నారు. వినియోగదారులు ఈనెల 20లోపు అధికలోడును క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ వారు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలన్నా, కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటుచేయాలన్నా, పాతవి మార్పు చేయాలన్నా వినియోగదారులు ఈ రుసుము కట్టాల్సి ఉంటుందన్నారు. 16,17 తేదీల్లో సింహాద్రిపురంలో ప్రత్యేక సిబ్బంది ద్వారా అధిక లోడు రుసుము వసూలు చేస్తామన్నారు.

గ్రామసభలకు చట్టబద్ధత లేదు

ఓపెన్ ఫోరంలో ఆగ్రహించిన జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ఓపెన్ ఫోరంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి, ఏపీడీ సురేష్, హాజరైన అధికారులు

సింహాద్రిపురం: ఉపాధి హామీలో జరిగే గ్రామసభలకు చట్టబద్ధత లేదని జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓపెన్ ఫోరంలో అధికారులపై ఫిర్యాదు చేస్తూ ఆగ్రహించారు. శుక్రవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై 11వ విడత సోషల్ ఆడిట్‌పై నిర్వహించిన ఓపెన్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో జరిగే పనుల గురించి స్థానిక సర్పంచులు కోఆర్డినేషన్ మీటింగ్ జరపాల్సి ఉంది. అలాంటిది ఎక్కడా జరగడం లేదని ఆయన ఆరోపించారు. కనీసం జడ్పీటీసీకి కూడా సమాచారం లేకుండా గ్రామసభలు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమకుంట్ల ఉపాధి పనులపై చెర్లోపల్లెకు చెందిన సోషల్ ఆడిట్ సీఆర్పీ పలు విషయాలపై కామెంట్లు చేయడంపై గ్రామస్థులు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ ఆడిట్ వారు చిన్న చిన్న విషయాలను బూతద్దంలో చూడడం వారికి మామూలే అన్నారు. రాయలసీమ శిక్షణ శిబిర డైరెక్టర్ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ ఆడిట్ సమయంలో అందరినీ దొంగల్లా చూడడం భావ్యం కాదన్నారు. సోషల్ ఆడిట్ బృందం వారు ఎంతసేపూ వ్యతిరేక భావనతోనే తప్పులు చూపించాలనే తపన తప్ప ఉన్న విషయాలను కూడా వారు ఆమోదించకపోవడం దురదృష్టకరమన్నారు.

కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

ఉపాధి హామీ గ్రామసభలకు హాజరుకాని కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీచేస్తారని అడిషనల్ పీడీ సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధి హామీలో పనుల పర్యవేక్షణ సక్రమంగా ఉండాలన్నారు. గ్రామసభల్లో ఎంపీడీఓ తర్వాత ప్రధాన పాత్ర గ్రామకార్యదర్శులదేనన్నారు. అలాంటి బాధ్యత గల వారు గ్రామసభలకు వెళ్లకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా 20 పంచాయితీల్లో జరిగిన పనులపై గ్రామసభలో ఆడిట్ బృందం తప్పొప్పులను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీడీ నాగరాజు, క్వాలిటీకంట్రోల్ వేణుగోపాల్, ఏపీఓ విజయభాస్కర్, అధికారులు, ఆడిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి నూతన విగ్రహ ప్రతిష్ఠ

వేముల: వేముల యాదవవీధిలో 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా 14వ తేదీ సోమవారం సాయంత్రం గణపతి పూజ, 15న గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, ప్రోక్షణ, మాతృకాపూజ, ఋత్విగ్వరణం, ప్రధాన కలశస్థాపన, నవగ్రహ, వాస్తుమండలారాధన, మూలమంత్ర జపము, యంత్రాలకు రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 17వ తేదీ ప్రాతఃకాలపూజలు, మహాస్నపనం, ఆవాహిత దేవత హోమాలు, గణపతి, రుద్ర, నవగ్రహ మూలమంత్ర హోమాలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామోత్సవం ఉంటుందన్నారు. 17వ తేదీ శుభకన్యాలగ్న పుష్యరాంశములో యంత్రప్రతిష్ఠ, శిఖర, కలశ, శ్రీసీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందన్నారు. అనంతరం కళ్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అదేరోజు అన్నదానం ఉంటుందన్నారు. కావున భక్తులు ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనాలని గ్రామస్థులు కోరారు.

గండికి చేరిన భక్తులు



గండిలో షెడ్ల కింద సేదతీరుతున్న భక్తులు

చక్రాయపేట: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మూడో శ్రావణ శనివారం పురస్కరించుకుని భక్తులు శుక్రవారమే గండికి చేరుకున్నారు. వర్షం కురుస్తుందనే అనుమానంతో భక్తులు షెడ్ల కింద సేదతీరుతున్నారు. ఏర్పాట్లను సహాయ కమిషనర్ గురుప్రసాద్, ఛైర్మన్ రాజారావు, పాలక మండలి సభ్యులు వెంకటస్వామి, శంకర్‌రెడ్డి పర్యవేక్షించారు. వేంపల్లెకు చెందిన సహదేవరెడ్డి అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. మరో ఇద్దరు కూడా అన్నదానం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్నానపు ఘట్టాల వద్ద మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తడికలతో గదులను ఏర్పాటుచేశారు. క్యూలైన్లు, విద్యుత్ అలంకరణలు పూర్తిచేశారు. మూడో వారం రద్దీ ఎక్కువగా ఉంటున్న ఉద్దేశంతో ముందుగానే అదనపు కౌంటర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

పదవీ వ్యామోహంతో మాట్లాడుతున్న జగన్

పులివెందుల టౌన్: రాష్ట్ర ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ వ్యామోహంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని పులివెందుల మార్కెట్ యార్డు ఛైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన విరుచుకు పడ్డారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు వివరణ ఇచ్చిన రెండు రోజులకే మళ్లీ చంద్రబాబునాయుడుపై సభలో దారుణంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ మాత్రం అభివృద్ధి అడ్డుకుంటూ, ముఖ్యమంత్రి కావాలని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. జైలుకు పోతాననే భయంతో, ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో చంద్రబాబునాయుడుపై మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2019లో పులివెందుల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మోగిస్తుందన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే లక్ష్యం

పులివెందుల టౌన్: నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే లక్ష్యమని కడప గ్రామీణ వికాస్ కేంద్రం అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని డీఆర్‌డీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. అందులో భాగంగా కడప, అనంతపురం, ప్రకాశం, నల్గొండ జిల్లాల్లో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తున్నామన్నారు. తమ కేంద్రం ద్వారా చీనీ చెట్ల నుంచి గోలికాయ సైజు కాయలు రాలిపోయినప్పుడు వాటిని కొనుగోలు చేయాలన్నదే ఆశయమన్నారు. దీంతో రైతుకు అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో కడప గ్రామీణ వికాస్ కేంద్రం కోఆర్డినేటర్ నాగులయ్య, ఏపీఎం హరిప్రసాద్, జాబ్స్ ఎగ్జిక్యూటివ్ అధికారి పృథ్వీ, జాబ్ రిసోర్స్ పర్సన్ బద్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణయూనిట్లకు ముగిసిన ఇంటర్వ్యూలు

వేంపల్లె: వేంపల్లె మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా ఈ ఏడాది మంజూరుచేయాల్సిన రుణయూనిట్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండు రోజులుగా ఎంపీడీఓ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఆయా బ్యాంకు అధికారులు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం స్టేట్ బ్యాంక్, ఎస్‌బీహెచ్, సిండికేట్ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించగా శుక్రవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అలవలపాడు, ఆంధ్రాబ్యాంకు అధికారులు ఇంటర్వ్యూ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్‌లకు సంబంధించి 224 రుణయూనిట్లకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

చక్రాయపేటలో...

చక్రాయపేట: ఎంపీడీఓ కార్యాలయంలో సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీఓ విజయమ్మ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ రకాల రుణాలకు 930 మంది దరఖాస్తు చేసుకోగా 200 మందిని ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా ఈ రుణాలను మంజూరు చేశారు. చక్రాయపేట ఏపీజీ బ్యాంకు ఆధ్వర్యంలో 122, స్టేట్ బ్యాంక్ 30, బిటిపల్లె బ్యాంకు 52 యూనిట్లు మంజూరయ్యాయి. మేనేజర్లు పాల్గొన్నారు.

తొండూరులో...

తొండూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ జయరామయ్య, ఎంపీడీఓ మల్లీశ్వరి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు మండలంలోని నిరుద్యోగులు 288 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ తెలిపారు.

16న రుణాలకు ఇంటర్వ్యూలు

పులివెందుల టౌన్: ఈనెల 16వ తేదీ బుధవారం నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

గండికి పాదయాత్ర

లింగాల: మూడో శ్రావణ శనివారం పురస్కరించుకుని పలువురు మండల ప్రజలు గండికి పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా మహిళలు, యువకులు అనే తేడా లేకుండా లింగాల నుంచి శుక్రవారం ఉదయం దాదాపు 80 మంది దాకా వెళ్లారు. వీరు రాత్రికి గండి చేరుకుని శనివారం ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తారు. వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె, కర్ణపాపాయపల్లె తదితర గ్రామాల నుంచి పాదయాత్రగా గండికి వెళ్లారు. వీరికి లింగాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి భోజన సదుపాయం ఏర్పాటుచేశారు.



గండికి పాదయాత్రగా బయలు దేరిన ప్రజలు

గాయపడిన దూడకు వైద్యం



వైద్యపరీక్షలు చేస్తున్న కాంపౌండర్ భాస్కర్‌రెడ్డి

వేంపల్లె: గాయాలతో రోడ్డుపై పడిఉన్న ఆవుదూడకు స్థానికులు జోక్యం చేసుకుని వైద్యం చేయించారు. స్థానిక కాపువీధిలో వీపునకు, కాలుకు తీవ్ర గాయాలై పడుకుని బాధపడుతున్న దూడను మురుకూటి రామాంజనేయరెడ్డి భార్య జ్యోతి గమనించింది. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కాంపౌండర్ భాస్కర్‌రెడ్డి చేరుకుని దూడకు వైద్యచికిత్స చేశారు. మందులు కూడా తెప్పించారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో రెండు జబ్బులు నయం

దువ్వూరు: 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఎంఆర్ టీకాలు వేయడం ద్వారా తట్టు, రూబెల్లా వ్యాధులు ధరి చేరవని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దువ్వూరులోని 9 అంగన్వాడీ కేంద్రాల్లో 299 మంది పిల్లలకు టీకాలు వేశారు. మండల వ్యాప్తంగా 96 శాతం పిల్లలకు టీకాలు వేశామని, మరో రెండు రోజుల్లో మిగతా పిల్లలందరికి టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్బరత్నమ్మ, ఆరోగ్య విస్తరణాధికారులు శివరామయ్య, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు మునిస్వామి, సూర్యకాంతమ్మ పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి... పుట్టా



ఉర్దూ జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు : ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో వచ్చానని, నా అదృష్టమని.. ప్రజలు, కార్యకర్తలు సమష్టి కృషితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో అదనపు గదుల కోసం ఆయన రూ.5లక్షలు విరాళంగా అందచేశారు. ఈసందర్భంగా గదుల నిర్మాణభూమి పూజ లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతం లో ఉన్న ప్రజా ప్రతినిధులు చేయనటువంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు పోతున్నామని తెలిపారు. ముస్లిం విద్యార్థులకు ముఖ్యంగా బాలికలు జూనియర్ కళాశాల లేక పోవడంతో చదువు మానుకునే వారని, అటువంటి సమయంలో వారి కోరిక మేరకు కళాశాల మంజూరు చేయించానని తెలిపారు. అనుకున్న రీతిలో కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో అదనపు గదుల నిర్మాణానికి రూ.5లక్షల సొంత నిధులతో గధులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే నియోజకవరానికి 2500 ఇళ్ళు మంజూరు చేశామని, అర్హులైన లబ్ధిదారులు ఒక్క నయాపైస కూడా లంచం ఇవ్వకుండా తీసుకోవాలని కోరారు. సిమెంట్‌రోడ్లు, మురుగు కాలువలుకు ప్రత్యేక నిధులు తెప్పిస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు నాయకులు ముక్తియార్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పుట్టా సుధాకర్‌యాదవ్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగసింహా, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ బీపీ సుధాకర్‌రెడ్డి పార్టీ నాయకులు కటారు కృష్ణ, ఆకుల కృష్ణయ్య,డీలర్ రామచంద్ర పాల్గొన్నారు.

2019 ఎన్నికల్లో గెలిపిస్తాం : ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం కృష్టి చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్‌ను 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించి తీరుతామని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. ఉర్దూ జూనియర్ కళాశాల, మసీదుల మరమతులకు నిధులు, కాలనీల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు ఇలా అన్ని వసతులు కల్పిస్తున్నారని కొనియాడారు. ఉర్దూ కళాశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి గదుల నిర్మాణం కోసం సొంత నిధులు కేటాయించడం అభినందనీయమని మైనార్టీ నాయకులు నాయబ్, డాక్టర్ షబ్బీర్, షరీప్, షౌకత్ ఆలీ, గౌస్‌పీర్, అమీర్ తదితరులతో పాటు మత గురువులు పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి

దువ్వూరు : మండలంలోని ప్రతి రైతు భూసమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మండల తహసీల్దారు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్న సింగనపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో రైతు సేవలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సం దర్భంగా 8అర్జీలు ఆన్‌లైన్ నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ గ్రామ సభల ద్వారా రైతులకు చాలా కాలం నుండి పరిష్కారం కాని పలు సమస్యలను అధికారులే ఇంటి వద్దకు వచ్చి భూ సమస్యలను పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. గ్రామ సభలను రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు.

వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడి మృతి



బాధిత కుటుంబానికి అర్థిక సాయం చేస్తున్న సుధాకర్

దువ్వూరు: దువ్వూరు మండల వాసవీక్లబ్ మండల అధ్యక్షుడు పేర్ల శ్రీనివాసులు గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వాసవీ క్లబ్ గవర్నర్ కొండపల్లి శివ, డిప్యూటీ గవర్నర్ తల్లం సుధాకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. వాసవీ క్లబ్ అభివృద్ధికి శ్రీనివాసులు ఎనలేని కృషి చేశారని, అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బద్వేలు ట్రెజర్ బచ్చు సుధాకర్, స్థానిక క్లబ్ సభ్యులు బి.సత్యనారాయణ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్ టీకా బాల బాలికలందరికీ వేయాలి



టీకా కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు అమరేంద్ర సింగ్

ఖాజీపేట : 9 నెలలు నిండి 15 ఏళ్ల లోపు బాల బాలికలందరికీ ఎమ్మార్ టీకా వేయాలని, టీకా అందని వారు వుండకూడదని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ అమరేంద్ర సింగ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పేరారెడ్డి కొట్టాలు గ్రామ సమీపంలోని ఆదర్శపాఠశాల కూనవారిపల్లెలోని టీకా కేంద్రాలను శుక్రవారం ఆయనతో పాటు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.కొండయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు అంటు రోగాలు ప్రబలకుండా టీకాలు అందించాలన్నారు. టీకా వేయించుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు కూడా అందిస్తారన్నారు. మండలంలోని ప్రజలు టీకాపై అవగాహన పొంది వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. టీకా కార్యక్రమంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు ఎమ్.రాఘవయ్య, పి.శివశంకర్ రెడ్డి, సిహెచ్‌ఓ భారతి, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వరలక్ష్మీ వ్రతం





ప్రత్యేక అలంకారంలో అమ్మవారు వరలక్ష్మి, కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మైదుకూరు : పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. సూర్యోదయత్ పూర్వమే ఆలయ ప్రధాన అర్చకులు బోయకుంట్ల సత్యనారాయణ శర్మచే వాసవీమాత మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రతాన్ని ప్రత్యేక అర్చకులు కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన వింజమర శ్యాం శర్మచే నిర్వహించారు.

అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు వంకధార శ్రీవాణి, బచ్చు దేవి, నూకల జయలక్ష్మి, వందవాసి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల ప్రతిష్ఠ మహోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న కోదండరామస్వామి ఆలయ చైర్మన్, మెంబర్లు

దువ్వూరు: దువ్వూరు కోదండరామస్వామి దేవాలయం ప్రాంగణంలో శుక్రవారం శ్రీసంతాన నాగుల ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఆలయ చైర్మన్ తోట గురప్ప ఆద్వర్యంలో నాగుల ప్రతిష్ఠ కోసం గణపతి పూజ, పుణ్యాహవాచకం, అభిషేకాలు, హోమాన్ని నిర్వహించారు. ముందుగా పుట్టమన్ను కోసం బీమ లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో ఊరేగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మైదుకూరులో ఓ మోస్తరు వర్షం



సర్వాయపల్లె అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు

మైదుకూరు : మైదుకూరులో గురువారం అర్థరాత్రి.. శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. నెల రోజులుగా పదును వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలకు ఈవర్షం కొంత ఊపిరి పోసింది. పొలాల్లో వర్షం నీరు నిలవడంతో పంట సాగుకు సమాయత్తం అవుతున్నారు. అలాగే ప్రధాన వీధుల్లో కూడా పలు చోట్ల వర్షపునీరు నిలిచింది. సరైన డ్రైనేజీ సౌకర్యం లేక పోవడంతో పాదాచారులు, వాహనదారులు కొంత ఇబ్బందులు పడ్డారు. సర్వాయపల్లెకు వెళ్లే రహదారిలో అండర్ బైపాస్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలబడటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

గండికి పాదయాత్ర

లింగాల: మూడో శ్రావణ శనివారం పురస్కరించుకుని పలువురు మండల ప్రజలు గండికి పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా మహిళలు, యువకులు అనే తేడా లేకుండా లింగాల నుంచి శుక్రవా రం ఉదయం దాదాపు 80 మంది దాకా వెళ్లారు. వీరు రాత్రికి గండి చేరుకుని శనివారం ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తారు. వెలిదండ్ల, తాతిరెడ్డిపల్లె, కర్ణపాపాయపల్లె తదితర గ్రామాల నుంచి పాదయాత్రగా గండికి వెళ్లారు.

సినిమాగైడ్

మైదుకూరు

విజయ్	: లై
భారత్	: నేనే రాజు నేనే మంత్రి
వెంకటేశ్వర	: జయ జానకి నాయక

ఖాజీపేట

రాజ్	: నక్షత్రం

దువ్వూరు

రాయల్	: శతమానం భవతి

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తెలపాలన్నా, ఇతరత్రా సమాచారం ఇవ్వాలన్నా 'ఆంధ్రజ్యోతి'ని ఈ క్రింది నెంబర్లలో సంప్రదించండి.

మైదుకూరు	9985402559
మైదుకూరు రూరల్	9966229965
ఖాజీపేట	9440925739
దువ్వూరు	9908951022
చాపాడు	8143585271
బ్రహ్మంగారిమఠం	8008965652

ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించాలి

కొండాపురం :ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవించాలని కొండాపురం సీఐ చిన్నపెద్దయ్య అన్నారు. సిరిగేపల్లెలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కళాజాతలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కడప నుంచి వచ్చి న కళాజాత బృందం అధ్యక్షుడు సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ఫ్యాక్షన్‌పై ప్రదర్శన ఇచ్చారు.తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం ఎస్‌ఐలు కృష్ణయ్య, శివప్రసాద్‌రెడ్డి, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.


సిరిగేపల్లెలో కళాజాత నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల నుంచి ఇడుపులపాయకు వెళ్లిన జగన్


ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు

జమ్మలమడుగు రూరల్: రాష్ట్రప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నంద్యాలలో ఎన్నికల ప్రచారం ముగించుకుని రాత్రి జమ్మలమడుగు మీదుగా ముద్దనూరు, పులివెందుల ద్వారాఇడుపులపాయ ఎస్టేట్‌కు వెళ్లారు. రాత్రి 8.35 గంటలకు జగన్ జమ్మలమడుగు నుంచి కాన్వాయ్ వెళ్లింది. ప్రతిపక్ష నేత జమ్మలమడుగు మీదుగా వస్తున్నాడని ఆకస్మికంగా తెలియగానే అక్కడక్కడ వైసీపీ కార్యకర్తలు, నాయకులు రోడ్లపైకి చేరుకున్నారు.ఆయన జమ్మలమడుగులో ఆగకుండా వెళ్లిపోయారు. జమ్మలమడుగు అర్బన్ సీఐ ప్రవీన్ కుమార్, సిబ్బంది బందోబస్తుగా వెళ్లారు.

మద్యం దుకాణాలను తొలగించాలి

ప్రొద్దుటూరు క్రైం : భగత్‌సింగ్ కాలనీలో నిబందనలకు విరుద్ధంగా ప్రక్కప్రక్కనే ఏర్పాటు చేసిన రెండు మద్యం దుకాణాలను ఇక్కడి నుంచి తొలగించాలని సీపీఎం, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం భగత్‌సింగ్‌కాలనీ మద్యం దుకాణాల వద్ద అయా సంఘాల ప్రతినిధులు, మహిళలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హైవే రోడ్డుకు సమీపంలోనే భగత్‌సింగ్‌కాలనీలో రఘురామిరెడ్డి వైన్స్, మినీ గోసుల వైన్స్‌లకు అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి అనుమతి ఇచ్చారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రాందీ షాపులు ఉన్న రోడ్‌ను స్టేట్ హైవేగా మార్చి సర్టిఫికెట్ ఇచ్చినా, ఆ రెండు మద్యం దుకాణాలను ఎందుకు మూయలేదని ప్రశ్నించారు. ఈ మద్యం దుకాణాలను ఇక్కడి నుంచి తొలగించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. సీపీఎం నాయకులు సత్యనారాయణ, పీడీఎస్‌యు నాయకులు రమేష్, ఓబులేసు, బీఎస్ఎఫ్ నాయకులు జయరాజ్, సుబ్బు, ఎన్ఎస్‌యు నాయకులు చంద్ర, దస్తగిరి, ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసింహులు, పుల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.


మద్యం దుకాణాలను తొలగించాలంటూ ఆందోళన చేస్తున్న సీపీఎం, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు, మహిళలు

రెండు వ్యాధులకు ఒకే టీకా

పెద్దముడియం: మ్యూజిల్స్, రూబెల్లా ఈ రెండు వ్యాధులకు ఎంఆర్ టీకా ఎంతో ఉపయోగపడుతుందని పెద్దముడియం వైద్యాధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎన్.కొట్టాలపల్లె, చిన్నపసుపుల, ఉలువపల్లె, జె.కొత్తపల్లె, ఉప్పలూరు, బలపనగూడూరు గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది ఎంఆర్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 290 మంది చిన్నారులకు సిబ్బంది టీకాలు వేశారు. కొట్టాలుపల్లెలో జరిగిన టీకా కార్యక్రమానికి సురేష్‌రెడ్డి హాజరై టీకాలు వేసే విషయంలో సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. 9 నెలల నుండి 15 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు ఆయా గ్రామాల్లో జరిగే ఎంఆర్ టీకా కార్యక్రమంలో తల్లిదండ్రులు తప్పకుండా టీకా వేయించాలని సురష్‌రెడ్డి తెలిపారు. సూపర్‌వైజర్లు బాష, ఓబులేసు, ఎఎన్ఎంలు శాంతకుమారి, నాగమ్మ, గురమ్మ, పుష్పలత, ప్రశాంతి, దేవామణి, ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మట్కా బీటర్ల అరెస్టు

ముద్దనూరు: స్థానిక పాత బస్టాండులో శుక్రవారం సాయంత్రం మట్కా నిర్వహిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. గైబూ సా హెబ్, రమణయ్యలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,150 నగదు, మట్కా పట్టిలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చదువుతో నిమిత్తం లేకుండా లైసెన్స్‌లు

పులివెందుల టౌన్: చదువుతో నిమిత్తం లేకుండా ఆటో రిక్షా డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ ఇస్తామని ఎంవీఐ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వాసవీమాతకు విశేష పూజలు

ప్రొద్దుటూరు టౌన్: చతుర్మాసవ్రత దీక్షలను పురష్కరించుకుని స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో లక్ష కుంకుమార్చన, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 108 ఆర్యవైశ్య సుహా సినిలతో లక్ష కుంకు మార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య పీఠాధిపతి, శ్రీసం స్థాన్ హాళదీపుర మఠాధిపతి వామనాశ్రమ మహాస్వామిజీ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అమ్మవారిని శోభా యమానంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్, కార్యదర్శి మురికి నాగేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.



సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు భారీ స్పందన


కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు భారీగా హాజరైన జనం


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు, బ్యాంకర్లు, ఎంపీపీ

ముద్దనూరు:స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీ కార్పోరేషన్ రుణాల మంజూరు కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు భారీ స్పందన లభించింది. ఎంపీపీ కళావతి అధ్యక్షతన ఇంటర్వ్యూలు ఎంపీడీఓ సూపరెంటెండెంట్ రమణయ్య నిర్వహించారు.మొత్తం 147 యూనిట్‌లకు 442 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 323 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎస్టీ రుణాలకు 3 యూనిట్‌లకు 10 మంది అభ్యర్థులు ,ఎస్సీ రుణాలకు 34 యూనిట్‌లకు 92 మంది అభ్యర్థులు, బీసీ రుణాలకు 45 యూనిట్‌లకు 155 మంది అభ్యర్థులు, కాపు రుణాలకు 60 యూనిట్‌లకు 68 మంది అభ్యర్థులు, మైనారిటీ రుణాలకు 5 యూనిట్‌లకు 8 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ముద్దనూరు, చిలమకూరు, కొండాపురంలోని వివిధ బ్యాంకుల అధికారులు, మండల ప్రత్యే క అధికారి ఇన్నయరెడ్డి హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు అబ్దుల్ ఖాదర్, శివరామిరెడ్డి, ఎంపీటీసీలు ఆదిలక్షుమ్మ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో పరిశుభ్రత ఏదీ?

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఆవరణంలో పరిశుభ్రత కరువైంది. మురుగునీరు, వర్షపునీరు నిల్వచేరడంతో కార్యాలయం వెనుక భాగం మురికికుంటలాగా మారింది. వ్యర్థ పదార్థాలు, కంపచెట్ల, గడ్డి మొక్కలు మొలిచాయి. శుభ్రత పాటించాల్సిన అధికారులు నిర్లక్ష్యం నీడలో పట్టించుకోవడం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందిగా ఉందని కార్యాలయంలోని ఉద్యోగులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రత పాటించాలని ప్రకటనలు చేసే అధికారులే ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శిలున్నాయి. ఇప్పటికైనా అధికారులు కార్యాలయ ఆవరణం వెనుక భాగాన్ని ఎత్తు పెంచి నీళ్ల నిలబడకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విన్నవిస్తున్నారు.

రైతుల సమస్యల కోసం రెవెన్యూ సదస్సులు

వల్లూరు : రైతుల భూ సమస్యలు వుంటే వాటిని అక్కడికక్కడే పరిష్కారం చేయడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని డిప్యూటీ తాహసీల్దార్ ప్రసాద్ అన్నారు.

శుక్రవారం పెద్దపుత్త గ్రామంలో రైతుల వద్దకు రెవెన్యూశాఖ వచ్చిందనివారికి సంబంధించిన ఆన్‌లైన్ పొరపాట్లు, 1 బి తదితరవాటికి పరిష్కారం తెలుపుతామన్నారు. అనంతరం రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను తొలగించారు. ఈ సభలో ఆర్ఐ లక్ష్మీప్రసన్న, సర్వేయర్ వేణుగోపాల్, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వకు కేంద్రాల్లోనే గోడౌన్‌లు

మండల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.శివారెడ్డి

చెన్నూరు : మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రాలోనే ధాన్యం నిలువకు గోడౌన్‌లు ఏర్పాటు చేయిస్తానని కడప మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి అన్నారు. ఎంపీడీవో సభాభవనంలో ఎంపీపీ మిట్టపల్లె బాలమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధి పరంగా చేసే పనుల కోసం రూ.1.20 కోట్లు వుందన్నారు. ప్రస్తుతం రూ. 30 లక్షల నిదులు వున్నాయన్నారు. అందువల్ల పెండ్లిమర్రి, చెన్నూరులో రైతు బజారులతో పాటు గోడౌన్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో వున్నామని త్వరలో కార్యరూపం దాల్చుతుందన్నారు. రైతులు పండించిన ధాన్యంను వడ్డీ లేకుండా 120 రోజుల వరకు మార్కెట్‌యార్డులో ఉచితంగా నిల్వ చేసుకోవడంతో పాటు అనంతరం అప్పటి మార్కెట్ విలువను బట్టి ధాన్యం ధరలో 75 శాతం రుణంగా ఇస్తామన్నారు. చెన్నూరు వద్ద కేసీకెనాల్ అంతా రకాలవ్యర్థాలతో నిండిందన్నారు. పరిస్థితి ఇలాగే వుంటే చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం వుందన్నారు. ఆ కాలువను శుభ్రం చేయడంలో కేసీ అధికారులు, ఉపాధి సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. మండల ఉపాధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి 8 ట్రాక్టర్లు రైతుల కోసం మంజూరుచేసిందని రెండో దఫా ఇంకొందరికి ఇస్తుందన్నారు. ఎస్‌డబ్ల్యుఎం కింద ప్రతి పంచాయతీలో స్థలాలు వుండేట్లు చూస్తామన్నారు. వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కేసీకి నీరు రాక వర్షం సరిగా లేని కారణంగా రైతులు రబీలో జొన్న, శనగ పంటలు సాగుచేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ గురురాజ ప్రసాద్ మాట్లాడుతూ ఓడీఎఫ్ లేని గ్రామాల్లో కట్టే మరుగుదొడ్లకు ఆలస్యంగా నిధులు వస్తాయన్నారు. తాహసీల్దార్ సత్యానందం మాట్లాడుతూ ఇంటి స్థలాల కోసం దౌలతాపురం ప్రాంతంలో పరిశీలన చేస్తున్నామని ఒకవేళ స్థానికంగా దాతలు భూమిఇస్తే ప్రభుత్వ ధరకు కొనుగోలు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ బాలమ్మ, ఎంపీడీవో మహబూబ్‌బీ, జడ్పీటీసీ ఉమాదేవి, హౌసింగ్ ఏఈ గోపాలకృష్ణ, గ్రామ పంచాయతీ రీసోర్స్ పర్సన్ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు రాజేశ్వరి బాషు, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, రాజేశ్వరి, రామలక్షుమ్మ, ఎంఈవో క్రిష్ణమూర్తి, పశు వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఈవోఆర్‌డీ పరమేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ పద్మావతి, ఏపీవో రేష్మా, ఏపీఎం రాధిక, భారతి, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, హజరైన అధికారులు

చైర్మన్‌కు సన్మానం

రైతు సమస్యలు తెలిసిన వ్యక్తిగా వారి బాగు కోసం కృషి చేస్తున్న పదవికి మంచి పేరు తీసుకురావాలని కడప మార్కెట్ కమిటీ చైర్మన్ ఐ.శివారెడ్డిని మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. ఎంపీడీవో సభాభవనంలో శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్‌ను ఎంపీపీ బాలమ్మ మండల ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో మహబూబ్‌బీ, టీడీపీ నేత బుజ్జన్నతో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల తెలుగు యువత సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా మండలంలో రైతులకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్, ఇంజనీర్లు గోపాలక్రిష్ణ, గురురాజ ప్రసాద్, సందాని, సుదర్శన్‌రెడ్డి, కల్లూరి ఓబుల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


చైర్మన్ శివారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

సీకేదిన్నె : ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు అని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమ్మవారిపల్లెలో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇది చక్కని అవకాశమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

పెండ్లిమర్రి : ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలో శుక్రవారం జరిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ ఇంటర్వ్యూలు జరిగాయి. 170 యూనిట్లకు గాను 270 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసమే సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటిని సక్రమంగా ఉపయోగించుకొని వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, ఎంపీడీవో మల్‌రెడ్డి, బ్యాంకు అధికారులు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు.

సినిమా గైడ్

కమలాపురం	
ప్రదీప్	: ఫిదా
చెన్నూరు	
కృష్ణ	: లై

మహిళలకు ఎన్నో చట్టాలు వున్నాయి

రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి భానుసాయి

చెన్నూరు : మహిళల జీవితాలు బాగుకు న్యాయమైన చట్టాలు ఎన్నో వున్నాయని ప్రతి చట్టం గురించి తెలుసుకుంటే సమాజంలో కుటుంబంలో ఇబ్బందులు లేకుండా జీవించవచ్చని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి భానుసాయి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి మాట్లాడారు. పాఠశాల స్థాయిలో చదువుకునేలా నాటి నుంచే సమాజం పట్ల జీవితం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్యవివాహాలకు విద్యార్థులు తలొగ్గదన్నారు. మొదట చదువు ఆపై పెళ్లి అన్నారు. శారీరక, మానసిక ఎదుగుదలలేని వయసులో జరిగే బాల్య వివాహాలు అనర్థాలకు తెస్తాయని తద్వారా ఒక్కో మారు జీవితం నాశనమవుతుందన్నారు. ఇందుకు ప్రత్యేకించి చట్టముందన్నారు. గృహ హింస నిరోధక చట్టం మహిళలకు వరమని దుర్వినియోగం కాకుండా చట్టం ద్వారా రక్షణ, ప్రయోజనం పొందాలన్నారు.

న్యాయవాది సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆడబిడ్డ లేకపోతే సమాజమే లేదన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. న్యాయవాది చంద్రగుప్త మాట్లాడుతూ స్త్రీ సమాజంలో బతికే వరకు నిలబడే వరకు పురుషునికి గౌరవం వుంటుందన్నారు. ఎస్ఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆడబిడ్డలను ర్యాగింగ్ చేస్తే ప్రస్తుతమున్న చట్టాల పరిధిలో కఠినమైన శిక్షలున్నాయన్నారు. ఇబ్బందికర పరిస్థితిలో ఎప్పుడు ఫోన్ చేసినా పోలీసు సిబ్బంది రక్షణనిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకాంతమ్మ, మనబిడ్డ కౌన్సిలర్ అరుణకుమారి, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెండవ అదనపు న్యాయమూర్తి బానుసాయి

ముగిసిన కార్పొరేషన్ ముఖాముఖి

కమలాపురం రూరల్ : కమలాపురంలో ఎంపీడీవో కార్యాలయం నందు అన్ని రకాల కార్పొరేషన్లకు ముఖాముఖి ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో త్రిమూర్తిరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రకాల కార్పొరేషన్లకు గాను 722 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని శుక్రవారం నిర్వహించిన ముఖాముఖిలో 455 మంది పాల్గొన్నారని ఇందులో ఎస్సీ 241 మందికి గాను 150మంది బీసీ 187 మందికి గాను 109, మైనార్టీకి సంబంధించి 170మందికి గాను 103 మంది కాపు వర్గానికి సంబంధించిన వారు 116 మందికిగాను 90, ఎస్టీ 8 మందికి గాను ముగ్గురు మాత్రమే పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫీల్డు ఆఫీసర్ సత్యానారాయణరెడ్డి, కోగటం మేనేజర్ రామాచారి, ఆర్‌జీబీ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, ఆర్‌జీబీ పెద్దచెప్పలి మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వల్లూరు : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లె వద్ద పాపాగ్ని నది నుంచి ఇసకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో స్థానిక ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి నాలుగు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

పీఈటీ శివశంకర్‌రెడ్డికి సన్మానం

కమలాపురం రూరల్ : మండల పరిధిలోని చిన్నచెప్పలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసి ప్రమోషన్‌పై ముద్దనూరు మండలానికి వెళ్లిన వ్యాయామ ఉపాధ్యాయుడుని శుక్రవారం పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి శివశంకర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, పాఠశాల చైర్మన్ పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ బకాయిలు చెల్లించాలి

వేంపల్లె: ఉచితంగా విద్యుత్ పొందుతున్న వినియోగదారులు బకాయిలను 20వ తేదీలోగా చెల్లించాలని ఏడీఈ శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇస్తున్న 50 యూనిట్ల ఉచిత విద్యుత్ పరిధి దాటి వాడుకున్న వారు చెల్లించాలన్నారు. వేంపల్లె, వేముల, చక్రాయపేట, సింహాద్రిపురం, తొండూరు మండలాల్లో ఉచిత విద్యుత్ వినియోగదారులు సర్వీస్‌పై ఉన్న బకాయిలు ఏఈ వద్ద చెల్లించి రసీదు పొందాలని కోరారు. నెలకు 50 యూనిట్లలోపు ఉచితమని ఆతర్వాత బిల్లు చెల్లించకుంటే ఎలాంటి నోటీసు లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన ఒక ప్రటనలో హెచ్చరించారు.

నందనవనంలా పోలీస్‌స్టేషన్ ప్రాంగణం


పచ్చదనం పరుచుకున్న పోలీస్‌స్టేషన్ ప్రాంగణం

తొండూరు: పచ్చదనం ఉన్నచోటే ఆరోగ్యం, ఆహ్లాదకరం, పరిసరాలు పచ్చదనంతో ఉంటే కార్యాలయాలకు శోభసంతరికుంటుంది. ఆలయాల్లో పూలమొక్కలు, ప్రభుత్వ గృహసముదాయాలకు పచ్చదనం అందానిస్తాయి. ఇలాంటి పచ్చటి తోరణాల మధ్య పలు కార్యాలయాలు పరఢవిల్లుతున్నాయి. వందేళ్ల చరిత్ర కలిగిన విద్యాలయాల్లో నాటిన మొక్కలు నేడు నీడనిస్తున్నాయి. మండల కేంద్రమైన తొండూరులో పలు కార్యాలయాల ఆవరణలో పచ్చదనం పరుచుకుంది. తొండూరు రక్షకభటుల నిలయం ప్రాంగణంలో దాదాపు మూడు ఎకరాల్లో 400 మొక్కలు ఉన్నాయి. వాటిని పోలీసులు ఆహ్లాదకరంగా పెంచుతున్నారు. వాటికి డ్రిప్ పరికరాల ద్వారా నీటితడులు అందిస్తున్నారు. మండలంలోని రైతుల సహకారంతో వాటిని పోషిస్తున్నారు. ఆ స్టేషన్‌లో దాదాపు మూడేళ్లుగా పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు మొక్కలపై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నారు. విధులకు వస్తూనే ముందుగా మొక్కలున్న చోటకు వెళ్లి వాటిని పరిశీలిస్తూ ఉండేవారు. మొత్తమ్మీద స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది అందరు కూడా ఈ మొక్కలకు బాగా నీరు అందిస్తూ చక్కగా చూసుకుంటున్నారు. తొండూరు పోలీసుల స్ఫూర్తితో అందరు మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుదాం.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నందుకా విమర్శ
టీడీపీ నేతల సూటి ప్రశ్న


విలేకరులతో మాట్లాడుతున్న షబ్బీర్, బాలస్వామిరెడ్డి తదితరులు

వేంపల్లె: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారా అంటూ ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ నేతలు ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌ను ప్రశ్నించారు. 13 కేసులు ఉన్న జగన్‌కు బాబు గురించి మాట్లాడే హక్కు లేదని మైనార్టీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి షబ్బీర్, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారం దక్కలేదనే నిరాశ నిస్పృహలతో వైఎస్ జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఇలాగే నోటికొచ్చినట్లు మాట్లాడుతూ పోతే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో దేవస్థాన సభ్యులు తిప్పారెడ్డి, ఎంపీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదతో పంచాయితీలు పరిపుష్టి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం: చెత్త నుంచి సంపదతో పంచాయితీలు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తాయని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పలు మండలాల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల అభివృద్ధితో పాటు కేంద్రం సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఉపసర్పంచు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఒడిదుకుల నుంచి ప్రారంభమైన ఈ కేంద్రం ఎంతో అభివృద్ధి చెంది ఈ రోజు కడప జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి అధికారులు వచ్చి శిక్షణ తీసుకోవడం గర్వకారణమన్నారు. ఈ కేంద్రం పూర్తి అభివృద్ధికి సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఉపసర్పంచ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సురేష్, ఏపీడీ నాగరాజు, రీసోర్స్ పర్సన్లు రామ్మూర్తి, ఈఓపీఆర్డీ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమమైనింగ్‌పై న్యాయం చేయకపోతే ధర్నా చేస్తాం

వేంపల్లె: తాళ్లపల్లె సమీపంలో అక్రమమైనింగ్‌పై సరైన న్యాయం జరగకపోతే ధర్నా చేపడతామని జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అక్రమమైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎర్రగుంట్ల భూగర్భగనుల శాఖ అధికారులకు కలెక్టర్ లేఖ రాసినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీనిపై భూగర్భగనుల శాఖ అధికారులను కలిసి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

తాళ్లపల్లె గ్రామ సర్వేనెంబర్ 214బి, 224లో 16 ఎకరాల ముగ్గురాయి మైనింగ్ కోసం దరఖాస్తు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో కోర్టుకు వెళ్లారని రెండు నెలల్లోపు దరఖాస్తుపై చర్యలు చేపట్టాలని కోర్టు ఆదేశించిందన్నారు. కానీ సమీపంలో ఉన్న ఇతర సర్వేనెంబర్లలో అక్రమ మైనింగ్ జరుగుతోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు తప్పుడు సమాచారంతో సహకరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై మళ్లీ కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయగా చర్యలు చేపట్టాలని గత నెల 24న భూగర్భగనుల శాఖ అధికారులకు, ఆర్డీఓకు, తహసీల్దార్‌కు లేఖలు పంపినా ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇలాగే జాప్యం చేస్తే న్యాయం కోసం ఎర్రగుంట్ల భూగర్భగనుల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానని ఒక ప్రకటనలో తెలిపారు.

చదువుతో నిమిత్తం లేకుండా లైసెన్సులు మంజూరు

పులివెందుల టౌన్: చదువుతో నిమిత్తం లేకుండా ఆటో రిక్షా డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ ఇస్తామని ఎంవీఐ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16వ తేదీన మెగా ఆటోరిక్షా ట్రాన్స్‌పోర్ట్ ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటో రిక్షా డ్రైవర్లు నాన్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఏడాది పూర్తయిన వారికి ఎల్ఎల్ఆర్ ఇస్తామన్నారు.

రమామణి సేవలు ప్రశంసనీయం

సింహాద్రిపురం: ఉపాధ్యాయురాలు రమామణి సేవలు ప్రశంసనీయమని ప్రధానోపాధ్యాయుడు బాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బలపనూరు ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు రమామణిని సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు ఏళ్ల విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టేందుకు ఆమెపాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లలగూడూరులో గ్రామసభ

వేముల: గొల్లలగూడూరులో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నయ్య మాట్లాడుతూ ఏవైనా భూసమస్యలు ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతుల భూసమస్యలను తీర్చేందుకు ఈ గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. రైతుల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రవిశంకర్, సర్వేయర్ నాగరాజు, వీఆర్వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయించాలి

పులివెందుల టౌన్: ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ హేమకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యాన్ని బెల్టుషాపు నిర్వాహకులకు విక్రయిస్తే సంబంధిత షాపును సీజ్ చేస్తామన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు షాపులు తెరవాల్సి ఉంటుందన్నారు.

జడ్పీటీసీని సన్మానించిన అధికారులు


జడ్పీటీసీని సన్మానిస్తున్న అధికారులు

సింహాద్రిపురం: దక్షిణ భారత దేశంలోనే ప్రథమస్థానంలో ఉత్తమ పంచాయతీకి ఎంపిక కావడానికి కృషిచేసిన జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిని అడిషనల్ పీడీ సురేష్ తదితరులు సన్మానించారు. హిమకుంట్లలో ఉపాధి పనుల ద్వారా అత్యుత్తమ పనులు చేయించి ఉత్తమ పంచాయతీగా ఎన్నికయ్యేందుకు కృషిచేశారన్నారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, టీడీపీ నాయకత్వ శిక్షణ శిబిర డైరెక్టర్ రామగోపాల్‌రెడ్డి, ఏపీడీ నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ

వేంపల్లె: రైతుల సమస్యలను పరిష్కరించేందుకే రైతు సేవలో రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ముతుకూరులో శుక్రవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో సర్వేస్ ఇనాం భూముల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులకు పంపి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పైప్‌లైన్ వేసి రహదారి ఏర్పాటు చేయాలి


కాల్వను పరిశీలిస్తున్న ఏఈ, రైతులు

లింగాల: లింగాలలోని 31వ కిలోమీటర్ సమీపంలో కుడికాల్వలో పైప్‌లైన్ ఏర్పాటుచేసి ఇరువైపులా రహదారి ఏర్పాటు చేయాలని లింగాల రైతులు కోరారు. శుక్రవారం నీటి పారుదల శాఖ ఏఈ ప్రదీప్‌రెడ్డి కాల్వ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ భర్త చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి రైతులు కాల్వ అవతలివైపునకు వెళ్లాలంటే చుట్టూ 5కిలోమీటర్లు తిరిగి వెళ్తున్నారన్నారు. ఈ ఏడాది సీబీఆర్ నుంచి లింగాల కుడికాల్వలోకి నీరు వచ్చేలోపు ఇక్కడ కాల్వలో పైప్‌లైన్ ఏర్పాటుచేసి మట్టితో పైపును పూడ్చి రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. ఏఈ మాట్లాడుతూ వారం రోజుల్లో పైప్‌లైన్ వేసి రహదారి ఏర్పాటుచేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలి

వేంపల్లె: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. తాళ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో హెడ్‌టీచర్ శ్రీనునాయక్, ఉపాధ్యాయులు కమలకుమారి నడుమ వివాదం జరగడం విచారకరమన్నారు. పోలీసుల వరకు వెళ్లడంతో సర్దిచెప్పి హెడ్‌టీచర్‌తో టీచర్‌కు క్షమాపణలు చెప్పించామన్నారు. ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.